www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 268 | మంగళవారం | 20 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

పంచాంగం

శ్రీచాంద్రమాన విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్రమాసం
తిథి : శుక్ల. తదియ సా.5.00 వరకు అనంతరం చవితి
నక్షత్రం: అశ్వని రా.8.01 వరకు అనంతరం భరణి
వర్జ్యం: సా.4.05 - 5.40 వరకు తిరిగి తె.5.24 - 6.57 వరకు (తెల్లవారితే బుధవారం)
దుర్ముహూర్తం : ఉ.8.32 - 9.20 వరకు తిరిగి రా.10.55 - 11.43 వరకు
రాహుకాలం: ప.3.00 - 4.30 వరకు
యమగండం: ఉ.9.00 - 10.30 వరకు
శుభసమయాలు: లేవు

తొలి అడుగు

ఎన్నికల నాటికల్లా నిజమైన, బలమైన ఫెడరల్ ఫ్రంట్

- ఆ దిశగా ఇది అడుగు
- కొన్నింటిపై ఏకాభిప్రాయం కుదిరింది
- ఇంకా చాలా మందితో మాట్లాడిన తరువాత ఫ్రంట్‌కు తుది రూపు
- ఫ్రంట్‌కు సమష్టి నాయకత్వమే
- జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయం ప్రబల అవసరం
- కోల్‌కతాలో మమతా బెనర్జీతో రెండు గంటల పాటు చర్చించిన తరువాత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటన
- దేశాభివృద్ధి, రైతాంగ సమస్యలపై చర్చించుకున్నాం
- మా మధ్య అనేక విషయాలు చర్చకు వచ్చాయి
- ఇంకా పలు పార్టీలతో మాట్లాడాలి
- దేశానికి ఇష్టారాజ్యం చెల్లదు
- సంయుక్త మీడియా సమావేశంలో మమతా బెనర్జీ



మన తెలంగాణ / హైదరాబాద్ : రానున్న ఎన్నికలకల్లా బలమైన రాజకీయ శక్తి ఆవిర్భవిస్తుందని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా పెద్ద ఎజెండాతో భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలతో నిజమైన 'ఫెడరల్ ఫ్రంట్' ఏర్పాటవుతుందని, ఇప్పుడు కోల్‌కతాలో మమతా బెనర్జీతో జరిగిన చర్చలు తొలి అడుగు మాత్రమేనని సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో రెండు గంటలకు పైగా చర్చలు జరిపిన కెసిఆర్.. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఆవశ్యకతను వివరించారు. అనంతరం మమతా బెనర్జీతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రజలంతా బలమైన ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. ప్రస్తుతం మమతా బెనర్జీతో జరిగిన చర్చలు ఈ ఫ్రంట్ ఏర్పాటుకు తొలి అడుగు అని, చర్చలు సుహృద్భావ వాతావరణంలో సంతృప్తికరంగా జరిగాయన్నారు. నిజమైన ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నామని, ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని చెప్పారు. కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా ఉన్న అనేక పార్టీలతో ఇంకా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఇద్దరి మధ్య జరిగిన చర్చలతోనే ఫ్రంట్‌కు తుదిరూపు రాదని, ఇంకా భావసారూప్యత కలిగిన పార్టీలతో చర్చల తర్వాత దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు. ఇప్పుడు జరిగిన చర్చల్లో కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందని, భవిష్యత్తులో మరిన్ని సమావేశాలు జరుగుతాయని,

తరువాయి 6లో



కాళిక తోడిక

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సుదీర్ఘ చర్చల తరువాత కోల్‌కతా కాళీమాతను దర్శించుకున్న సిఎం కెసిఆర్

తోడుగా కె. కేశవరావు, ఎంపి కవిత, సుభాష్‌రెడ్డి తదితరులు

మమతా బెనర్జీతో చర్చల అనంతరం కోల్‌కతాలోని కాళిమాతను సిఎం కెసిఆర్ దర్శించుకున్నారు. చర్చల సందర్భంగానూ, ఆలయ సందర్శనలోనూ కెసిఆర్ వెంట పార్టీ సెక్రెటరీ జనరల్ కె.కేశవరావు, ఎంపి కవిత, పార్టీ రాజకీయ వ్యవహారాల కార్యదర్శి సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ నెల తొలి వారంలో ప్రత్యామ్నాయ రాజకీయాల గురించి కెసిఆర్ మాట్లాడిన వెంటనే మమతా బెనర్జీ మద్దతు తెలిపినట్లుగా తెలంగాణ ప్రభుత్వ వర్గాలు తెలియజేసిన తర్వాత స్వయంగా కోల్‌కతాకు వెళ్ళి ఆమెతో భేటీ కావడం విశేషం.

టెన్త్ ప్రశ్నపత్రం లీక్!

7లో

- లీక్ కాదు, మాల్ ప్రాక్టీస్
- సస్పెండ్ చేశాం
- మామూలుగానే నేటి పరీక్ష : పాఠశాల విద్య కమిషనర్



ఏప్రిల్ 19 నుంచి రైతు చెక్కులు

పంపిణీ ప్రారంభించనున్న సిఎం కెసిఆర్

అధికారులతో సమీక్షలో సిఎస్ ఎస్‌కె జోషి వెల్లడి


మన తెలంగాణ/ హైదరాబాద్ : రైతులకు పంట పెట్టుబడి కింద ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో వచ్చే నెల 19న ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రారంభించనున్నారు. ఇందుకోసం వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ కె జోషి సోమవారం సమీక్ష నిర్వహించారు. రైతుల ఖాతాల వారీగా ఆధునీకరించిన భూముల వివరాలను రెవెన్యూ శాఖ ఈ నెల 28లోగా వ్యవసాయ శాఖకు అందజేయాలని ఆదేశించారు. రైతులకు అందించనున్న పెట్టుబడి సహాయంపై సచివాలయంలో సోమవారం రెవెన్యూ, ఆర్థిక, వ్యవసాయ, ఎన్‌ఐసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాలకు సంబంధించి మొత్తం విస్తీర్ణం, సర్వేనెంబర్లు, ఖాతాలు, రైతుల వివరాలు తహసీల్దార్‌లతో

తరువాయి 6లో

జల విషాదం

- ఈతకు చెరువులో దిగి నలుగురు విద్యార్థుల దుర్మరణం
- భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలంలో ఘటన

7లో



ఇంకా చర్చకు నోచుకోని అవిశ్వాసాలు

10లో

మరో దాణా కేసులో దోషిగా లాలూ

11లో

కల్యాణ వైభోగమే

కల్యాణలక్ష్మి మొత్తం రూ.1,00,116

రూ. 75,116 నుంచి లక్షా నూటపదహారుకు పెంపు

అసెంబ్లీలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటన

> ఆడపిల్లల కన్నీరు తుడిచి వారి తలపై కల్యాణాక్షతలు చల్లిన ఈ పథకం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠను పెంచింది. కల్యాణ లక్ష్మి వ్యక్తిగతంగా నా హృదయానికి ఎంతో దగ్గరైన పథకం. అంతకంటే ఎక్కువగా ఈ రాష్ట్ర ప్రజలు మెచ్చిన పథకం - సిఎం



మన తెలంగాణ / హైదరాబాద్ : కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల్లో భాగంగా అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సోమవారం శాసనసభలో ప్రకటించారు. పెరుగుతున్న ధరల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని రూ.75,116 నుండి రూ. 1,00,116 (లక్ష నూట పదహార్ల)కు పెంచుతున్నట్లు తెలిపారు. పేదింటి పెళ్లికి మరింత చేయూతనిస్తూ ఆర్థిక సాయం పెంపు

తరువాయి 6లో

కుంచెపోటు



రాహుల్‌గాంధీనే.. సుడిగాలి పర్యటన చేస్తున్నారు!



కుల వెలి

- వరంగల్ జిల్లాలో ఖాప్ పంచాయితీ

మన తెలంగాణ/ కమలాపూర్ : పంచాయతీల్లో కుల పెద్దల మాటలు వినని కుటుంబాలపై కుల బహిష్కరణతో వేటు వేశారు. కుల పెత్తనం చెలాయిస్తూ ఇలా ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ఏడు కుటుంబాలను గ్రామంలో వెలి వేసి అసాంఘికాన్ని చాటుకున్నారు. వరంగల్ జిల్లా కమలాపూర్ మండలంలోని భీంపెల్లి గ్రామంలో చోటు చేసుకున్న ఘటన


తరువాయి 6లో

తేడా రాకుండా ఓటు

రాజ్యసభ ఎన్నికల్లో ఓటింగ్‌పై టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలకు మాక్ పోలింగ్

మూడు దఫాలుగా నిర్వహణ, నేడు సాయంత్రం తెలంగాణ భవన్‌లో తొలి విడత

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలోని మూడు రాజ్యసభ ఎన్నికలకు ఎన్నిక అనివార్యమవడంతో ఓటింగ్‌లో తడబాటు లేకుండా టిఆర్‌ఎస్ ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. అధికార పార్టీ పక్కాగా అన్ని స్థానాలు గెలవనున్నప్పటికీ ప్రాధాన్యతా ఓటింగ్ పద్ధతి కావడంతో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా ఉండేందుకు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలకు మూడు దఫాలుగా మాక్ పోలింగ్ నిర్వహించాలని భావిస్తోంది. తొలి విడత మాక్ పోలింగ్‌ను మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు తెలంగాణ భవన్‌లో జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. తొలుత ఎంఎల్‌ఎలందరికీ రాజ్యసభ ఎన్నికల్లో ఓటింగ్ విధానంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించనున్నారు. టిఆర్‌ఎస్ తరుపున జోగినిపల్లి సంతోష్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండా ప్రకాశ్, కాంగ్రెస్ తరుపున బలరాం నాయక్ బరిలో ఉన్నారు. దీంతో ఒక్కో ఎంఎల్‌ఎ నాలుగు ప్రాధాన్యతా ఓట్లు వేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం టిఆర్‌ఎస్‌కు సొంతంగా 82 ఎంఎల్‌ఎలు, మద్దతిస్తున్న ఎంఐఎంకు ఏడుగురు ఎంఎల్‌ఎలు కలిపి 89 మంది మద్దతు ఉంది. వీరికి తోడు ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు కూడా అనుకూలంగా ఉన్నారు. ఒక్క ఎంపి స్థానాన్ని గెలిపించుకునేందుకు 30 ఓట్లు అవసరం. దీంతో ఒక్కో అభ్యర్థికి 30 మంది ఎంఎల్‌ఎల చొప్పున కేటాయిస్తే సరిపోతుంది. తమకున్న ఎంఎల్‌ఎల మద్దతు ఆధారంగా ఒక అభ్యర్థికి 33, మిగిలిన ఇద్దరు అభ్యర్థులకు 32 మంది



తరువాయి 6లో



ఆరు వారాలు ఆగండి

- కోమటిరెడ్డి, సంపత్ కుమార్ శాసన సభ్యత్వాల రద్దుపై ఇసికి హైకోర్టు ఆదేశాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్ కుమార్‌ల శాసన సభ్యత్వాల రద్దు నిర్ణయంలో ఆరు వారాలపాటు ఏ విధమైన చర్యలు తీసుకోరాదని

తరువాయి 6లో

రైల్వే స్టేషన్లు, బోగీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత : రైల్వే జిఎం వినోద్‌కుమార్



మన తెలంగాణ/హైదరాబాద్: రైల్వే స్టేషన్లు, రైలు బోగీలను పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. రైల్వే స్టేషన్ల రీ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించాలని డివిజనల్ రైల్వే మేనేజర్లను సూచించారు. సికింద్రా బాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం వివిధ ప్రిన్సిపల్ హెడ్‌లతో సమీక్ష నిర్వహించారు. అలాగే సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వే మేనేజర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, రైల్వే పరిసరాలు, బోగీలలోని పరిశుభ్రత పట్ల ప్రయాణికులు సంతృప్తి చెందేలా పనివిధానం ఉండాలన్నారు. పరిశుభ్రత పనితీరుపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. భద్రత చర్యలు, ప్రస్తుతం జరుగుతున్న పనులపై వినోద్‌కుమార్ ఆరా తీశారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ జాన్‌థామస్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్. మధుసూదన్‌రావు, ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ పద్మిని రాధాకృష్ణన్, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఎం.జి. శేఖరమ్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయ్ అగర్వాల్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలి కమ్యూనికేషన్స్ ఇంజనీర్ వినయ్ మోహన్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు

మే 8న 'దోస్త్' నోటిఫికేషన్

దోస్త్‌తో ఇ-పాస్‌కు, ఎంసెట్‌కు లింక్

జులై 2 నుంచి డిగ్రీ సెమిస్టర్ తరగతులు

దోస్త్ సమావేశంలో కీలక నిర్ణయాలు



మన తెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు మే 8న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ(దోస్త్) నోటిఫికేషన్ విడుదల కానుంది. మే 10 నుంచి 26 వరకు రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. సోమవారం ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి అధ్యక్షతన దోస్త్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ స్పెషల్ సిఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య దోస్త్ దరఖాస్తులో విద్యార్థులకు సూచనలతో కూడిన మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్, దోస్త్ కన్వీనర్ ఆర్.లింబాద్రి, మరో వైస్ ఛైర్మన్ వి.వెంకటరమణ, ఆరు యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్లు, రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. ఏప్రిల్‌లోగా యూనివర్సిటీలు అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తిగా దోస్త్ వెబ్‌సైట్‌లో డాటా అప్‌లోడ్ చేయాలని విసిలకు సూచించారు. గతంలో దోస్త్ దరఖాస్తు ప్రక్రియలో, సీట్ల కేటాయింపులో తలెత్తిన పలు సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. సమస్యలు పున రావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని చర్చించారు. దోస్త్ దరఖాస్తు ప్రక్రియ సరళంగా ఉండేలా వెబ్‌సైట్‌లో మార్పులు తీసుకురావాలని నిర్ణయించారు.

సిఇసి విద్యార్థులకు బి.కాంలో 60 శాతం సీట్లు

ఇంటర్మీడియేట్‌లో సిఇసి గ్రూప్ చదివిన విద్యార్థులకు బి.కాం కోర్సులో 60 శాతం సీట్లు కేటాయించాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే హెచ్ఇసి విద్యార్థులకు బి.ఎ కోర్సులో 50 శాతం సీట్లు కేటాయించనున్నారు. దాంతోపాటు పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు వారు చదివిన కోర్సును బట్టి డిగ్రీ ద్వితీయ సంవత్సరం లేదా ప్రథమ సంవత్సరంలో సీట్లు కేటాయించాలని నిర్ణయించారు.

దోస్త్‌తో ఇ-పాస్‌కు లింక్

డిగ్రీలో ప్రవేశాల కోసం దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం మరోసారి ఇపాస్‌లో దరఖాస్తు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నారు. దోస్త్‌లో పొందుపరిచిన వివరాలను నేరుగా ఇ–పాస్ వెబ్‌సైట్ అనుసంధానం చేయాలని నిర్ణయించారు. విద్యార్థులు దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో వారి కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రంతో పాటు ఇతర ధృవపత్రాలు సిద్దంగా ఉంచుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. స్కాలర్‌షిప్ కోసం మళ్లీ ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. దాంతోపాటు దోస్త్‌ను ఎంసెట్‌కు కూడా లింక్ చేయాలని నిర్ణయించారు. కొంతమంది విద్యార్థులు రెండు చోట్ల సీట్లు పొంది చివరకు ఒక సీటు వదులుకుంటున్నారు. దాంతో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. ఈ సమస్య పునరావృతం కాకుండా దోస్త్‌ను ఎంసెట్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించారు.

లై 2 నుంచి తరగతులు

వచ్చే విద్యాసంవత్సరంలో జూన్ 2వ తేదీ నుంచి డిగ్రీ సెమిస్టర్ తరగతులు ప్రారంభించాలని నిర్ణయించారు. దోస్త్ నోటిఫికేషన్ మే 8న విడుదల చేసి, మే 10 నుంచి 26 వరకు రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. రిజిస్ట్రేషన్లకు రూ.400 అపరాధ రుసుంతో మే 29 వరకు అవకాశం కల్పించనున్నారు. జూన్ 4న మొదటి సీట్లు కేటాయించి, జూన్ 5 నుంచి 12 వరకు విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టింగ్ చేసేందుకు అవకాశం కల్పిస్తారు. అలాగే జూన్ 13, 14 తేదీలలో రెండవ విడత వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించి, 19న సీట్ల కేటాయింపు, 20 నుంచి 25 వరకు రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించనున్నారు. జూన్ 26,27 తేదీలలో మూడవ విడత వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించి, 30న సీట్ల కేటాయింపు, జూలై 2 నుంచి 4 వరకు రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించాలని సమావేశంలో నిర్ణయించారు.

కోలుకున్న మండలి చైర్మన్...




మన తెలంగాణ / హైదరాబాద్ : శాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ సోమవారం నాడు మండలికి హాజరయ్యారు. ఇటీవల ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలో కంటికి గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందారు. దీంతో ఆయన బడ్జెట్ సమావేశాల సందర్భంగా మండలికి హాజరుకాలేకోయారు. పూర్తిగా కోలుకోవడంతో మంగళవారం ఉదయం నుండి తన చైర్మన్‌గా తన విధులను ప్రారంభించారు. తొలుత మండలిలో స్వామిగౌడ్ సభ్యులందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభలో జరిగిన సంఘటనపై ఆయన విచారం వ్యక్తం చేశారు. సభ్యులందరి ఆశీస్సులతోనే త్వరగా కోలుకున్నానని చెప్పారు. సభ్యులు విరామ సమయంలో చైర్మన్‌ను కలిసి కోలుకోవడం పట్ల సంతోషం వెలిబుచ్చారు.

నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ మైనారిటీ గురకుల పాఠశాలల్లో 2018–19 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమయ్యింది. రాష్ట్రంలోని 204 మైనారిటీ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు మంగళవారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మైనారిటీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి షఫిఉల్లా తెలిపారు. సోమవారం హజ్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6 నుండి పదో తరగతి వరకు పరిమిత సంఖ్యలో ఉండే ఖాళీ సీట్లను కూడా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను మైనారిటీ విద్యార్థులు (ముస్లింలు, క్రైస్తవులు, పారసీలు, జైనులు, సిక్కులు, బౌద్ధులు) నాన్ మైనారిటీ(ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఓసి) విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 28తో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కానుందన్నారు. విద్యార్థులను ఎంపిక చేయడానికి ఈ ఏడాది 'డ్రా' పద్ధతిని పాటించనున్నామని, వచ్చే ఏడాది నుంచి ప్రవేశ పరీక్ష నిర్వహించి అడ్మిషన్లు ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 48,200 మంది విద్యార్థులు ఈ పాఠశాలల ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు. ప్రభుత్వం రూ.735 కోట్ల బడ్జెట్‌తో 204 పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. ప్రవేశాలకు కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షల రూపాయలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలకు మించి ఉండరాదన్నారు. వికలాంగులు, ఆర్మ్డ్ ఫోర్సెస్, ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలకు ఆదాయ పరిమితి వర్తించదని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 040–23437909 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

దిన ఫలాలు



☞ **మేషం:** కార్యక్రమాలలో విజయం. ఆప్తులు, శ్రేయోభిలాషుల నుంచి సహాయం. దేవాలయ దర్శనాలు. వ్యాపారస్తులకు శుభసూచకాలు. ఉద్యోగస్తులకు ప్రమోషన్లు.

☞ **వృషభం:** నిర్ణయాలు మార్చుకుంటారు. కార్యక్రమాలు కొంత నిరాశ పరుస్తాయి. కష్టం తప్ప ఫలితం కనిపించదు. వ్యాపారస్తులకు ఒత్తిళ్లు. ఉద్యోగులకు మార్పులు.

☞ **మిథునం:** ప్రముఖ వ్యక్తులు పరిచయం. శుభవార్తా శ్రవణం. విందులువినోదాలు. ముఖ్య కార్యక్రమాలలో విజయం. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం.

☞ **కర్కాటకం:** కొత్త ఉద్యోగాలు దక్కించుకుంటారు. ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. ప్రతిభ వెలుగుచూస్తుంది. వ్యాపారస్తులకు లాభాలు. ఉద్యోగులకు అనుకూలం. కళాకారులకు అవార్డులు.

☞ **సింహం:**ఆదాయానికి మించిన ఖర్చులు. దూరప్రయాణాలు. దేవాలయ దర్శనాలు. కుటుంబసభ్యులతో వైరం. వ్యాపారస్తులకు నిరుత్సాహం. ఉద్యోగులు మరింత కష్టపడాలి. పారిశ్రామికవేత్తలకు ఒత్తిళ్లు.

☞ **కన్య:** దీర్ఘకాలిక సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. రుణాలు చేయాల్సిన పరిస్థితి. ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. వ్యాపారులు కాస్త నిరాశ చెందుతారు. ఉద్యోగులకు పనిఒత్తిడులు. కళాకారులకు అవకాశాలు చేజారవచ్చు.

☞ **తుల:** ప్రముఖ వ్యక్తులు పరిచయం. శుభవార్తలు వింటారు. ఒక సమాచారం ఊరటనిస్తుంది. బంధువర్గంతో చర్చలు. వ్యాపారులు లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు బాధ్యతలు పెరుగుతాయి. రాజకీయవేత్తలు పదవులు స్వీకరిస్తారు.

☞ **వృశ్చికం:** సమస్యల నుంచి బయటపడతారు. ఆలోచనలు అమలులో ముందడుగు వేస్తారు. కార్యసిద్ధి. వస్తులాభాలు. వ్యాపారులు పెట్టుబడులు అందుకుంటారు. ఉద్యోగస్తులకు మంచి గుర్తింపు. పారిశ్రామికవేత్తల కృషి ఫలిస్తుంది.

☞ **ధనుస్సు:** కుటుంబ సమస్యలు వేధిస్తాయి. ఆకస్మిక ప్రయాణాలు. స్నేహితులతో తగాదాలు. దేవాలయ దర్శనాలు. వ్యాపారులకు కొన్ని ఇబ్బందులు. ఉద్యోగస్తులు విధుల్లో అప్రమత్తంగా మెలగాలి. కళాకారులకు అంతగా అనుకూలించదు.

☞ **మకరం:** రాబడికి మించిన ఖర్చులు. కొన్ని కార్యక్రమాలు వాయిదా వేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. వ్యాపారులు ఆచితూచి వ్యవహరించాలి. ఉద్యోగులకు మార్పులు. రాజకీయవేత్తల యత్నాలు ముందుకు సాగవు.

☞ **కుంభం:** నూతన వ్యక్తులు పరిచయం.వాహన సౌఖ్యం. ఉద్యోగప్రాప్తి. పాతస్నేహితులను కలుసుకుంటారు. వ్యాపారులు అనుకున్న లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగులకు కొత్త హోదాలు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ ఆహ్వానాలు.

☞ **మీనం:** అప్పులు చేస్తారు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబసభ్యులతో విభేదాలు. శారీరక రుగ్మతలు. దూరప్రయాణాలు. వ్యాపారులకు లాభా లు కనిపించవు. ఉద్యోగులకు శ్రమాధిక్యం. కళాకారులకు అవకాశాలు చేజారవచ్చు.



మండలానికో వ్యవసాయ గిడ్డంగి : మంత్రి హరీశ్‌రావు

మన తెలంగాణ/ హైదరాబాద్ : రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మండలానికో వ్యవసాయ గిడ్డంగి నిర్మించాలని అనుకుంటున్నామని మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వ్యవసాయ మార్కెటింగ్ గోదాములు ఏర్పాటు చేయాలని సిఎం కెసిఆర్ తమ శాఖను ఆదేశించారన్నారు. గతంలో మంజూరు కాని వాటిలో 164 మండలాల్లో గోదాములను నిర్మిస్తామన్నారు. ఇందుకోసం రూ. 1024 కోట్లు వ్యయం కాగలదని ప్రభుత్వం అంచనా వేసిందని, నాబార్డు సహకారంతో ఇప్పటి వరకు రూ. 818 .14 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా టిఆర్ఎస్ సభ్యులు చల్లా ధర్మారెడ్డి, బానోత్ మదన్‌లాల్ అడిగిన ప్రశ్నకు హరీష్ సమాధానం ఇచ్చారు. ఇప్పటి వరకు నిర్మాణం పూర్తి చేసిన 307 గోదాముల్లో 185 గోదాములు పౌరసరఫరాల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖలకు అద్దెకు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు గోదాముల్లో సరుకు నిల్వలను చేసి ఎక్కువ మొత్తంలో అద్దెల రూపంలో ఖర్చు పెట్టాల్సి వచ్చేదని, ఆ భారం ఇకపై అంతగా ఉండదన్నారు. ప్రభుత్వ సంస్థలైన పౌరసరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్, నా ఫెడ్, హాకా సంస్థలకు ఏడాదికి రూ. 10 కోట్లు ఆదాయం మిగులుతున్నట్లు హరీష్ రావు తెలిపారు.

పంట బీమా టెండర్లు ఖరారు!

❑ ఎన్ఐసికి 15 జిల్లాల అప్పగింత ❑ రెండు క్లస్టర్లు ఎఐసి, ఒకటి దక్కించుకున్న టాటా ❑ గత ఏడాది కంటే పెరిగిన ప్రీమియం రేట్లు ! ❑ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే భారం

మన తెలంగాణ/హైదరాబాద్ : వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం అమలునకు మూడు ఇన్సూరెన్సు కంపెనీలు టెండర్లు దక్కించుకున్నాయి. ఇందులో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఎన్ఐసి), వ్యవసాయ బీమా కంపెనీ (ఎఐసి), టాటా బీమా కంపెనీలు ఉన్నాయి. మొత్తంగా 13 బీమా కంపెనీలు బిడ్డింగ్ పాల్గొనగా టెండర్లలో తక్కువ (ఎల్1) ప్రీమియం రేట్లను కోట్ చేసిన మూడు కంపెనీలను ఎంపిక చేశారు. గత ఏడాదితో చూస్తే ఈసారి ప్రీమియం రేటు కాస్త పెరిగినట్లు తెలిసింది. పత్తి, వరికి క్లెయిమ్స్ అధిక మొత్తంలో చెల్లిస్తున్నందున ఈ పంటలకు ఎక్కువ ప్రీమియం రేటును కంపెనీలు కోట్ చేసినట్లు సమాచారం. అయితే ప్రభుత్వం వీటిని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. వాస్తవానికి ప్రతి ఏడాది మే, జూన్‌లో పంటల బీమా నోటిఫికేషన్ విడుదల చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎక్కువ మంది రైతులను కవరేజి చేసేందుకు ఈసారి ముందస్తుగానే ఈ ప్రక్రియను ప్రారంభించాయి. రాష్ట్రాన్ని ఆరు క్లస్టర్లు (విభాగాలు)గా విభజించి పంటల బీమా అమలు చేస్తున్నారు. క్లస్టర్1 లో ఆదిలాబాద్, మంచిర్యాల, కొమరంభీం, జయశంకర్ భూపాల్‌పల్లి, సిద్ధిపేట జిల్లాలు ఉన్నాయి. క్లస్టర్2 లో నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి, రంగారెడ్డి జిల్లాలను, క్లస్టర్3లో పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లా, జనగామ, క్లస్టర్4 లో ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలను, క్లస్టర్5 లో భద్రాద్రి, వరంగల్ (అర్బన్), వరంగల్ (గ్రామీణ), వనపర్తి జిల్లాలు, క్లస్టర్6 లో మేడ్చల్, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలున్నాయి. ఇందులో క్లస్టర్1,2,6 అంటే 15 జిల్లాల్లో పంటల బీమా అమలును ఎన్ఐసి దక్కించుకుంది. క్లస్టర్ 4,5లో ఎఐసి, క్లస్టర్ 3లో టాటా కంపెనీ పంటల బీమా అమలు చేయనుంది. బీమా కంపెనీలు కోట్ చేసిన ప్రీమియం రేట్లు రైతులపై ఎటువంటి భారం పెంచకున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఆర్థికభారం మోపనున్నాయి. ఈ రెండు పథకాల్లో బీమా కంపెనీలు కోట్ చేసే అదనపు సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 2017 వానాకాలంలో 8.60 లక్షల మంది రైతులు, యాసంగిలో 1.60 లక్షల మంది రైతులు పంటల బీమాలో నమోదైనట్లు అధికారుల ద్వారా తెలిసింది. పూర్తి వివరాలు అందితే ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.



బస్సులో వచ్చిన టిఆర్ఎస్ ఎంఎల్‌ఎ



మన తెలంగాణ / హైదరాబాద్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ టిఆర్ఎస్ ఎంఎల్‌ఎ కె.పి.వేకానంద శాసనసభకు బస్సులో వచ్చారు. రవాణా సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు తాను కూకట్‌పల్లి నుంచి కుత్బుల్లాపూర్ వరకు బస్సులో ప్రయాణించినట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యం లేక పోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను వెం టనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన సోమవారం మాట్లాడారు. ఉదయం సమయం లో బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే బస్సులు సౌకర్యాన్ని పెంచాలని మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారకరామ రావు, రవాణాశాఖ మంత్రి పి.మహేందర్ రెడ్డికి విజ్ఞప్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

భాషాపండితుల అప్‌గ్రేడ్‌పై కోర్టు కేసు పరిష్కారానికి చర్యలు



మన తెలంగాణ / హైదరాబాద్ :భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసే విషయంలో న్యాయస్థానంలో ఉన్న కేసు పరిష్కారం అయ్యేలా తక్షణ చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ఇందుకు సంబంధించి త్వరలోనే శాషనసభ్యులు, అడ్వకేట్ జనరల్‌తో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ విషయమై చర్చించనున్నట్లు తెలిపారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి, కె.జనార్ధన్ రెడ్డి, పి.రవీందర్‌లు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ భాషా పండితుల పదోన్నతులకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, రాష్ట్రంలో 2,487 భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయడానికి ఫిబ్రవరి 2017 లో ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, అయితే కొంత మంది ఎస్‌జిటిలు ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నియామక నియమావళిని సవరించే వరకు స్కూల్ అసిస్టెంట్‌లు పదవులను భర్తీ చేయవద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

బడుగుల అభ్యున్నతిని ప్రతిబింబిస్తున్న బడ్జెట్ :వేముల వీరేశం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2018–19 బడ్జెట్ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతిని ప్రతిబింబిస్తున్నదని, రైతుల సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ రంగానికి అత్యధిక నిధులు కేటాయించడం హర్షణీయమని టిఆర్ఎస్ సభ్యులు వేముల వీరేశం అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధంగా గ్రామీణ ఆర్థిక అభివృద్ధిని సాధించే దిశగా బడ్జెట్ ఉందన్నారు. శాసనసభలో సోమవారం బడ్జెట్‌పై సాధారణ చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ మానవ జాతి వికాసానికి నాంది అయిన వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పంట పెట్టుబడి పథకం కోసం రూ.12 వేల కోట్లు, రైతు బీమా పథకానికి రూ.500 కోట్లు, బిందు, తుంపర సేద్యానికి రూ. 127 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.522 కోట్లు కేటాయించడం గర్వించదగ్గ విషయమన్నారు. మిషన్ భగీరథ ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలతో సహా రాష్ట్రంలోని ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. రైతులను రాజు చేయడమే సిఎం కెసిఆర్ లక్ష్యమని ఉద్ఘాటించారు. తెలంగాణ ప్రజల మనోభావాలకు ప్రతిరూపంగా, వారి జీవితాలకు మెరుగులు దిద్దే విధంగా బడ్జెట్ ఉందన్నారు. వ్యవసాయం పట్ల ప్రభుత్వ సానుకూల చర్యలతో ప్రజలు రైతు రాజ్యాన్ని చూడనున్నారన్నారు. ఆరు దశాబ్దాలుగా విధ్వంసం జరిగిన గడ్డపై ప్రారంభోత్సవాల శిలాఫలకాలు వెలుస్తుంటే ప్రతిపక్షాలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారని, ఇప్పటికైనా ప్రతిపక్షం ఆలోచన విధానాలు మారాలని, విమర్శల కోసం విమర్శలు కాకుండా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో లోపాలు జరిగితే విమర్శించాలన్నారు.

వివిధ వర్గాలకు ఆర్‌టిసి రాయితీలు రూ.580 కోట్లు

మంత్రి మహేందర్ రెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించేందుకు వివిధ వర్గాలకు ఇచ్చే రాయితీల వల్ల ఏటా రూ.580 కోట్ల భారం పడుతోందని రవాణా శాఖ మంత్రి మహేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పల్లా రాజేశ్వర రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, కె.నారాయణ రెడ్డిల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ హైదరాబాద్, వరంగల్ నగరాల్లో సిటి ఆర్డినరీ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు వికలాంగులకు బస్‌పాసులను జారీ చేస్తున్నామన్నారు. జిల్లాల్లో డిలక్స్ సర్వీసుల వరకు 50 శాతం రాయితీ సదుపాయాన్ని సమకూర్చుతున్నట్లు వివరించారు. విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, జర్నలిస్టులు ఇలా వివిధ వర్గాలు రాయితీ పాసులు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 97 ప్రధాన బస్‌స్టేషన్లు, డిపోల్లో మౌలిక సదుపాయాలు, వికలాంగులకు సదుపాయాలు కల్పించడానికి గత బడ్జెట్‌లో రూ.60 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య ఉద్యోగుల జీతాలు పెంచాం



మన తెలంగాణ / హైదరాబాద్ : గ్రామ పంచాయితీల్లో పని చేసే పారిశుద్ధ్య ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం 50 శాతం మేరకు జీతాలు పెంచినట్లు పంచాయితీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు డి.రాజేశ్వర్ రావు, ఎన్.రాములు నాయక్‌లు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ అవసరం మేరకు కాలానుగుణంగా పంచాయితీల్లో పారిశుద్ధ్య ఉద్యోగులను తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తాత్కాలిక ఉద్యోగులకు సంబంధించి జిల్లా స్థాయి కమిటి నిర్దిష్ట పరచిన రేట్ల ప్రకారం చెల్లించడం జరుగుతుందన్నారు. అవసరాన్ని బట్టి వేతనాల పెంపు కొనసాగుతుందన్నారు.

మాది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం

తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన విళంబినామ సంవత్సర క్యాలెండర్‌ను ఆ శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు.

ఎన్ఆర్ఐ శాఖకు వంద కోట్ల కేటాయింపు : కెటిఆర్



మన తెలంగాణ / హైదరాబాద్ : విదేశాలకు వెళ్ళిన, వెళ్తున్న తె లంగాణ ప్రవాస భారతీయుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.వంద కోట్లు కేటాయించామని పరిశ్రమలు, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కె.తారక రామారావు స్పష్టం చేశారు. శాసన సభ జీరో అవర్‌లో నిజామాబాద్ రూరల్ ఎంఎల్‌ఎ బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు అడిగిన ప్రశ్నకు కెటిఆర్ బదులిస్తూ కేటాయించిన ఈ వంద కోట్ల నిధులను ఏ విధంగా ఖర్చు పెట్టాలన్న దానిపై త్వ రలో ఎన్ఆర్ఐ శాఖ ఆధ్వర్యంలో ఒక ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. బతుకు దెరువు కోసం వెళ్లి చనిపోతున్న తె లంగాణ కార్మికులను తిరిగి స్వస్థలాలకు తరలించేందుకు కూడా చాలా ప్రయాసలు పడుతున్నామన్నారు. ఈ నిధుల వినియోగం కోసం రూపొందించే విధి విధానాలను కూడా ప్రభుత్వం అసెంబ్లీ ముందు ఉంచేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు.

ఇంటింటికీ కంటి పరీక్షలు

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో వైద్య మంత్రి డా. లక్ష్మారెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో వచ్చే నెల ఏప్రిల్ నుంచి ఇంటింటికీ కంటి పరీక్షలను నిర్వహించి దృష్టిలోపాలున్న వారికి ఉచిత కళ్లజోళ్లు, అవసరమైన వారికి ఉచిత శస్త్ర చికిత్సలను నిర్వహిస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డా. లక్ష్మారెడ్డి ప్రకటించారు. అంధత్వ నివారణకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. సోమవారం శాసన సభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎంఎల్‌ఎలు రేఖా నాయక్, అంజయ్య యాదవ్, కౌసర్ మోహియుద్దీన్ తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి లక్ష్మారెడ్డి సమాధానం చెప్పారు. దృ ష్టిలోపాలతో ఉండే వారి సంఖ్య దేశ వ్యాప్తంగానే కాకుండా రాష్ట్రంలో కూడా గణనీయంగా ఉందని ఇటీ వల కేంద్ర ప్రభుత్వం చేసిన అధ్యయనంలో తేలిందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కెసిఆర్ పలు దఫాలుగా నిపుణులతో చర్చించి దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రజలందరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగానే కళ్ల జోడ్లు, ఉచిత కేటరాక్ట్ ఆపరేషన్ల నిర్వహణకు రూపకల్పన తయారు చేశారన్నారు. దృష్టి లోపాల వల్ల ప్రజలు తమ దైనందిని పనులు చేసుకోవడం క ష్టం అవుతోందని, ప్రమాదాలకు గురి కావడం సర్వసాధారణంగా మారుతోందన్నారు. ఇలాంటి దృష్టి లోపాలు నివారించాలంటే చాలా వరకు కళ్ల జోడ్లు, కేటరాక్ట్ సర్జరీలతో సరి చేయవచ్చన్నారు.

లక్షా 83 వేల కెసిఆర్ కిట్ల పంపిణీ..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించి ఆరోగ్యకరంగా బిడ్డ జన్మించేందుకు ఉద్దేశించిన కెసిఆర్ కిట్ల పంపిణీ సత్ఫలితాలు సాధిస్తోందని మంత్రి డా. లక్ష్మారెడ్డి అన్నారు. ఇప్పటి వరకు 196,702 ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగాయని, ఇందులో భాగంగా 1,83, 382 కెసిఆర్ కిట్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణప్రాంతంలో సంవత్సరానికి 6 లక్షల 50 వేల ప్రసూతులు జరిగితే అందులో 30 శాతం మాత్రమే ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేవన్నారు. తాజాగా ప్రభుత్వ దవాఖానాల్లో 30 శాతం నుండి 50 శాతానికి ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. ప్రసూత మరణాలు కూడా చాలా వరకు నివారించగలిగామని మంత్రి వెల్లడించారు. ఎంఎల్‌ఎలు గొంగిడి సునీత, బొడిగే శోశ, సున్నం రాజయ్య తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానంగా ఈ వివరాలు వెల్లడించారు.

వ్యవసాయానికి 12 గంటల కరెంటు చాలు

అసెంబ్లీ జీరో అవర్‌లో ఎర్రబెల్లి



మన తెలంగాణ / హైదరాబాద్ : భవిష్యత్తులో భూగర్భ జల మట్టాలు పూర్తి స్థాయిలో పడిపోక ముందే నీటి సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పాలకుర్తి టిఆర్ఎస్ ఎంఎల్‌ఎ ఎర్రబెల్లి దయాకరరావు విజ్ఞప్తి చేశారు. తన నియోజక వర్గంలో అన్ని మండలాల్లోని రైతులు 24 గంటల కరెంటు వద్దు, 12 గంటలు చాలని చెబుతున్నారని, ఈ మేరకు వారంతా సమావేశాలు పెట్టి ఏకగ్రీవంగా తీర్మానాలు చేసుకున్నారని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 గంటలకు చేయలేక పోతే కనీసం తన సొంత నియోజక వర్గం వరకైనా సరే 12 గంటల విద్యుత్ చాలని ఈ మేరకు ప్రభుత్వం ట్రాన్స్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సోమవారం శాసన సభ జీరో అవర్ ఎర్రబెల్లి ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకుని వచ్చారు. టిఆర్ఎస్ ఎంఎల్‌ఎ రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో రెండ్రోజుల క్రితం జరిగిన ఘటనలో 5 గురు విద్యార్థులు చెరువులో నీట మునిగి చని పోయారని, గిరిజన కుటుంబం, చాలా పేదరికంతో ఉన్న ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బ్రాహ్మణ పరిషత్తుకు కేటాయించిన రూ. 100 కోట్ల నిధులు పూర్తిగా వ్యయం చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని ఎంఎల్‌ఎ పువ్వాడ అజయ్ కోరారు. ఇంటర్ ప్రశ్నాపత్రాల మూల్యంకనంను బహిష్కరించిన భాషా పండితులు, సంస్కృత పండితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బిజెపి ఎంఎల్‌ఎ ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న ప్రైవేటు వైద్యులకు శిక్షణ నిచ్చివారికి ఆర్ఎంపి, పిఎంపి సర్టిఫికెట్లు జారీ చేయాలని టిఆర్ఎస్ ఎంఎల్‌ఎ దుర్గం చిన్నయ్య కోరారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు తనిఖీల పేరుతో కేసులు నమోదు చేసి వారిని ఇబ్బందులు పెడుతున్నారని, శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేస్తే సమస్య కొంత వరకైనా నివారించినట్లు అవుతుందన్నారు. భద్రాచలం నియోజకవర్గ గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ (ఎం) ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య కోరారు. శనగ రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని తన నియోజకవర్గం బోధన్‌లో రైతాంగం ఆందోళనలో ఉందని, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుండి మార్కెట్‌కు ఎవరైనా ధాన్యం తెస్తే వారికి తక్కువ ధరలు ఇవ్వండి కానీ, తెలంగాణ రైతాంగానికి మాత్రం కనీస మద్దతు ధరలు లభించేలా చూడాలని కోరారు. మొక్కజొన్నలకు కూడా కనీస మద్దతు ధరలు ఇవ్వాలని వైరా ఎంఎల్‌ఎ మదన్ లాల్ బాణోత్ కోరారు. తన ఖైరతాబాద్ నియోజక వర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదని 2 డిగ్రీ కళాశాలు మాత్రం ఉన్నాయని ఎంఎల్‌ఎ చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థల సేకరణ చేసి జూనియర్ కళాశాల నిర్మించాలని కోరారు. ఖైరతాబాద్ పరిధిలో ప్రభుత్వ స్థలం లభ్యత సరిపోదని భావిస్తే జూబ్లీహిల్స్‌లో ఉన్న స్థలాలను జునియర్ కళాశాల కోసం కేటాయించేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీత భత్యాలను కనీసం రూ. 20 వేలకు తగ్గకుండా పెంచాలని ఎంఎల్‌ఎ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. కారోబార్‌లు, బిల్ కలెక్టర్లు, కామాటీలకు చాలీ చాలనీ జీతాలిచ్చి పని చేయించుకోవడం సరి కాదన్నారు.

ఘన వ్యర్థాల శుద్ధీకరణ నిబంధనల రూపకల్పన

పురపాలక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్

మన తెలంగాణ/హైదరాబాద్: ఘన వ్యర్థాల శుద్ధీకరణలో త్వరలో నిబంధనలను రూపొందిస్తామని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్ తెలిపారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సలహాకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఘన వ్యర్థాల శుద్ధీకరణ విషయంలో ఉన్న మార్గదర్శాకాల ఏమిటో ఒక డ్రాఫ్ట్‌ను ఇవ్వాలని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా అడిగినట్లు వెల్లడించారు. ఇటీవలే కాలుష్యనియం త్రణ అధికారులు మాల్స్, హోటళ్లు, ఆసుపత్రులు తనిఖీ చేసి ఘన వ్యర్థాల విషయంలో వారు చేస్తున్న వాటిని పరిశీలించి ఒక నివేదికను అందచేశారన్నారు. డంపింగ్ యార్డుల్లో నిల్వ చేసే వాటి విషయంలో జిహెచ్‌ఎంసికి తగిన సూచనలు అందచేయడం జరిగిందన్నారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లోనూ సర్వే చేసి ఘన వ్యర్థాలను శుద్ధి చేసి వాటిని ఉపయోగించుకునే విధంగా వారి సేవలను వినియోగించుకుంటామన్నారు. పట్టణ స్థానిక సంస్థలన్ని డ్రైవర్ కమ్ ఓనర్ పథకాన్ని వాటిలోనూ అమలు చేయాలని అడుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సిడిఎంఎ డాక్టర్ టి.కె.శ్రీదేవి, జిహెచ్‌ఎంసి కమిషనర్ జనార్దన్‌రెడ్డి, కాలుష్యనియంత్రణ మండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నోట్ల రద్దు, జిఎస్‌టితో రాష్ట్రానికి నష్టం



మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలోని అధి క బడ్జెట్ కలిగిన రాష్ట్రాల కంటే మైనారిటీల సం క్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులను కేటాయించడం పట్ల ఎంఐఎం శాసనసభాపక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.అయితే నిధులను భారీగా కేటాయించినా ఖర్చు చేయడం లేదని, గత నాలుగేళ్ళ ప్రభుత్వం దాదాపు రూ.4591 కోట్లను కేటాయించగా రూ.2682 కోట్లను మాత్రమే విడుదల చేశారన్నారు. శాసనసభలో సోమవారం 2018–19 బడ్జెట్‌పై సాధారణ చర్చను అక్బరుద్దీన్ ఓవైసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాదీ ముబారక్ నగదు సహాయాన్ని లక్ష రూపాయలకు పెంచడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. నోట్ల రద్దు, జిఎస్‌టి వల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందని, లేట్లయితే రాష్ట్రం మ రింత అభివృద్ధిని సాధించేదని, ఈ పరిస్థితిని తా ము ముందే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన దాదాపు రూ.25 వేల కోట్ల బి ల్లులు ట్రెజరీలో చెల్లించే పరిస్థితి లేదంటున్నారని, మరోవైపు కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల వాటా ఆశించిన రీతిలో రావడం లే దని, ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితిని ప్రభుత్వం తెలియజేయాలన్నారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలతో పాటు ఇతర వాగ్దానాలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలపై సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందని ఆయన అన్నారు. మైనారిటీలకు గత ఏడాది కంటే ప్రస్తుత ఏడాది బడ్జెట్‌లో తక్కువ నిధులను విడుదల చేశారని, ఈ విషయంలో మీరు, మేము (టిఆర్ఎస్, మిత్ర పక్షం ఎంఐఎం) ప్రజలకు ఏమి సమాధానం చెబుతామని, ఇప్పటికైనా గతం కంటే ఎక్కువ నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి విగత జీవులైన వారి శవాలను తీసుకురావడం రావడం మాత్రమే కాకుండా, పాధిని కోల్పోయి అక్కడి నుంచి తిరిగి వచ్చిన వారికి తగిన ఉపాధి అవకాశాలను కల్పించాలని అక్బరుద్దీన్ కోరారు. ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించేందుకు, టిఆర్ఎస్ ప్రభుత్వం వాగ్దానం చేసిన లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు, ఉద్యోగులకు పిఆర్‌సి నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాతబస్తీ అభివృద్ధికి రూ.5 వేల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

అటకెక్కిన మూడెకరాల భూపంపిణీ

టిడిపి సభ్యులు సండ్ర వెంకటవీరయ్య

మన తెలంగాణ / హైదరాబాద్ : మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూమ్, ఉచిత విద్యుత్ తదితర కార్యక్రమాలను ప్రభుత్వం అప్పులు తెచ్చి నడపాలనే భావనతో ఉన్నట్లు కనబడుతున్నదని, డబుల్ బెడ్ రూమ్‌ల పథకం రంగుల కలగా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడిందని టిడిపి సభ్యులు సండ్ర వెంకట వీరయ్య అన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు కాకుండా ఎప్పటికప్పుడు ఇస్తున్న హామీలపై నిధులను ఖర్చు చేస్తున్నదని శాసనసభలో సోమవారం బడ్జెట్‌పై సాధారణ చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష బెడ్‌రూమ్‌ల నిర్మాణం లక్ష్యానికి బడ్జెట్ కేటాయింపులకు పొంతన లేదని, ప్రభుత్వం ఇప్పటివరకు 9 వేల ఇళ్లే నిర్మించిందని, బడ్జెట్‌లో కేటాయించిన రూ.2600 కోట్లతో మిగిలిన వాటిని ఎలా నిర్ణయిస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఈ పథకం అమలులోని అవాంతరాలను గుర్తించి వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దళితులకు మూడెకరాల భూమి పంపిణీ దాదాపు 25 లక్షల లబ్ధిదారులకు సుమారు 10 లక్షల ఎకరాల భూమి అవసరమని ప్రకటించి కేవలం 12 వేల ఎకరాలను మాత్రమే పంపిణీ చేసి పథకాన్ని అటకెక్కించారన్నారు. సిపిఐ(ఎం) సభ్యులు సున్నం రాజయ్య మాట్లాడుతూ పోడు సాగుదారులకు, కౌలు రైతులకు కూడా రూ.8వేల పంట పెట్టుబడి సహాయాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నిధులు పూర్తిగా ఖర్చు చేశాం : జూపల్లి

మన తెలంగాణ / హైదరాబాద్ : గ్రామ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన నిదులను పూర్తిగా ఖర్చు చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పి.రాజేశ్వరరెడ్డి, బి.లక్ష్మి నారాయణ, కె.నారాయణ రెడ్డిల ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ కేంద్రం సకాలంలో నిధులు విడుదల చేయక పోవడం వల్ల కాంట్రాక్టర్లకు చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందన్నారు. కేంద్రం గ్రామ పంచాయతీలకు 2014–15లో రూ.1245 కోట్లు, 2015–16లో 697 కోట్లు, 2016–17లో 935 కోట్లు, 2017–18లో 940 కోట్లు ఇచ్చిందన్నారు.

యుపిఎలో కలిసేందుకే యత్నాలు

మన తెలంగాణ/హైదరాబాద్: థర్డ్ ఫ్రంట్ పేరుతో యుపిఎలో కలిసేందుకే సిఎం కెసిఆర్ ప్రయత్నిస్తున్నారని, అందుకే పశ్చిమ బెంగాల్ సిఎం మమత బెనర్జీ మద్దతు కోసమే కోల్‌కత్తా వెళ్ళారని బిజెపి అధికార ప్రతినిధి కృష్ణ సాగర్ రావు ఆరోపించారు. ఉత్తమ్, రేవంత్‌రెడ్డిలు భవిష్యత్‌లో టిఆర్ఎస్‌తో సీట్లు పంచుకోవాల్సిందేనన్నారు. రాష్ట్రంలో బిజెపి తమ మాస్టర్‌ప్లాన్‌ను సరైన సమయంలో, సరైన విధానంతో అమలు చేస్తుందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం బిజెపి మీడియా కన్వీనర్ సుధాకర్‌శర్మతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కెసిఆర్, టిఆర్ఎస్‌ను వ్యతిరేకించే రేవంత్‌రెడ్డి లాంటి వ్యక్తుల భవిష్యత్తులు క్రాస్‌రోడ్‌లో ఉన్నాయని, వారంతా ఆలోచించుకోవాలని సూచించారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని, అవినీతిలేని పాలన అందుతోందని, అందుకే ప్రజలు బిజెపికి పట్టం గడుతున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి, మరో కూటమి మధ్యనే పోటీ ఉండబోతుందని, బిజెపి సునామిని తట్టుకునే శక్తి ఏ పార్టీకీ లేదన్నారు.



“ఆశించటం ఆపితే ఆనందం మొదలవుతుంది. శాసించటం ఆపితే సంతోషం మొదలవుతుంది.
– రామకృష్ణ పరమహంస”

సంపాదకీయం

చేతికి చేవ చేకూరేనా?

ఢిల్లీలో ఆదివారం ముగిసిన భారత జాతీయ కాంగ్రెస్ 84వ ప్లీనరీ సమావేశం రెండు కర్తవ్యాలను నిర్దేశించుకుంది. ఒకటి, యువరక్తాన్ని పార్టీలో ప్రోత్సహించటం ద్వారా కొత్త జవసత్వాలు సమకూర్చుకోవటం. రెండు, 2019 లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్రమోడీ నాయకత్వంలోని బిజెపిని ఓడించేందుకు గాను ''భావసారూప్య పార్టీలను కలిసికట్టుగా తీసుకువచ్చేందుకు ఆచరణాత్మక దృక్పథం''అనుసరించటం. గత సార్వత్రిక ఎన్నికల్లో గుర్తింపు పొందిన ప్రతిపక్ష స్థానానికి అవసరమైన సీట్లు గెలుచుకోలేకపోవటం, ఆ తదుపరి సంవత్సరాల్లో పలు రాష్ట్ర ప్రభుత్వాలను బిజెపికి కోల్పోవటం దేశ రాజకీయాల్లో ఆ పార్టీని అసంగతం చేసింది. అట్టి నిరాశ, నిస్పృహనుంచి పార్టీలో పునరుత్తేజం నింపటం డిసెంబర్‌లో పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌గాంధీకి శక్తికి మించిన పని. అయితే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో, పార్టీ అధికారంలోకి రాలేకపోయినా సాధించిన ఫలితాలు, ఆ తదుపరి రాజస్థాన్‌లో రెండు లోక్‌సభ ఉప ఎన్నికల్లో గెలుపొందటం, మధ్యప్రదేశ్‌లో ఉప ఎన్నికల్లో, స్థానిక సంస్థల్లో మెరుగైన ఫలితాలు సాధించటం, ఉత్తరప్రదేశ్‌లో రెండు లోక్‌సభ ఉప ఎన్నికల్లో మాయావతి తోడ్పాటుతో సమాజ్‌వాది పార్టీ గెలుపొందటం, బీహార్‌లో ఆర్‌జెడి విజయం మోడీని ఓడించటం సాధ్యమేనన్న ఆశలను కాంగ్రెస్ నాయకత్వంలో కలిగించాయి. అందుకుగాను ప్రాంతీయ పార్టీలతో 'ఆచరణాత్మక ఒప్పందాలు, అవగాహనలకు' సిద్ధం కావాలని ప్లీనరీ నిర్ణయించింది. యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ విందు దౌత్యాలు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాధ్యమైనంత విస్తృత ప్రతిపక్ష ఐక్యతను సాధించే ప్రయత్నాల్లో భాగమే. ప్లీనరీలో ప్రసంగంలో, బూటకపు వాగ్దానాలతో ప్రజల్లో భ్రమలు కల్పించి అధికారంలోకి వచ్చిన మోడీ వాటిలో ఏ ఒక్కటీ అమలు పరచకపోగా 'నిరంకుశం'గా వ్యవహరిస్తున్నట్లు సోనియాగాంధి విమర్శించగా, అనాలోచిత చర్యలతో, విధానాలతో ఆర్థికవ్యవస్థను ధ్వంసం చేశాడని, నిరుద్యోగం, రైతుల బాధలు వాటి పర్యవసానమేనని డాక్టర్ సింగ్, చిదంబరం దుయ్యబట్టారు. కాగా బిజెపి ఒక సంస్థ (ఆర్‌ఎస్‌ఎస్ అని అర్థం) వాణి, కాగా కాంగ్రెస్ దేశం వాణి అని ప్రకటించిన రాహుల్‌గాంధి కాంగ్రెస్‌ను సత్యంకొరకు నిలబడిన పాండవులతో, బిజెపిని అధికార తృష్ణ కలిగిన కౌరవులతో పోల్చారు.

'వ్యవసాయం, ఉపాధి, పేదరిక నిర్మూలన'పై ఆమోదించిన తీర్మానం ప్రత్యేకించి గమనించదగింది. వ్యవసాయరంగంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. తాము అధికారంలోకి వస్తే, 2009లో లాగా ఐదెకరాలలోపు రైతులకు రుణమాఫీ చేస్తామని, వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి శాశ్వత కమిషన్ ఏర్పాటు చేస్తామని, వ్యవసాయ పెట్టుబడి ఖర్చులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మద్దతు ధరలు నిర్ణయించేలా చర్యలు తీసుకుంటామని, ఇతర పంటలకు, గిరిజనుల అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర విస్తరిస్తామని వాగ్దానం చేసింది. 2022 నాటికి వ్యవసాయ ఆదాయాలను రెట్టింపు చేస్తామన్న మోడీ ప్రచారం మరో మోసపూరితమైన బోలు వాగ్దానంగా తీర్మానం కొట్టిపారేసింది.

కాంగ్రెస్ పార్టీ ఎంతగా బలహీనపడినప్పటికీ దేశవ్యాప్త ఉనికి ఉన్న జాతీయ పార్టీ. లౌకిక ప్రాంతీయపార్టీలు పలు రాష్ట్రాల్లో బలంగా ఉన్నా జాతీయస్థాయిలో వాటికొక వేదిక కల్పించగలిగింది ఆ పార్టీయే. బిజెపిని ఓడించటం ప్రధాన కర్తవ్యంగా నిర్దేశించుకున్నందున ఆ పార్టీల పట్ల 'ఆచరణాత్మక వైఖరి' చేబడతామని ప్రకటించటంలో అర్థం, నాయకత్వ సమస్యను అది ముందుకు తేదలచలేదు. దేశానికి ప్రమాదకరంగా తయారైన బిజెపిని అధికారంనుండి దించేందుకు కాంగ్రెస్ త్యాగాలకు సిద్ధమన్న రాహుల్‌గాంధీ ప్రకటనలో ఆ ధ్వని ఉంది. కాబట్టి కాంగ్రెస్ నాయకత్వాన్ని క్లెయిం చేయాలంటే ముందుగా గౌరవప్రదమైన సంఖ్యలో స్థానాలు గెలవాలి. ఇందుకొరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా, పట్టుదలతో కృషి చేయాలని ఆయన కోరారు. 'అంతర్గత కోట్లాటలు ఆపండి' అని విజ్ఞప్తి చేస్తూ, 'కోట్లాడాలనుకుంటే ఎన్నికల తదుపరి ఆ పని చేయండి' అని చమత్కరించినా, కాంగ్రెస్‌కున్న పెద్ద సమస్య అదే. చేతికి చేవ చేకూరాలంటే కాంగ్రెస్‌ను వ్యవస్థాగతంగా ఏకత్రాటిపై నడిపించటం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించటం రాహుల్‌గాంధీ ముందున్న కర్తవ్యం.

మాల్దీవుల్లో అనవసర జోక్యం

చూపు

మాల్దీవుల్లో దాదాపు నెలన్నరగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే అమెరికా, భారత్ చూపుతున్న ఆసక్తి ఆ దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కులకోసం అనుకోవడం అమాయకత్వమే అవుతుంది. హిందూ మహాసముద్రంలో ఉన్న ద్వీప సమూహం అయిన మాల్దీవులు నౌకాయాన మార్గంలో ఉన్నాయి. భారత్, జపాన్, చైనా, తూర్పు ఆసియా, ఆగ్నేయాసియా దేశాలకు ఈ మార్గం గుండానే చమురు, ఇతర సరుకుల రవాణా అవుతుంది. పశ్చిమాసియా, ఆఫ్రికా, యూరప్ లాంటి చోట్లకు వస్తువుల సరఫరాకు కూడా ఇదే మార్గం. మాల్దీవులను భారత్ తన పెరడు అనుకుంటుంది. భారత్, అమెరికా దేశాల భావనకు విరుద్ధంగా మాల్దీవుల ప్రభుత్వం చైనా ఒకే బెల్ట్, ఒకే రోడ్డు మౌలిక సదుపాయాల ప్రథకంలో పాల్గొనాలని నిర్ణయించింది. చైనాతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కూడా కుదుర్చుకుంది.

ఫిబ్రవరి అయిదున మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ అత్యవసర పరిస్థితి ప్రకటించి ప్రజాస్వామ్య హక్కులను రద్దు చేశారు. పార్లమెంటులో ఇద్దరు ప్రతిపక్ష నాయకులను విడుదల చేయాలని ఫిబ్రవరి ఒకటో తేదీన తీర్పు చెప్పిన ఇద్దరు న్యాయమూర్తులను అరెస్టు చేయించారు. మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నషీద్ ను, ఇతర ప్రముఖ ప్రతిపక్ష నాయకులను కూడా విడుదల చేయాలని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఆ మరుసటి రోజే మాల్దీవుల వ్యవహారంలో భారత్ జోక్యం చేసుకోవాలని రెచ్చగొట్టే విధంగా ప్రకటన చేశారు. ఆయన శ్రీ లంకలో ప్రవాస జీవితం గడుపుతున్నారు.

మాల్దీవుల అధ్యక్షుడు యామీన్‌ను గద్దె దించాలని అమెరికాకు, భారత్‌కు విజ్ఞప్తి చేసారు. భారత్, అమెరికా, యూరప్ సమాజం ప్రతిపక్షాలకు మద్దతు ఇస్తున్నందువల్ల న్యాయమూర్తులపై విపరీతమైన ఒత్తిడి ఉండి ఉంటుంది. తన పార్టీ నుంచి ఫిరాయించిన వారికి కోర్టు విముక్తి కలిగించడంతో యామీన్ ప్రభుత్వం పతనమై ఉండేది. ప్రభుత్వం మెజారిటీ నిరూపించుకోవడం కష్టమై ఉండేది. నషీద్ తిరిగి వచ్చి అధ్యక్ష పదవికి గట్టి అభ్యర్థి అయి ఉండేవారు. అందువల్ల యామీన్ ఎమర్జెన్సీ విధించి మిగతా సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో అంతకు ముందు ఇద్దరు న్యాయమూర్తుల నిర్ణయాన్ని తిరగతోడించారు.


'స్వల్ప వ్యవధిలో సైన్యాన్ని దించడానికి భారతసేనలు సిద్ధంగా ఉన్నాయి' అని భారత్‌లోని బడా మీడియా సంస్థలు ప్రచారం చేశాయి. కాని మాల్దీవుల భద్రతా దళాలు యామీన్‌కు విశ్వాసపాత్రమైనవని భారత్‌కు తెలుసు. అదీగాక మాల్దీవుల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకునే హక్కు భారత్‌కు లేదని ప్రరోక్షంగానైనా చైనా కచ్చితమైన హెచ్చరిక జారీ చేసింది. పైగా అమెరికా, బ్రిటన్ మద్దతు భారత్‌కు ఉన్నా సైనిక జోక్యం చేసుకోవడం అంటే 'సైనికంగా తటస్థంగా' ఉంటాం అన్న భారత హామీకి విఘాతం కలిగినట్టవుతుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఫోన్ చేసి మాల్దీవులలో పరిస్థితి గురించి చర్చించాలని అడిగారు. శ్రీలంకలో మహీంద రాజపక్ష చైనాకు అనుకూలంగా పని చేస్తున్నారన్న కారణంగా అమెరికా, భారత్ దేశాలు మైత్రీపాల సిరిసేన తిరుగుబాటు జెండా ఎగరవేయడానికి తోడ్పడ్డాయి. 2015 లో అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికలలో సిరిసేన ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థి కావడానికి సహకరించాయి. సిరిసేన గెలిచారు కూడా. అలాగే మాల్దీవులలో ప్రభుత్వం మారేటట్టు చేయాలని అమెరికా, భారత్ దేశాలు భావిస్తున్నాయి. 1998లో అబ్దుల్ గయూం నాయకత్వంలోని నిరంకుశ ప్రభుత్వంపై జరిగిన కుట్రను భగ్నం చేయడానికి భారతసేనలు సహకరించాయి. గయూం భారత మద్దతుతో 2008 దాకా అధికారంలో కొనసాగారు.

> ఫిబ్రవరి 20వ తేదీన యామీన్ మరో 30 రోజులపాటు ఎమర్జెన్సీని పొడిగించడంతో భారత్, అమెరికా దేశాలు కంగుతిన్నాయి. భారత్‌కు అతి సమీపంలో ఉన్న పొరుగుదేశంలో తన ప్రభావం తగ్గడాన్ని ఎదుర్కోవాలని మీడియాలోని కొన్ని వర్గాలు, భద్రతా విభాగం సూచించినప్పటికీ భారత్ సంయమనం పాటించింది. తన పొరుగున ఉన్న దేశంలో భద్రత కొరవడితే భారత్ అంతర్జాతీయ శక్తిగా ఎలా అవతరిస్తుంది అని భద్రతా వ్యవహారాల నిపుణుడు ఒకరు ప్రశ్నించారు. బలవంతం చేసే దౌత్య విధానమైనా అనుసరించాలని అవసరమైతే సైనిక జోక్యం చేసుకోవాలను సూచించిన వారూ ఉన్నారు.

ఫిబ్రవరి 20వ తేదీన యామీన్ మరో 30 రోజుల పాటు ఎమర్జెన్సీని పొడిగించడంతో భారత్, అమెరికా దేశాలు కంగుతిన్నాయి. భారత్‌కు అతి సమీపంలో ఉన్న పొరుగుదేశంలో తన ప్రభావం తగ్గడాన్ని ఎదుర్కోవాలని మీడియాలోని కొన్ని వర్గాలు, భద్రతా విభాగం సూచించినప్పటికీ భారత్ సంయమనం పాటించింది. తన పొరుగున ఉన్న దేశంలో భద్రత కొరవడితే భారత్ అంతర్జాతీయ శక్తిగా ఎలా అవతరిస్తుంది అని భద్రతా వ్యవహారాల నిపుణుడు ఒకరు ప్రశ్నించారు. బలవంతం చేసే దౌత్య విధానమైనా అనుసరించాలని అవసరమైతే సైనిక జోక్యం చేసుకోవాలను సూచించిన వారూ ఉన్నారు.

మాల్దీవులలో చైనా ప్రభావాన్ని తగ్గించడం ఎలా అన్న ప్రశ్నతోనే భారత అధికార వ్యవస్థలోని వారు ఆలోచిస్తున్నారు. ఈ పని ఎలా సాధించాలని ట్రంప్, మోడీ కూడా ఆలోచిస్తూ ఉండి ఉంటారు. వారు విస్తృత ప్రయోజనం హిందూ మహాసముద్రంలో నౌకాయాన మార్గాలపై ఆధిపత్యం సంపాదించడం. చైనా విదేశీ వాణిజ్యానికి ఉపయోగపడేది ఇదే మార్గం. మాల్దీవుల్లో సైనిక స్థావరాలు ఏర్పాటు చేయాలని భారత్, అమెరికా దేశాలు భావిస్తున్నాయి. ఆ స్థావరాలను సెషెల్స్, డీగో గార్షియాతో అనుసంధానం చేయాలనుకుంటున్నాయి. బహుశః మాల్దీవుల్లో ప్రభుత్వం మారితే ట్రంప్ ప్రభుత్వం అక్కడ సైనిక స్థావరాలు నెలకొల్పడానికి ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు.

* (ఇ.పి.డబ్ల్యు. సౌజన్యంతో)



ఖాతాలను మింగిన బ్యాంకు



బి.నర్సన్
9440128169

సాంకేతిక విజ్ఞానం బ్యాంకింగ్ వ్యవస్థలో పెను ఉప్పెనలాంటి మార్పులు తీసుకువచ్చింది. బ్యాంకింగ్ కార్యకలాపాలు త్వరితగతిన సాగడానికి, బ్యాంకులోకి వెళ్లకుండానే లావాదేవీలు నడుపుకోవడానికి సాఫ్ట్‌వేర్ రంగం సులువుదారిని చూపింది. బ్యాంకుల నిర్వహణ కూడా యంత్రమయం అయిపోయింది. ఇప్పుడీ బ్యాంకు అధికారులు కీ బోర్డుపై మునివేళ్ల నొక్కులతో ఎలాంటి తతంగమైనా జరుపవచ్చు. ఒక్కొక్కపేజీని మరలిస్తూ ఖాతాలను పరిశీలించే రోజులు పోయాక వేలు కదలికలతో కోట్లాది ఖాతాల రాత మార్చవచ్చు. వరుసపెట్టి కత్తెర వేసినట్లు ఖాతాలపై ఎలాంటి కోతలైనా పెట్టవచ్చు. ఖాతాదారుల ప్రమేయం లేకుండా బ్యాంకులు వారి ఖాతాల నుంచి వివిధ చార్జీలను వసూలు చేయవచ్చు, ఏకంగా ఖాతాలకు తాళం వేయవచ్చు.

ఈ మధ్య స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 41.16 లక్షల సేవింగ్స్ ఖాతాలను మూసివేసిన సంఘటన బ్యాంకు సేవలు తీసుకొనేవారికి ఆశ్చర్యం కలిగించక మానదు. వీటిలో 16 కోట్లదాకా ప్రధాన మంత్రి జనధన్ యోజన లాంటి ప్రభుత్వ పథకాలకు సంబంధించినవి. ప్రధాని మోడీ పీఠమెక్కిన మూణ్ణెల్లకే హంగామాగా ప్రవేశపెట్టిన జన్‌ధన్ యోజన ఖాతాలకు స్వయానా ప్రభుత్వ బ్యాంకు ఈ గతి పట్టించింది. గిన్నిస్ బుక్ రికార్డుకు మసకబారింది. ఇలా ఖాతాలను నిలిపివేసిన సంగతి స్టేట్ బ్యాంకు స్వయం గా వెల్లడించలేదు. మధ్యప్రదేశ్‌కు చెందిన చంద్రశేఖర్ గాడ్ అనే ఆయన సమాచార హక్కు కింద వేసిన ప్రశ్నకు ఆ బ్యాంకు ఈ రహస్య ఎజెండాను బయటపెట్టక తప్పలేదు. కనీస నిల్వల నిర్వహణ లేక పెనాల్టీగా రుసుములు వసూలు చేయడం వల్ల , ఖాతాల్లో బ్యాలెన్స్ శూన్యమవడం వల్ల వాటిని మూసివేయక తప్పలేదని కారణంగా వెల్లడించింది. ఆ తర్వాత వెంటనే సర్దుకొని కారణం బ్యాంకుల విలీనంపైకి నెట్టివేసింది. అసోసియేట్ బ్యాంకుల్లో ఉన్న ఖాతాలు బ్యాంకుల విలీనంతో ఒకరికి ఒకటికి మించి ఉండడంవల్ల అలాంటి వాటిని మూసివేసినామని చెప్పింది.

కనీస నిల్వల నిర్వహణపై అపరాధ రుసుముల వసూలు బ్యాంకులకు కూర్చున్నకాడ సంపాదనైపోయింది. ఒక్క స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏప్రిల్ 2017 నుండి నవంబర్ 2017 వరకు వసూలు చేసిన అపరాధ రుసుము అక్షరాలా రూ.1771.67 కోట్లు. ఇది ఆ బ్యాంకు ఒక త్రైమాసిక లాభం కన్నా ఎక్కువ. ఎస్‌బిఐ రెండో త్రైమాసికంలో రూ. 1581.55కోట్ల లాభం ఆర్జించింది. ఇంకా నాలుగు నెలల కాలంలో అనగా ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు మరో వేయికోట్లయినా అపరాధ రుసుం పేరిట బ్యాంకు లాభాల ఖాతాలో జమకావచ్చు.

సమాచార హక్కు ద్వారా తప్పనిసరై 41లక్షల ఖాతాల మూసివేత బయటపడడంతో అపరాధ రుసుముల పేరిట బ్యాంకు ఖాతాల్ని నాకేస్తుందని లోకానికి అర్థమైపోయింది. దానికి నివారణ దిశగా స్టేట్ బ్యాంకు కనీస నిల్వల మొత్తాలను, అపరాధ రుసుములను ఒకేసారి 75% తగ్గించి వేసింది. మార్చి 14న ప్రకటించిన కొత్త విధానం, వసూలు ఈ ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి వర్తిస్తుంది. 25కోట్లమంది ఖాతాదారులకు ఈ దోపిడి నుండి విముక్తి లభిస్తుంది.

ఖాతాదారులను ఆకర్షించేందుకు 2012లో తొలగించిన అపరాధ రుసుము విధానాన్ని తిరిగి ఏప్రిల్ 2017లో స్టేట్‌బ్యాంకు ప్రవేశపెట్టింది. కంప్యూటరైజేషన్‌తోపాటు బ్యాంకుల ఎస్టాబ్లిష్‌మెంట్, నిర్వహణ వ్యయం పెరిగినందువల్ల ఈ పెనాల్టీలు ఖాతాదారులు భరించక తప్పదని ఆనాటి ఎస్‌బిఐ ఛైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య ఖరాఖండిగా చెప్పారు.

> బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు పెరిగిపోవడం, రాజకీయ ప్రమేయంతో బడా పారిశ్రామిక వేత్తలు కోట్లాది రూపాయలు ఎగురేసుకుపోవడం వంటి రుగ్మతలకు నిస్సహాయులైన పొదుపు ఖాతాదారుల రక్తం పిండడమే వైద్యంగా మారింది. కేంద్రంలోని పాలనకు బ్యాంకుల దుస్థితికి ఓ కనబడని లంకె ఉంది. దానిని ఓటర్లే కాదు బ్యాంకు ఖాతాదారులు కూడా గ్రహించాలి.

ప్రవేశపెట్టినపుడు మెట్రో ఖాతాకు రూ. 100/–, సెమి అర్బన్ ఖాతాకు రూ.75/–, రూరల్ ఖాతాకు రూ.50/–చొప్పున కనీస నిల్వలు లేనందువల్ల నెలనెలా వసూలు చేశారు. ఖాతాదారులనుండి విమర్శలు రావడంతో అక్టోబర్ 2017లో వాటిని సవరించారు. అప్పుడు మెట్రోఖాతాకు నెలకు రూ.50/– సెమి అర్బన్ ఖాతాకు, గ్రామీణ ఖాతాకు నెలకు రూ.40/–గా మార్చారు. తిరిగి వాటిని 75% మేర కు తగ్గిస్తున్నట్లు స్టేట్‌బ్యాంకు 16, ఫిబ్రవరిన ప్రకటించింది.

సవరించిన రేట్లు ఏప్రిల్ 2018 నుండి వర్తిస్తాయి. కొత్త సవరణ ప్రకారం మెట్రో, అర్బన్ ఖాతాలపై నెలకు రూ.15+ జిఎస్‌టి, సెమి అర్బన్, గ్రామీణ ఖాతాలపై నెలకు రూ.12/–, రూ.10/–వరుసగా వసూలు చేస్తారు. కనీస నిలువ కూడా రూ.5,000/– నుండి రూ.3000/–లు మెట్రో ఖాతాలకు, సెమి అర్బన్‌కు రూ.2000/–, రూరల్ రూ.1000/– సవరించబడ్డాయి.

ఏప్రిల్ 2017లో వరుసగా రూ.100/–, రూ.75/–, రూ.50/– ఉన్న అపరాధ రుసుం ఏడాదికి రూ.15, రూ.12 రూ.10/– కి తగ్గిపోయింది. ఈ తగ్గింపు కూడా బ్యాంకు ఇష్టానుసారంగా చేయలేదు. సేవింగ్స్ ఖాతాల్లోంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టబడుతున్నాయన్న విమర్శను తట్టుకోలేకనే తగ్గించింది.

ఏ రకంగా చూసినా మొదటికీ, సవరణకీ మధ్య 80%, 85% మార్పు ఉంది. అంటే గత ఏడాది కనీస నిల్వలు లేవన్న నెపంతో స్టేట్ బ్యాంకు వసూలు చేసిన రూపాయలు సుమారు 1800 కోట్లు ఎవరి సొత్తో అర్థమైపోతుంది. సవరించిన లెక్కల ప్రకారం పోయినేడు ఆ బ్యాంకు ఎంత కాదన్నా 1700కోట్లు సేవింగ్స్ ఖాతాల్లోంచి దోపిడి చేసినట్లే. ఆ సొమ్మును తిరిగి ఖాతాదారులకు సవినయంగా చెంపలేసుకుంటూ తిరిగి చెల్లించడమే సంస్కారం.

ఇక 41లక్షల ఖాతాలు ఎలా మూసివేయబడ్డాయో తెలుసుకోవాలంటే అపరాధ రుసుము వర్తించే విధానాన్ని పరిశీలించక తప్పదు. ఉదాహరణకు ఒక సేవింగ్స్ బ్యాంకు ఖాతాలో ఉండవలసిన కనీస సరాసరి నిలువ రూ.3000/– ,అనుకుంటే తెలిసో తెలియకో అది రూ.2999/–కు పడిపోతే వెంటనే మాసాంతంలో రూ.100/– కోత పడుతుంది. అదే రూ.3000/– బదులుగా రూ.500/– ఉందనుకుందాం. దానికి అయిదు నెలలు అపరాధరుసుం కోత వేసిందంటే ఆ ఖాతాలోని నిలువ శూన్యమైపోతుంది. ఇలా బ్యాలెన్సు రూ.1000/– అంతకన్నా తక్కువ ఉన్న ఖాతాలు కాలక్రమంగా జీరో బ్యాలెన్స్‌లోకి వెళతాయి. ఇక వాటిలో కోసుకోవడానికి ఏమీ మిగలనందున, అనవసరంగా బ్యాంకు సర్వర్లపై భారమని బ్యాంకు తనకనుకూల నిర్ణయం తీసుకుంది.

బ్యాంకుల కంప్యూటరీకరణ కన్నా ముందు సేవింగ్స్ ఖాతా పుస్తకాల్లోంచి నిర్వహణ లేని ఖాతాలను విడి పుస్తకాల్లోకి మార్చేవారు. రెండేళ్లుగా ఖాతాల్లో ఎలాంటి లావాదేవీలు లేకుంటే దానిపై డార్మెంట్ ఖాతాగా, ఇనాపరేటివ్ సేవింగ్స్ ఖాతాగా స్టాంపువేసి ఆ ఖాతాల్ని విడిగా ఉంచి అధికారి అధీనంలో ఉంచేవారు. ఆ కాలం తర్వాత వచ్చిన ఖాతాదారున్ని అధికారి స్వయంగా విచారించి, వ్యక్తిపట్ల, సంతకంపట్ల సంతృప్తి చెందాక తిరిగి ఆ ఖాతాను ఆపరేటివ్ అకౌంట్‌గా మార్చేవారు. ఖాతాదారు వచ్చినా, రాకున్నా అన్ని సేవింగ్స్ ఖాతాల మాదిరి నిలిచి పోయిన ఖాతాలకు కూడా సమాన వడ్డీ లెక్కకట్టేవాళ్లు.

బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు పెరిగిపోవడం, రాజకీయ ప్రమేయంతో బడా పారిశ్రామిక వేత్తలు కోట్లాది రూపాయలు ఎగురేసుకుపోవడం వంటి రుగ్మతలకు నిస్సహాయులైన పొదుపు ఖాతాదారుల రక్తం పిండడమే వైద్యంగా మారింది. కేంద్రంలోని పాలనకు బ్యాంకుల దుస్థితికి ఓ కనబడని లంకె ఉంది. దానిని ఓటర్లే కాదు బ్యాంకు ఖాతాదారులు కూడా గ్రహించాలి.

ఎడిటర్‌కు లేఖలు

దళిత, ముస్లిమ్ భాయిభాయి

గత మూడున్నర దశాబ్దాలుగా ముస్లిమ్ మైనారిటీలు, దళితుల పరిస్థితులు దయనీయంగా మారాయి. హిందుత్వవాదులు చట్టాలను తమ చెప్పుచేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా అమానుషాలకు తెగబడుతున్నారు. చట్టాలన్నా, పోలీసులన్నా, రాజ్యాంగమన్నా, కోర్టులన్నా వీళ్లకు బొత్తిగా విశ్వాసం కానీ, నమ్మకం కానీ లేదు. రాజ్యాంగాన్ని కించపరిచేలా, కోర్టులను తప్పుపట్టేలా ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. సాధారణ కార్యకర్త మొదలు కేంద్ర కేబినెట్ మంత్రులుగా వెలగబెడుతున్న మంత్రులదాకా ఎవ్వరూ దీనికి అతీతులు కారు. ప్రభుత్వ పెద్దల మౌనం, ఉదాసీనతే వీళ్లు కొట్టి చంపేందుకు, విగ్రహాలు కూల్చేందుకు పరోక్షంగా ఉసిగొల్పుతున్నది. ఇప్పుడు దేశంలో దళితులు, మైనారిటీలే కాదు బిసిలు, ఆదివాసీలు, ఇలా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో నానా ఇబ్బందులను చవిచూస్తున్నారు. ఎన్నికల లబ్ధికోసం చిచ్చుపెట్టే మతఘర్షణల వల్ల జాతీయ సమైక్యత, మతసామరస్యం, సోదరభావం ప్రశ్నార్థకంగా మారిపోతున్నాయి. ఆమ్‌ఆద్మీ జీవితం దుర్భరమవుతోంది. ఇలాంటి ప్రమాద ఘంటికలు మోగుతున్న తరుణంలో మానవత్వాన్ని బ్రతికించుకునేందుకు మానవత్వవాదులు, బాధితపక్షాలు, దళితులు, మైనారిటీలు అంతా సంఘటితమవ్వాలి. జరిగే దౌర్జన్యాన్ని చేయి చేయి కలిపి ఎదిరించాలి. ఆ దిశగా అడుగులు కూడా పడుతున్నాయని కొన్ని సంఘటనలు రుజువుచేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో దళితులు, ముస్లిములు ఏకమవ్వడం ఎంతైనా హర్షణీయం. ఈ ఐక్యతను దళితులూ ఎంతో అవసరంగా గుర్తించారు. ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు సైతం దళితులను ఏకం చేసేందుకు ఒక వేదికను ఏర్పాటు చేయడం మంచిపరిణామం. మహారాష్ట్రలో ముస్లిమ్, దళితుల ఐక్య సదస్సులు ఎన్నో జరిగాయి. పెద్దసంఖ్యలో దళిత, ముస్లిమ్ నాయకులు ఒకేవేదిక పైకి వచ్చి ఐక్యత ప్రాధాన్యతను విడమర్చి చెప్పారు. ఈ దేశంలో అతిపెద్ద మైనారిటీ వర్గమైన ముస్లిములు ఎన్నో ఏళ్లుగా ధన, మాన, ప్రాణ నష్టాన్ని చవిచూస్తేనే ఉన్నారు. ఇలాగే కొనసాగితే మరింత విషాదం ముస్లిములు మూటగట్టుకోవాల్సి ఉంటుంది. దేశభక్తి పేరుతో, గోరక్ష పేరుతో, రామమందిరం పేరుతో, లవ్ జిహాద్ పేరుతో ముస్లిములను చంపేస్తున్న దారుణాలకు అడ్డుకట్ట పడాలంటే దేశంలో ఉన్న మైనారిటీ, దళిత మిత్రులతో కలిసి వేదికగా ఏర్పడాలి.

– మహమ్మద్ ముజాహిద్

గ్రామాల నుండి పట్టణాలకు వలసలను నివారించాలి!

భారతదేశంలో రోజు రోజుకు గ్రామాల నుండి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయని జాతీయ నమూనా సర్వే (ఎన్‌ఎస్‌ఎస్) జనాభా అధ్యయనాలు తెలుపుతున్నాయి. 2011 జనగణన, రైలు రవాణా సమాచారం వివిధ ప్రాంతాల్లో వయోవర్గాల జనాభాలో వచ్చిన మార్పులు వలసల వెల్లువను నిర్ధారిస్తున్నాయి. గత పదేళ్ళలో అనేక రాష్ట్రాల్లో ఆర్థిక కారణాల వల్ల పట్టణాలకు జనం తరలిపోతున్నట్లు స్పష్టీకరించాయి. నివాస స్థలం నుంచి వేరే చోటికి తరలివెళ్ళిన వారి సంఖ్య పెరిగినట్లు జనగణనలు వెల్లడించాయి. 2001–2011 మధ్య మొత్తం అంతరాష్ట్ర వలసదారుల సంఖ్య 5కోట్లు. అంటే ఏడాదికి కనీసం 5లక్షల మంది వలసపోయారన్న మాట. ప్రధానంగా దుర్భిక్ష, వరద పీడిత ప్రాంతాల నుంచి, జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి వలసలు వెల్లువెత్తుతున్నాయి. తరచుగా రాజకీయ, సాంఘిక సంఘర్షణలకు లోనయ్యే ప్రాంతాల నుంచి ఎక్కువమంది వలసపోతుంటారు. పేదరికం, స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడం, పట్టణాల్లో, ఇతర రాష్ట్రాల్లో పని దొరికే అవకాశం, ఇవన్నీ కలిసి గ్రామీణ జనాభాను వలసలకు ప్రేరేపిస్తున్నాయి.

బీహార్, అస్సాం, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుండి వలసలు అధికంగా ఉంటున్నాయి. వలస కార్మికుల ప్రయోజనాల రక్షణకు 1989లోనే ఒక చట్టం అమలులోకి వచ్చింది. దీనిని అంతరాష్ట్ర వలస కార్మిక చట్టంగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను నిర్ణయించడంతో పాటు వారి యోగక్షేమాలను కూడా ఈ చట్టం పట్టించుకుంటోంది. వారికి ఉద్యోగ భద్రత కల్పించడానికి, పని పరిస్థితులు మెరుగుపడడానికి, శ్రమ దోపిడీని నిరోధించడానికి కొన్ని నియమ నిబంధనలను ఈ చట్టంలో పొందుపరిచారు. దీన్ని అమలుచేయడానికి ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకొంటున్న దాఖలా లేదు. వలస దారులకు మంచి ప్రతిఫలం లభించి హుందాగా జీవించే పరిస్థితులను కల్పించడానికి ఈ చట్టాన్ని ఉపయోగించుకోవాలి. సమ్మిళిత అభివృద్ధికి ఇది ముఖ్యమైన మెట్టు అవుతుంది. ఏదిఏమైనా వలసదారుల చట్టం మరీ పాతకాలం నాటిది అయిపోయింది. దీన్ని ఎక్కడా అమలు చేయడం లేదు. ఉపాధి అవకాశాల గురించి సమాచారం గానీ, బేరమాడే శక్తి గానీ, లేకపోవడంతో తక్కువ వేతనాలిచ్చే ప్రమాదకర పనులతో నెట్టుకురావలసి వస్తుంది. వలసవచ్చిన కూలీలు స్థానికుల దౌర్జన్యానికి, సంకుచిత, ప్రాంతీయ దురభిమానాలకు తేలిగ్గా ఎర అయ్యే ప్రమాదం ఉంది. పట్టణ కార్మిక విపణుల్లో వీరికి ఆహారం, నివాసం, వైద్యం, విద్య వంటి కనీస వనరులూ కరువే! స్థానిక సంస్థలు గానీ, రాష్ట్ర ప్రభుత్వాలు గానీ ఈ వలస కూలీల గురించి పట్టించుకోవడం లేదు. ఉదాహరణకు చూసినట్లయితే ఒడిశా నుండి వలస వచ్చి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులను చూడండి. దుర్భిక్ష పీడిత జిల్లాల్లోనే పనులు కల్పిస్తే స్థానికులు వేరే రాష్ట్రాలకు వలస వెళ్ళాల్సిన అగత్యం తప్పుతుంది. ఈ జిల్లాల్లో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏడాదిలో 200రోజుల పాటు పని కల్పించడం వలసల సమస్యను చాలా వరకు నివారిస్తుంది. కానీ, గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో కూలీ కుటుంబాలకు సగటున ఏడాదికి 45రోజులకు మించి పనిచూపలేకపోయాయి. వలస కూలీలకు మూల రాష్ట్రాలయిన బీహార్, జార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో కలిసి వలస కూలీల ప్రయోజనాలను రక్షించాలి. వారికి కనీస వేతనం, భీమా తదితర సౌకర్యాలను కల్పించేలా చూడాలి. కేరళ జనాభాలో ఏడు శాతం వలస కూలీలే. మరే రాష్ట్రంలో లేని సానుకూల పరిస్థితులు, వేతనాలు లభిస్తాయి. కనుకనే వలస కార్మికులు కేరళకు పెద్దఎత్తున తరలిరావడం జరుగుతున్నది. వలస కార్మికుల మూల రాష్ట్రాల్లో కనీస దినసరి వేతనం 90–200కాగా కేరళలో మాత్రం 600–700. కేరళ నుంచి ప్రతి వలస కార్మికుడు ఏటా సగటున 70,000చొప్పున సొంత రాష్ట్రంలోని తమ కుటుంబాలకు పంపుతున్నారని సర్వేలో తేలింది. భారతదేశ ప్రగతికి కార్మిక వలసలు అవసరం కాబట్టి ఇవి ఇప్పట్లో ఆగవు. వీరు జాతీయాదాయ వృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నారు. పూర్తిగా వలస కూలీలతోనే నిర్మితమైన కొచ్చి మెట్రో రైలు ప్రాజెక్టును ఇందుకు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. ఇండియాలో ఈ వలసలను ఆపాలంటే వ్యవసాయరంగంలో నూతన విప్లవాత్మక మార్పులు తక్షణమే రావాలి. తద్వారా గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు వలసలను నివారించడం సాధ్యమవు తుంది.

– శ్రీనివాస్ చిరిపోతుల, 96034 71199

మన తెలంగాణ
5
హైదరాబాద్
మంగళవారం
20 మార్చి, 2018
www.manatelangana.news






యువత

చరిత్ర ప్రేమికుడి నిత్య అన్వేషణ!

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అత్యంత పురాతన చారిత్రక ప్రదేశాల గురించి క్షుణ్ణంగా తెలిసిన అతికొద్దిమందిలో అరవింద్ ఒకడు. పరిశోధనలో భాగంగా అతను తిరగని ప్రదేశమంటూ లేదు. అధ్యయనం చేయని చారిత్రక ప్రాంతమంటూ లేవు. ప్రతీ ప్రాంతంలోని చారిత్రక కట్టడాలను నిశితంగా పరిశీలించడమే పనిగా పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో అనేక ప్రాచీన దేవాలయాలు, చెరువులను సందర్శించాడు. విలువైన సమాచారాన్ని సోషల్‌మాధ్యమం ద్వారా అందరితో పంచుకుంటున్నాడు.



జనగామజిల్లాలోని రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన అరవింద్ వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. అరవింద్‌కు చిన్నప్పటి నుంచి చారిత్రక ప్రదేశాలు, పురాతన కట్టడాలు అంటే చాలా ఇష్టం. జిల్లాలోని చారిత్రక ప్రాంతాలకు ఇంటర్ చదువుతున్న కాలంలోనే వెళ్తుండేవాడు. వరంగల్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రం అంతటా ఉన్న పురాతన కట్టడాలు, చరిత్రక ప్రదేశాలు గురించి తెలుసుకోవడం కొత్త విషయాలను వెలుగులోకి తేవడం మొదలుపెట్టాడు. బిఏ జర్నలిజం కోర్సు చేసిన అరవింద్‌కు వివిధ ప్రదేశాల చారిత్రక అంశాలను డాక్యుమెంటేషన్ చేయడంలో సులువైంది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా జన ప్రాచుర్యంలోకి తీసుకురావడం మొదలుపెట్టాడు. పురాతన చారిత్రక ప్రదేశాల గురించి క్షుణ్ణంగా తెలిసిన అతికొద్దిమందిలో అరవింద్ ఒకడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. తను చేస్తున్న పరిశోధనలో భాగంగా అరవింద్ తిరగని ప్రాంతమంటూ లేదు. ప్రతీ ప్రాంతంలోని చారిత్రక కట్టడాలను నిశితంగా పరిశోధించాడు. అనేక ప్రాచీన దేవాలయాలు, చెరువులను సందర్శించి విలువైన సమాచారాన్ని సేకరించాడు.

మన ఇష్టమే మన భవిషత్తును నిర్ణయిస్తుందని నమ్ముతాడు. అరవింద్ జర్నలిజం చదువుతున్నా కూడా వివిధ చారిత్రిక ప్రాంతాలను సందర్శిస్తుండడం మాత్రమే కాదు పుస్తకాలలో నిక్షిప్తం కానివి సైతం కనుగొని వాటిని ఉన్నతాధికారులకూ చేరవేస్తాడు. తన పరిసర ప్రాంతమైన వరంగల్ జిల్లాను పూర్తిగా తిరగేశాడు. కాకతీయుల చారిత్రక కట్టడాలు, పురాతన విగ్రహాలు, వాటి తాలుకు ఆనవాళ్ళు ప్రాంతాలను వివరిస్తూ ప్రత్యేకంగా డాక్యుమెంటరీలను కూడా రూపొందించి సామాన్యులకు అవగాహన కల్పిస్తున్నాడు. ఈ ప్రయాణంలో ఇప్పటికి వెలికిరాని గత చరిత్ర ఆనవాళ్ళను వెలుగులోకి తీసుకొచ్చాడు. జయశంకర్ భూపాలపల్లి మల్లూరు కొండ ప్రాంతంలోని సుమారు 8కి మీ గోడను కనుగొన్నాడు. ప్రతి ప్రాచీనకాలం నాటి దేవాలయ గోడలపై ఆలయానికి సంబంధించిన చరిత్ర సంస్కృతంలో లిఖించి ఉంటుంది. వాటిని తెలుసుకుని, ఇప్పటి వరకు దాదాపు 600 ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి చరిత్రను అనేక వ్యాసాలను రాస్తున్నాడు. వాటిని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం రాస్తూ, దానితో పాటు మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడు. చరిత్రను వెలికితీస్తూనే ఇంటర్‌నెట్‌లో ప్రచారం చేస్తున్నాడు. చరిత్ర పరిశోధకులు, పురాతత్వవేత్తల ప్రశంసలు అందుకొంటున్నాడు.అన్వేషణలో భాగంలో రాష్ట్రంలో ఇప్పటివరకు 573 ప్రదేశాల్లో పర్యటించాడు.

అరవింద్ సాధించిన ఘనత..

* జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేట మండలం మల్లూరు కొండ ప్రాంతంలో 8కి.మీ పొడవైన పురాతన గోడను కనుగొన్నాడు.
* శివనగర్ ప్రాంతంలో మరుగున పడిన కాకతీయుల నాటి మెట్లబావి పునరుద్ధరణకు కృషి చేశాడు.
* వరంగల్ దర్శిని అనే శీర్షికతో వరంగల్ ఆకాశవాణి కేంద్రం నుంచి అనేక రేడియో ప్రసంగాలు చేశాడు.
* వరంగల్ ముచ్చట అనే పేరుతో ఒక వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నాడు. ఇప్పటి వరకు 300పైగా కథనాలను ప్రచురించాడు.

బ్రింగ్ ఏ స్మైల్

నవ్వుతూ బతకాలిరా తమ్ముడు నవ్వుతూ చావాలిరా అన్నాడు సినీకవి ఆత్రేయ. కొందరు నవ్వడానికే తెగబాధపడతారు. మరికొందరు నవ్వుదామన్నా నవ్వురాక బాధపడుతుంటారు. కష్టం కంఠం నులిమేస్తుంటే ఏమీ చేయలేని దుస్థితిలో కునారిల్లే అభాగ్యులు వారు. నగరాలలో పేవ్‌మెంట్ల మీద, ప్లాట్‌ఫారాల మీద, సర్కిల్ లాండ్ స్కేప్ మీద, డివైడర్లమీద బాధాతప్తజీవనులెందరో తారసపడుతుంటారు. చితుకుల సెగతో, చింకిపాతలతో కుక్కలే నేస్తాలుగా డొక్కలో కాళ్లు పెట్టుకుని మూడంకె వేసుకుని కూచుని ఎందరో దీనార్తులు కనబడుతుంటారు. ఈ దృశ్యం ఏ ఒక్కరికో సొంతం కాదు. ఓపెన్ సీక్రెట్‌లా ఉండేదే! అయినా అర్చనలాంటి వారెవ్వరో ఒకరిద్దరు తప్ప స్పందించగల పుణ్యాత్ములు కనిపించరు.

ఇలాంటి వాళ్లకు ఏదో ఒక సాయం చేయాలి! చిన్న దుప్పటైనా ఇవ్వాలి అని అలమటించిపోయింది అర్చన. ఇచ్చింది సంతోషంగా తీసుకుని ఆనందపడితే చూసి సంతోషించాలన్న కోరిక ఆమెలో పుట్టింది. తన మనసులో మాటను అమ్మతో షేర్ చేసుకుంది. 'ఈ మాటలను సోషల్ మీడియాలో కూడా చెప్పిచూడు. దయా హృదయులు ఎందరో తారసపడకపోరు' అని సలహా ఇచ్చింది.



అర్చన ఉండేది హైటెక్ సిటీలోని ఇందు ఫర్చూన్ ఫీల్డ్స్ అనే గెటెడ్ కమ్యూనిటీలో. పదుల సంఖ్య లో కుటుంబాలుంటాయి. అందరి నంబర్ తీసుకుని మీకు అవసరం లేని బట్టలు, దుప్పట్లు ఉంటే ఇవ్వండి.. వాటిని సిటీలోని అభాగ్యులకు చేరవేద్దాం' అని వాట్సాప్ ద్వారా ఒక మెసేజ్ పాస్ చేసింది. నిమిషాల వ్యవధిలో 40 మంది స్పందించారు. సొంత ఖర్చుతో వెయ్యి పాంప్లెట్స్ ముద్రిస్తానని ఒకరు, పైసా తీసుకోకుండా ఆ కరపత్రాలను న్యూస్ పేపర్లో పెట్టి ఇంటింటికీ వేస్తానని మరొకరు వాలంటరీగా ముందుకు వచ్చారు. 40 కుటుంబాల వాళ్లు ఒకరిని మించిన ఒకరి సేవా భావంతో ఏడాదిపొడవునా జంటనగరాల్లోని బీదాబిక్కీకి తోచిన సాయం చేశారు. అలా మొదలైంది బ్రింగ్ ఏ స్మైల్ హైదరాబాద్ నెట్‌వర్క్. మొదటి అడుగు ఎప్పుడూ ఒంటరిదే అంటారు. కానీ అర్చన తన మొదటి అడుగును వందల మందితో కలిసి వేసింది.

12 ఏళ్లుగా వివిధ మల్టీనేషనల్ కంపెనీల్లో పనిచేసిన అర్చన కార్పొరేట్ కమ్యూనికేషన్ ప్రొఫెషనల్. యాహూ, హెచ్‌ఎస్‌బీసీ, మైక్రోసాఫ్ట్, ఐటీ హబ్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో వర్క్ చేసిన అనుభవం ఉంది. మొదట్లో బట్టలు, దుప్పట్లు లాంటి వాటితో మొదలైన సర్వీస్ మెల్లిగా మురికివాడల్లోని పిల్లలు చదువుకునేందుకు పుస్తకాలు, బ్యాగులు, పెన్సిళ్లు స్థాయికి విస్తరించింది. ఆ తర్వాత ఒక్కో ఏరియా పెరుగుతూ వచ్చింది. కమ్యూనిటీ సర్వీస్ లాంటిది డెవలప్ అయింది. ఫేస్ బుక్ లో పేజ్. వాట్సప్ లో గ్రూప్. ఎవరికి ఏ అవసరం ఉన్నా చిన్న మెసేజ్ పెడితే చాలు. వ్యక్తులైనా, సంస్థలైనా.. ఎవరికి ఏం కావాలన్నా బ్రింగ్ ఏ స్మైల్ సమీకరించి పెడుతుంది. సోషల్ మీడియా బ్రింగ్ ఏ స్మైల్‌ని ఇంతపెద్ద సేవాసంస్థను చేస్తుందని అనుకోలేదు. అర్చనకు స్కూల్ ఫ్రెండ్స్, కాలేజీ ఫ్రెండ్స్ ఎందరో ఉన్నా వారిని డబ్బు సాయం కోరేందుకు ఇష్టపడలేదు. కానీ అవసరాలు మొహమాటాన్ని మార్చేశాయి. ఏ సంస్థకైతే డబ్బు సాయం అవసరముందో దాతలంతా నేరుగా సంస్థలకే ఇచ్చుటట్టుగా చూడగలిగింది. వీలైనంత మందికి రశీదులు కూడా ఇచ్చింది.

బ్రింగ్ ఏ స్మైల్ మొగ్గదశ నుంచి ఒక ట్రస్టుగా రూపాంతరం చెందాక బ్యాంక్ అకౌంట్, పాన్ నంబర్ కూడా తీసుకున్నారు. డైలీ ఈ ట్రస్టు నుంచి వేల సంఖ్యలో దీనార్తులు ఏదో ఒక రూపంలో సాయం పొందుతున్నారు. దీనుల సేవే ఒక అర్చనగా, ఆరాధనగా మారింది అర్చన విషయంలో! ఆమె సాయంతో చదువుకుని బాగుపడుతున్న వారు, ఈతిబాధలు అధిగమిస్తున్నవారు, ఆర్థికసాయం పొంది సొంతకాళ్ళమీద నిలబడుతున్న వికలాంగులు, వీల్‌చైర్లు పొందుతున్న వారు వేల సంఖ్యలో ఉన్నారు.

ప్రస్తుతానికి బ్రింగ్ ఏ స్మైల్ నెట్‌వర్క్ లో 200 మంది పార్టిసిపెంట్స్ ఉన్నారు వారిలో 50 మంది యాక్టివ్ పార్టిసిపెంట్స్. ఉన్నారు. కార్పొరేట్ కంపెనీలూ ఉన్నాయి. మూడు బస్సులు మారి బడికి వెళ్ళే మియాపూర్ విద్యార్థుల కోసం అర్చన అభ్యర్థనపై హైగ్రో కెమికల్స్ వారు ఒక వ్యాన్ స్పాన్సర్ చేశారు.

మెర్క్ ఫార్మాస్యూటికల్స్ వాళ్లు అర్చన చేస్తున్న సర్వీసులను బాహ్య ప్రపంచానికి తెలియజెప్పడం కోసం ఆమెమీద ఒక వీడియో తీసి యూట్యూబులో పెడితే 7లక్షలపైనే వ్యూస్ వచ్చాయి. బ్రింగ్ ఏ స్మైల్ వాట్సప్ గ్రూపులో ఎంతటి దయార్థ్ర హృదయులున్నారంటే.. ఒకసారి ఒక పేదమహిళకు రెండు ఇంజెక్షన్లేవో అవసరపడ్డాయి. వాటి ఖరీదు 70వేలు. ఆ విషయం గ్రూపులో పోస్టు చేసిన కొన్ని గంటల్లోనే స్పందించి ఒకాయన 70వేలు తీసుకొచ్చి ఆవిడకిచ్చాడు. బ్రింగ్ ఏ స్మైల్ లో ఫుల్ టైమర్లున్నారు. వలంటీర్‌గా వచ్చి పనిచేసేవాళ్లూ ఉన్నారు.



అన్నిసేవలూ ఒకే యాప్‌తో..

హైదరాబాద్‌కు చెందిన శిరీషగౌండి, రాహుల్ దేవరకొండలు భార్యాభర్తలు. లక్ష్మ ణ్ సందీప్ శిరీష సోదరుడు. శిరీష రాహుల్‌లు వృత్తిరీత్యా అమెరికాలో ఉండేవారు. అక్కడి నుంచి ప్రతిరోజూ తల్లిదండ్రుల క్షేమసమాచారాన్ని తెలుసుకొనేవారు. ఈ నేపథ్యంలో ఏవస్తువులు కావాలన్నా బయటకు వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా మారిందని, బయటకు వెళ్లలేకపోతున్నామంటూ వారు వాపోయారు. అప్పుడే శిరీష దంపతులకు ఒక ఆలోచన వచ్చింది. ముఖ్యంగా వృద్ధులకోసం మరింత సౌకర్యవంతంగా ఉండేలా ఓ యాప్‌ను రూపొందించాలనుకున్నారు. అలా పుట్టిందే ఊబ్లూ. అసలు యాప్‌నకు ఈ పేరు ఎందుకు పెట్టారంటే..కార్టూన్ నెట్‌వర్క్ చానల్‌లో ఓ ప్రోగ్రాం పేరే ఊబ్లూ. ఎవరికి ఏ సాయం కావాలన్నా ఒక్క బటన్‌తో వారికి సాయం అందేలా దాంట్లో ఉంటుంది. దాని స్ఫూర్తితోనే ఊబ్లూ అనే పేరు పెట్టినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

గూగుల్ ప్లేస్టోర్ నుంచి woobloo అనే యాప్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత దానిలో రిజిస్టర్ కావాలి. వెంటనే దాంట్లో ఆన్‌లైన్ షాపింగ్, ట్రైన్ బుకింగ్, మూవీ టికెట్స్, ఫుడ్ డెలివరీస్, బస్ బుకింగ్, గ్రాసరీస్, ఫ్లైట్ బుకింగ్, హోటల్ బుకింగ్ ఇలా అన్ని రకాల సేవలు కనిపిస్తాయి. వీటిల్లో మనకు కావాల్సిన సేవపై క్లిక్ చేయాలి. వెంటనే ఊబ్లూ కి కాల్ చేయాలా అనే ఆప్షన్ ప్రత్యక్షమౌతుంది. ఐదు సెకన్ల సమయంతో టైమర్ ఆన్ అవుతుంది. మనకు ఓకే అనుకుంటే అలాగే ఉంచాలి. వెంటనే డైరెక్టుగా ఊబ్లూకి కా ల్ వెళ్తుంది. అక్కడ ఉండే పర్సనల్ అసిస్టెంట్ కాల్‌ను అందుకుని, జీపీఆర్ఎస్ సాయంతో కస్టమర్ చిరునామాను గుర్తిస్తారు. కోరిన సాయాన్ని అందిస్తారు.

ముందుగా ఎవరైతే రిజిస్టర్ చేసుకుంటారో వారికి మొదటి నెల అన్ని సేవలను ఉచితంగా అందిస్తోంది ఊబ్లూ. నెల ముగిసాక వృద్ధులకు రూ. 499, మిగతావారికి రూ.699 చొప్పున చార్జీ వసూలు చేస్తారు. అంతే కాకుండా కిరాణ షాపునకు వెళ్లకుండా ఇంటివద్దే ఉండి పప్పులు, ఉప్పులాంటి నిత్యావసర వస్తువులు ఈ యాప్ ద్వారా పొందవచ్చు. ఇందుకోసం మనకు కావాల్సిన సరుకుల లిస్ట్‌ను ఒక పేపర్‌పై రాసుకోవాలి. తర్వాత యాప్‌లో ఉన్న గ్రాసరీస్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. కెమెరా గ్యాలరీ అనే ఆప్షన్లు కనిపిస్తాయి. మనం రాసిన లిస్టును గ్యాలరీలో ఉంచి క్లిక్ చేయాలి. అంతే ఈ లిస్టు ఊబ్లూకి చేరుతుంది. సరుకులన్నీ ముంగిట్లో వచ్చి వాలతాయి.



వృద్ధులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన యాప్ ఊబ్లూ. ఇందుకోసం రెండువేల మంది సీనియర్ సిటిజన్లను కలిశాం. ప్రస్తుతం దీని ద్వారా 1400మంది సేవలు పొందుతున్నారు. త్వరలో గిఫ్టింగ్, ఫొటోగ్రఫీ, మెడికల్ ట్యాక్సీ వంటి సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళల భద్రత కోసం ఊబ్లూలో ఎమర్జెన్సీ ఐకాన్ ఉంది. మహిళలు ఇబ్బందుల్లో ఉంటే సాయం చేస్తుంది. ప్రపంచంలో ఎక్కడైనా వేధింపులు ఎదురైతే ఎమర్జెన్సీ బటన్‌పై క్లిక్ చేస్తే సరిపోతుంది. వెంటనే పోలీసులకు సమాచారం అందుతుంది. యాప్‌లో రిజిస్టర్ అయ్యే సమయంలో మనకు నచ్చిన వారి ఇద్దరి నెంబర్లు ఇవ్వాలి. దీంతో పోలీసులతోపాటు వారిని కూడా అలర్ట్ చేస్తుంది.

కరెంట్, టెలిఫోన్, వాటర్‌బిల్, మొబైల్ బిల్ ఇలా ఏ బిల్లు కట్టాలన్నా సంబంధిత కార్యాలయం, లేదా మీసేవ ఈ సేవలకు వెళ్తాం. ఇక అలాంటి అవసరం లేకుండా ఊబ్లూ యాప్ ద్వారా ఈ బిల్లులన్నింటినీ సులభంగాకట్టేయొచ్చు.

సాధారణంగా షాపింగ్ చేసిన బిల్లులు, ఏటీఎం క్రెడిట్ కార్డు స్లిప్పులు, ఇతర బిల్లులను మనలో చాలామంది పడేసుకుంటాం. సరిగ్గా సమయానికి అవసరమైనప్పుడ అవి దొరకవు. ఈ బిల్లు స్లిప్పులన్నింటినీ ఊబ్లూకి పంపితే వాళ్లు అవి సిస్టంలో సేవ్ చేస్తారు. మనకు కావాల్సినప్పుడు ఫోన్ చేసి అడిగితే .. ఆ బిల్స్‌ను తిరిగి పంపిస్తారు. ఇంట్లోని వస్తువులకు రిపేర్ వస్తే టెక్నీషియన్‌ని కూడా పంపుతారు. మెడిసన్స్‌పై 25శాతం డిస్కౌంట్ దొరుకుతుంది. డాక్టర్ రాసిచ్చిన మెడికల్ ప్రిస్క్రిప్షన్‌ను ఊబ్లూకి సెండ్ చేస్తే, వారు నిర్ణీత సమయంలో ఈ మందులను ఇంటికి పంపిస్తారు. ఎన్ని మందులు తీసుకున్నా వాటిపై 25శాతం డిస్కౌంట్ లభిస్తుంది. ఇన్ని సౌకర్యాలతో విజయవంతంగా అందిరికీ సేవలందిస్తోందీ యాప్.

నయా గాడ్జెట్స్



అతి చిన్న పీసీ

ఎలైట్ గ్రూప్ కంప్యూటర్ సిస్టమ్స్ (ఈసీఎస్) సంస్థ 'లివా క్యూ' పేరిట ప్రపంచంలో అత్యంత చిన్నదైన విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారిత మినీ పీసీని భారత్‌లో లాంచ్ చేసింది. ఈ కంప్యూటర్ బరువు కేవలం 260 గ్రాములు మాత్రమే ఉంటుంది. దీనిలో ఇంటెల్ అపోలో లేక్ ప్రాసెసర్లు, 4 జీబీ ర్యామ్, 32/64 జీబీ స్టోరేజ్, 128 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, విండోస్ 10 హోమ్ ఓఎస్, డ్యుయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 4.1, రెండు యూఎస్‌బీ పోర్టులు, ఒక హెచ్‌డీఎంఐ పోర్టు, ఒక ఈథర్‌నెట్ పోర్టు ఉన్నాయి. దీనిలో వెసా మౌంట్ పోర్టును ఏర్పాటు చేశారు. ఈ పీసీని మానిటర్లు, టీవీలకు కనెక్ట్ చేసుకోవచ్చు. విండోస్ 10 ఓఎస్ లేకుండా అయితే ఈ మినీ పీసీ రూ.13,500 ధరకు లభిస్తుంది. అదే విండోస్ 10 ఓఎస్ కావాలనుకుంటే ఈ పీసీని రూ.15,500 ధరకు కొనుగోలు చేయవచ్చు.ఈ మినీ పీసీ త్వరలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ స్టోర్స్‌లో లభ్యం కానుందని ఎలైట్ గ్రూప్ సంస్థ తెలిపారు.

షియోమీ

యెల్లైట్ నుంచి సరికొత్త ప్రొడక్ట్ మార్కెట్లోకి విడుదల కానుంది. స్మార్ట్ హోం ప్రొడక్ట్ యెల్లైట్ వాయిస్ అసిస్టెంట్ ఆధారిత స్మార్ట్ స్పీకర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. యెల్లైట్ అసిస్టెంట్‌లోని ఫీచర్లు... ఈ స్మార్ట్ స్పీకర్ పైభాగంలో నాలుగు బటన్స్ ఇచ్చారు. యాక్షన్ బటన్, మైక్రో బటన్ ఆఫ్‌ఆన్, వాల్యూమ్ అప్ బటన్. వాల్యూమ్ డౌన్ బటన్, ఎకో డాట్ మాదిరిగా ఉంటుంది. ఈ డివైస్ అడ్వాన్స్ వాయిస్‌వేక్ ఆల్గోరిథంలో సెట్ చేశారు. ఇది 5మీటర్ల పరిధిలో ఉన్న డివైజ్ టర్న్ చేయగలదు. బీమఫార్మింగ్ టెక్నాలజీతో వాయిస్ కంట్రోలింగ్ ఉంటుంది. స్మార్ట్ స్పీకర్ 64బిట్ కార్టెక్స్ A53క్వాడ్ కోర్ ప్రాసెసర్ ద్వారా రన్ అవుతోంది. 1.2గిగా వద్ద క్లాక్, 256ఎంబి ర్యామ్, 256ఎంబి ఫ్లాష్ స్టోరేజితో ఉంటుంది. కనెక్టివిటీ పరంగా చూస్తే ఈ డివైస్ 2.4గిగా 5గిగా డ్యూయల్ బాండ్ , వైఫై, బ్లూటూత్ తో అందుబాటులోకి వస్తుంది. యెల్లైట్ వాయిస్ అసిస్టెంట్ డ్యుయల్ ఎస్ సిస్టమ్ తో పనిచేస్తుంది. ఇంట్లోని స్మార్ట్ బల్బులు, బెడ్ లైట్స్, సీలింగ్ లైట్స్ వంటి ఇతర ప్రొడకట్స్‌ను నియంత్రించేలా ఈ డివైజ్‌ను రూపొందించారు. ఈ స్మార్ట్ స్పీకర్ ధరను ప్రస్తుతం 1,950గా నిర్ణ యించినా అమ్మకాలు ఇంకా ప్రారంభం కాలేదని నిర్వాహకులంటున్నారు.



ప్రాసిక్యూటింగ్ అధికారుల పోస్టుల మంజూరుకు చర్యలు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని కోర్టుల్లో అవసరమైన ప్రాసిక్యూటింగ్ అధికారుల పోస్టుల మంజూరుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈమేరకు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తన కార్యాలయంలో న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో చర్చలు జరిపారు. అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ విభాగం బలోపేతానికి పలు నిర్ణయాలు తీసుకున్నారు. క్యాడర్ ప్రాసిక్యూటర్ పోస్టుల మంజూరు, వాటి నియామకానికి కొంత సమయం పడుతుందని, దీంతో ప్రస్తుతం జరుపుతున్న టెన్యూర్ ప్రాసిక్యూటర్ల నియామకాల్లో పటిష్టమైన విధానాన్ని అవలంబించాలని నిర్ణయించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కార్యాలయంలో అవసరమైన మినిస్టీరియల్ సిబ్బంది, ఫర్నీచర్, కంప్యూటర్లు, ఇంటర్నెట్, ఫోన్ తదితర సదుపాయాల కల్పనకు వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌కు సూచించారు. ప్రస్తుతం శాఖాధిపతి కార్యాలయానికి తగిన వసతి లేదని, అనువైన భవనాన్ని ఎంపిక చేసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేయాలని చెప్పారు. అవసరమైన ప్రాసిక్యూటర్ పోస్టుల ప్రతిపాదనలను పంపాలని సూచించారు. ఈ సమావేశానికి హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది, లా సెక్రటరీ నిరంజన్‌రావు, డిజిపి మహేందర్ రెడ్డి హాజరయ్యారు.

తక్కువ పని దినాల్లో ఎక్కువ ఉపాధి


పెరిగిన చెల్లింపులు , ఈ ఏడాది ఇప్పటి వరకు 87శాతం కుటుంబాలకు ఉపాధి



మన తెలంగాణ/హైదరాబాద్ : గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గించి వారికక్కడే ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంటుండడంతో దీనిపై ఆధారపడిన కుటుంబాల్లో దాదాపు 90% పూర్తిస్థాయి ఉపాధి పొందుతున్నారు. నిర్దేశించిన పనులకు వేగంగా సాంకేతిక అనుమతులు ఇస్తుండడంతో ఉపాధికి బాటలు పడుతున్నాయి. గత నాలుగేళ్లుగా కేవలం 50 పనిదినాల్లోనే దాదాపు 90శాతం కుటుంబాలు ఉపాధి పొందుతున్నట్లు తేలింది. ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక 2014–15 నుంచి ప్రతి ఏటా ఉపాధిహామీకి బడ్జెట్ కేటాయింపులు పెరుగుతూ వస్తున్నాయి. 2017–18లో అత్యధికంగా కేటాయింపులు జరిగాయి. తెలంగాణ ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు హరితహారం అనుసంధానం చేయడంతో గ్రామాల్లో ఉపాధి మరింత పెరిగింది. 2014–15లో 89శాతం కుటుంబాలు 40 పనిదినాలు పొందగా, 2015–16లో 90శాతం, 2016–17లో 90శాతం కుటుంబాలకు పూర్తి స్థాయి ఉపాధి లభించింది. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 87% కుటుంబాలు 39 పనిదినాల అవకాశం పొందాయి. గత నాలుగేళ్లుగా ఈ పథకం కింద చేపట్టే పనుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2014–15లో ఈ పథకం ద్వారా రాష్ట్రంలో మొత్తం 2,74,543 పనులు జరగ్గా 2015–16లో 10,25,336 పనులు, 2016–17లో 16,27,820 పనులు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 7,42,137 పనులు మంజూరయ్యాయి. తక్కువ రోజుల్లోనే ఎక్కువ ఉపాధి కల్పిస్తున్నందున రాష్ట్రానికి ఉపాధిహామీ కేటాయింపులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు విజ్ఞప్తి చేసింది.

నేడు, రేపు గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ బంద్

కమీషన్ ఏజెంట్ల సమ్మె ఫలితం



మన తెలంగాణ/హైదరాబాద్/ఎల్బీనగర్: గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 20, 21వ తేదీలలో కమీషన్ ఏజెంట్ల సమ్మె కారణంగా రెండు రోజులు పండ్ల క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ కమిటీ ఛైర్మన్ సర్దార్ పుటం పురుషోత్తమ్‌రావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఇంద్రపల్లి వెంకటేశంలు తెలిపారు. మార్కెట్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ సమ్మె కారణంగా రైతులు మంగళ, బుధవారాలలో పండ్లను మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని కోరారు. 22వ తేదీ నుంచి మార్కెట్‌లో క్రయ విక్రయాలు యథాతథంగా కొనసాగుతాయని వారు పేర్కొన్నారు. మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లకు ఉన్న సమస్యల పరిష్కారానికి మార్కెట్ పాలకవర్గం తీర్చడానికి సిద్ధంగా ఉందని వారు చెప్పారు. రెండు రోజుల పాటు క్రయ,విక్రయాలు నిలిచిపోవడంతో కోట్ల రూపాయల వ్యాపారం స్తంభించనుంది. రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్‌గా ప్రసిద్ధి గాంచిన ఈ మార్కెట్ బంద్ ప్రభావం పండ్ల ధరలపై తీవ్రంగా పడే అవకాశం వుంది. కార్యక్రమంలోమార్కెట్ డైరెక్టర్ కత్తుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియాలో ఆందోళన ఉధృతం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోనే అతిపెద్దది మాత్రమే కాకుండా పురాతన ఆసుప్రతుల్లో ఒకటైన ప్రభుత్వ ఉస్మానియా జనరల్ ఆసుపత్రినూతన భవన నిర్మాణాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలని డాక్టర్లు, అధికారులు, సిబ్బందితో కలిసి ఏర్పాటైన జేఏసి ఆందోళన ప్రారంభించి సోమవారానికి రెండు నెలలైంది. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో వైద్య సేవలను నిలిపివేసేందుకూ జేఏసీ సన్నాహాలు చేస్తోంది. అత్యవసర సేవల బంద్‌కు కూడా వెనుకాడబోమని జేఏసి స్పష్టం చేసింది. రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే నిధులు విడుదలయ్యాయని, తాజాగా సిఎం కెసిఆర్ స్వయంగా ఆసుపత్రికి వచ్చి పరిశీలించి సంబంధిత అధికారులకు నూతన భవననిర్మాణం కోసం ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆ తర్వాత పురాతన భవనాన్ని కూల్చివేయడంపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో దాని పక్కనే నిర్మించడానికి ఇంజనీర్లు డిజైన్ రూపొందించారని, దీన్ని సిఎం కెసిఆర్ కూడా పరిశీలించి ఆమోదించారని జెఏసి ఛైర్మన్ డాక్టర్ పాండునాయక్ తెలిపారు. ప్రస్తుతం వినియోగిస్తున్న భవనం శ్రేయస్కరం కాదని ఇంజనీర్లు హెచ్చరించడంతో సిఎం కెసిఆర్‌తో సహా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్యకార్యదర్శి, వైద్య, విద్యా సంచాలకులు ఆదేశాలు జారీ చేసినా ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో 'హెల్మెట్ ర్యాలీ' నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్‌టిసి ఇయు దీక్షలు ప్రారంభం

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆర్‌టిసి కార్మికులకు 62 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన వేతన సవరణ చేపట్టాలని, నష్టాలలో ఉన్న ఆర్‌టిసిని ప్రభుత్వం రూ.1500 కోట్లు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు టి.నరసింహన్ డిమాండ్ చేశారు. వేతన సవరణ చేయాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విఎస్‌టిలోని యూనియన్ రాష్ట్ర కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలను ఆయన ప్రారంభించారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్మికుల వేతన ఒప్పందం ముగిసి ఏడాది కావస్తున్నా నేటికీ యాజమాన్యం, ప్రభుత్వం నూతన ఒప్పందం చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని నరసింహన్ విమర్శించారు. రాజిరెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు పోరాటం చేయాల్సిన టిఎంయు నాయకులు వారి సదుపాయాలు, రిలీఫ్‌ల కోసం పాకులాడుతూ యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్.బాబు, యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ అహ్మద్ అలీ, కార్యదర్శులు సిహెచ్.నర్సయ్య, డి.గోపాల్,పాల్గొన్నారు.

బిజెపి, సంఘ్‌పరివార్‌లను ఓడించాలి

సిపిఎం రాష్ట్ర సదస్సులో గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని



మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి, సంఘ్‌పరివార్‌లను ఘోరంగా ఓడించి బుద్ధి చెప్పాలని గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని పిలుపునిచ్చారు. భారత దేశంలో ఎంతో కొంత బతికున్న ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే మోడీని 2019 ఎన్నికల్లో గెలవనీయవద్దని, బిజెపిని గెలిపిస్తే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారని ఆయన అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహాజన పాదయాత్ర ముగింపు వార్షికోత్సవం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా 'నేటి రాజకీయాలు వామపక్ష సామాజిక శక్తుల కర్తవ్యం' అనే అంశంపై జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా జిగ్నేష్ మేవాని హాజరై ప్రసంగించారు. దేశంలో ప్రతి రోజు సామాజిక కార్యకర్తలు, ప్రొఫెసర్లు, రచయితలు, దళిత, బహుజనులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. బిఎల్‌ఎఫ్ కేవలం తెలంగాణ రాష్ట్రానికే పరిమితం చేయకుండా దేశ వ్యాప్తంగా విస్తరించాలని పిలుపునిచ్చారు. విశ్రాంత ఐఎఎస్ కాకి మాధవరావు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ప్రజా యుద్ధనౌక గద్దర్, టిమాస్ ఛైర్మన్, ప్రొఫెసర్ కంచ ఐలయ్య, బిఎల్‌ఎఫ్ రాష్ట్ర ఛైర్మన్ నల్లా సూర్య ప్రకాష్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఎంబిటి అధ్యక్షులు మజిదుల్లాఖాన్, జాన్‌వెస్లీ, ఎంవి.రమణ, పాల్గొన్నారు. అనంతరం ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తా నూతనంగా ఏర్పాటు చేసిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ కార్యాలయాన్ని జిగ్నేష్ మేవాని ప్రారంభించారు.

ఏప్రిల్ 19 నుంచి రైతు చెక్కులు

(మొదటిపేజీ తరువాయి)

ధ్రువీకరించిన తర్వాత సమర్పించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఈ వివరాలు అందిన వెంటనే చెక్కుల ముద్రణపై వ్యవసాయశాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఆ శాఖాధికారులను ఆదేశించారు. బ్యాంకుల ద్వారా గ్రామాల వారీగా చెక్కుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎస్ఎల్‌బిసి సమావేశం నిర్వహించి బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలన్నారు. భూరికార్డుల వివరాలను కలెక్టర్లు పరిశీలించాలన్నారు. ఏప్రిల్ 15 వరకు మండలాలు, గ్రామాల వారీగా చెక్కులు అందుబాటులో ఉండేలా షెడ్యూల్ రూపొందించుకోవాలన్నారు. గ్రామాల వారీగా రిజిస్టర్లు నిర్వహించాలని చెప్పారు. ఏప్రిల్ 19 నుంచి ముఖ్యమంత్రి చెక్కుల పంపిణీ ప్రారంభిస్తారని అందుకు అనుగుణంగా యంత్రాంగం సిద్ధం కావాలన్నారు. చెక్కుల పంపిణీ సంధర్భంగా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. గ్రామాల వారీగా భూవివరాలకు సంబంధించి విఆర్‌ఓలకు 'ఇ' సైన్ సౌకర్యం, ఓటిపి విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. బ్యాంకులవారీగా చెక్కుల ముద్రణపై ప్రత్యేకంగా సమీక్ష జరపాలని స్పష్టం చేశారు.డాటా టాంపరింగ్ కాకుండా చూసుకోవాలన్నారు. చెక్కుల పంపిణీ వివరాలను రోజు వారీగా కమిషనర్ కార్యాలయానికి పంపాలని చెప్పారు.


కుల వెలి

(మొదటిపేజీ తరువాయి)

వివరాల్లోకి వెళితే ముదిరాజ్ కులానికి చెందిన బోయిని ఎల్లయ్య కుమారులైన బోయిని రాజేందర్, బోయిని సమ్మయ్యలు ఇద్దరు భూమి పంపకం విషయంలో గ్రామంలో పంచాయతీకి కుల పెద్దలకు 25 వేల రూపాయలను జమానతుగా అందజేసి పంచాయతీకి వెళ్ళడం జరిగింది. కుల పెద్దలు ఇచ్చిన ఏకపక్ష తీర్పు నచ్చక రాజేందర్ స్థానిక పోలీస్‌లను ఆశ్రయించాడు. తమ తీర్పును ధిక్కరించారనే కోపంతో బోయిని ఎల్లయ్య కుటుంబాన్ని కులం నుండి వెలివేశారు. ఎల్లయ్య చనిపోగా అంత్యక్రియలకు ఎవరూ వెళ్ళవద్దని కుల పెద్దలు ఆదేశాలు జారీ చేశారు. దానిని ఖాతరు చేయని బోయిని సంపత్, సులుగూరి రమేష్‌లను కూడా కులం నుండి వెలివేశారు. అంతేకాకుండా సులుగూరి కొమురయ్య, సులుగూరి సారయ్య, సులుగూరి చంద్రయ్య అనే ముగ్గురు సులుగూరి రాజుకు చెందిన ఇంటిని కొనుగోలు చేయాలని పెద్ద మనుషులు తీర్మానం చేయగా ఒప్పుకోనందుకు ఆ ముగ్గురు కుటుంబాలను సైతం కుల పెద్దలు బహిష్కరించారు. వారితో పాటు గోనెల రమేష్ అనే కుటుంబాన్నీ వెలివేసిన కుల పెద్దలు గ్రామంలో ఏడు కుటుంబాలను కుల బహిష్కరణకు గురిచేసి అసాంఘికంగా ప్రవరిస్తూ కుటుంబాలను కొంత కాలంగా ఇబ్బందులకు గురి చేయడం జరుగుతోంది. గ్రామంలో ముదిరాజ్ కులస్తులకు సంబంధించిన ఏ శుభ కార్యాలయాలకు వారికి ఆహ్వానం అందకుండా చేయడంతో పాటు వారి ఇళ్ళలో జరుగు కార్యక్రమాలకు కులస్తులను వెళ్ళకుండా చేయడంతో కుటుంబాలు మానసికంగా క్షోభను అనుభవిస్తూ,కుల పెద్దల నుండి బాధలను తట్టుకోలేక సోమవారం జిల్లా కలెక్టర్ అమ్రపాలితో పాటు సిపికి ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఏప్రిల్ రెండో వారంలో 'కోదండరామ్ పార్టీ' సభ

- 10 నాటికి క్షేత్రస్థాయిలో ప్రచారం
- సభ నిర్వహణకు 11 కమిటీలు



మన తెలంగాణ/హైదరాబాద్: ఏప్రిల్ రెండవ వారంలో హైదరాబాద్‌లో 'రాజకీయ పార్టీ ఆవిర్భావ సభ' నిర్వహించాలని ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలోని సన్నాహక సభ కమిటీ నిర్ణయించింది.సభకు భారీ జన సమీకరణ, నిర్వహణ నిమిత్తం11 కమిటీలను ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 10వ తేదీ నాటికి క్షేత్రస్థాయిలో సదస్సులు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సన్నాహక సభ కమిటీ తీర్మానించింది. పార్టీ పేరుపై ఎన్నికల సంఘం నుంచి ఆమోదం రాగానే రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రక్రియ వేగాన్ని మరింత పెంచనున్నారు.హైదరాబాద్‌లో సోమవారం తెలంగాణ జెఏసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అధ్యక్షతన 'సన్నాహక సభ కమిటీ' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాట్లు, జన సమీకరణ, రాజకీయ పార్టీలో చేరికలు, ప్రజా సమస్యలు, తాజా రాజకీయ పరిణామాలు తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కేంద్రంగా ఆవిర్భవించనున్న నూతన రాజకీయ పార్టీని అన్ని వర్గాలూ ఆదరిస్తాయని, కష్టపడితే ఫలితం దక్కుతుందని తెలంగాణ జెఏసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ తెలిపారు. క్షేత్రస్థాయిలో రాజకీయంగా వ్యవహరించాల్సిన వ్యూహం, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తీసుకునే చర్యలు పలు అంశాలపై కోదండరాం సమావేశంలో పాల్గొన్న ప్రతినిధి బృందానికి దిశానిర్దేశం చేశారు. సమన్వయ కమిటీ, గ్రౌండ్, న్యాయవిభాగం, సభా నిర్వహణ, సాంస్కృతిక, మీడియా, ప్రచార కమిటీ, ఐటి, మహిళా తదితర కమిటీలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాల వారీగా సన్నాహక సభ కమిటీల ఏర్పాటు బాధ్యతలను ఆయా జిల్లా కమిటీలకే అప్పగించారు. పార్టీ పేరుపై స్పష్టత రాగానే సభ తేదీని ఖరారు చేయాలని కమిటీ నిర్ణయించింది. సమావేశంలో జెఏసి ప్రతినిధులు ప్రొఫెసర్ పురుషోత్తం, రవీందర్, జి. వెంకట్‌రెడ్డి, అంబటి శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి దిలీప్‌కుమార్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తేడా రాకుండా ఓటు

(మొదటిపేజీ తరువాయి)

చొప్పున ఎంఎల్‌ఏలను కేటాయించాలని టిఆర్‌ఎస్ భావిస్తోంది. ఎవరెవరికి ఏ ఎంఎల్‌ఏలను కేటాయించాలనే విషయంపై ఇప్పటికే కసరత్తు పూర్తయింది. ఒక్కో అభ్యర్థికి సంబంధించిన ఎంఎల్‌ఏలకు ఇద్దరేసి చొప్పున మంత్రులను ఇంఛార్జులుగా నియమించినట్లు తెలిసింది. ఆ మంత్రుల్లో కె.టి.రామారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉన్నట్లు సమాచారం. ఎంఎల్‌ఏలు ఎలాంటి తప్పులు లేకుండా ఓటు వేసే బాధ్యత సదరు మంత్రులకు అప్పగించారు. రాజ్యసభ ఎన్నికల ఓటింగ్‌ను కాంగ్రెస్ పార్టీ బహిష్కరించే అవకాశం ఉందని కూడా ప్రచారం సాగుతోంది. ఇద్దరు ఎంఎల్‌ఏ సభ్యత్వాన్ని రద్దు చేసిన నేపథ్యంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ చర్య తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ కాంగ్రెస్ ఎన్నికలను బహిష్కరిస్తే కాంగ్రెస్ నుండి టిఆర్‌ఎస్‌లో చేరిన ఏడుగురు ఎంఎల్‌ఏలను కూడా ఓటింగ్‌కు వద్దనాలని అధికార పార్టీ భావిస్తుంది. అలా జరిగితే ఒక అభ్యర్థికి 30 చొప్పున ఎంఎల్‌ఏలను కేటాయించనున్నారు. బుధవారం ఒకసారి, పోలింగ్‌కు ముందు రోజు మరోసారి కూడా మాక్ పోలింగ్ నిర్వహించాలని అనుకుంటున్నారు.

కల్యాణ వైభోగమే

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటన ముఖ్యమంత్రి చేయగానే టిఆర్‌ఎస్ సభ్యులు, మహిళా ఎంఎల్‌ఏలు పెద్ద పెట్టున బల్లలు చరిచి హర్షామోదాలను వ్యక్తం చేశారు. డిప్యూటి స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి నేతృత్వంలో పలువురు మహిళా ఎంఎల్‌ఏలు అనంతరం అసెంబ్లీ లాబీల్లో సిఎం కెసిఆర్‌ను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఈ మేరకు ప్రకటన చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ఆయన మాటల్లో ''పేదరికం మనుషుల్ని అనేక రకాలుగా వేధిస్తోంది. పేదరికంతో బాధపడే వారికి కొన్ని సార్లు సాంప్రదాయాలు కూడా భారంగా పరిణమిస్తాయి. మన సమాజంలో పెండ్లి అనేది చాలా ఖర్చుతో కూడుకున్న అంశం. అందులోనూ ఆడపిల్ల పెండ్లి మరింత భారంగా పరిణమించింది. ఈ భారం వల్లనే చాలా మంది తల్లిదండ్రులు తమ ఇంటి మహాలక్ష్మిగా గౌరవించే ఆడపిల్లని గుండెల మీద కుంపటిగా భావించే మానసిక స్థితికి గురవుతున్నారు. ఆడపిల్ల కడుపులో ఉండగానే ఆ పిల్ల పెండ్లి కోసం చేయవలసిన ఖర్చును ఊహించి కొంత మంది భ్రూణ హత్యలకు పాల్పడుతున్న అమానుష ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని సార్లు పేదల ఇండ్లలో ఆడపిల్లలు పెండ్లి కాకుండానే మిగిలి పోతున్నారు. ఆడపిల్ల పెండ్లి చేయడం కోసం కుటుంబాలు అప్పుల పాలు అవుతున్నాయి. ఆర్థికంగా చితికి పోతున్నాయి. పరిపాలనలో మానవీయ విలువలు అడుగడుగునా ప్రతిబింబించాలని భావించే తెలంగాణ ప్రభుత్వం ఆడపిల్లలు ఎదుర్కొంటున్న కష్టాన్ని, వారి తల్లిదండ్రులు అనుభవిస్తున్న ఆవేదనని తీర్చాలని భావించింది. ఎన్నికల మేనిఫెస్టోలో తాము హామీ ఇవ్వక పోయినా కూడా పేదరికం ప్రభావాలను అధ్యయనం చేసే క్రమంలో పరిస్థితిలోని తీవ్రత మమ్మల్ని కదిలించింది. అందుకే పేద పిల్లల పెండ్లికి ప్రభుత్వం ఆర్థికంగా అండదండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. కల్యాణ లక్ష్మి అనే శుభప్రదమైన పేరుతో 2014 అక్టోబర్ 2న ఈ ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాం. ఆడపిల్ల కన్నీరు తుడిచి వారి తలపై కల్యాణాక్షతలు చల్లిన ఈ పథకం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టను పెంచింది. కల్యాణ లక్ష్మి వ్యక్తిగతంగా నా హృదయానికి ఎంతో దగ్గరైన పథకం . అంతకంటే ఎక్కువగా ఈ రాష్ట్ర ప్రజలు మెచ్చిన పథకం. ఆడపిల్లల కండ్లలో ఆనందం నింపిన పథకం . మొదట ఈ పథకాన్ని 'కల్యాణ లక్ష్మి' పేరుతో ఎస్‌సి, ఎస్‌టిలకు, షాదీ ముబారక్ అనే పేరుతో మైనారిటీ ఆడపిల్లలకు రూ. 51,000 అందించే పథకంగా ప్రారంభించాం, ప్రజల నుండి వచ్చిన అభ్యర్థనతో ఏ సామాజిక వర్గంతో కూడా నిమిత్తం లేకుండా రాష్ట్రంలోని నిరుపేదలందరికీ కూడా వర్తింపజేసాం. సార్థకమైన ఈ పథకం ప్రయోజనం మరింత పెంచాలనే ఉద్దేశ్యంతో పథకం ద్వారా అందించే మొత్తాన్ని గత ఏడాది రూ. 75,116లకు పెంచాం. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 3 లక్షల 60 వేల మందికి లబ్ది చూకూరింది. కల్యాణ లక్ష్మి చెక్కులు తీసుకుంటున్న సమయంలో తమకు అందిన సహాయానికి సంతోషిస్తూ ఆడపిల్లల తల్లులు ఆనంద భాష్పాలతో ప్రభుత్వాన్ని దీవిస్తున్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఇతర సామాజిక ప్రయోజనాలను సాధించింది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందడానికి కనీస వయే పరిమితి 18 సంవత్సరాలుగా నిర్ణయించడంతో ఈ పథకం ప్రయోజనాలు పొందడానికి బాల్యవివాహాలు చేయకుండా తల్లిదండ్రులు వేచి ఉంటున్నారు. ఈ విధంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ బాల్యవివాహాలను నిరోధించడానికి ఉపయోగ పడుతోంది. కల్యాణ లక్ష్మి అందుకున్న వివాహాలకు ప్రభుత్వ గుర్తింపుతో పాటు చట్టబద్ధత లభిస్తున్నది. ఇది ఈ పథకం సాధించిన మరో ప్రయోజనం అత్యంత మంగళకరమైన ఈ పథకానికి సంబంధించి మరో శుభవార్తను శాసనసభ ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నాను. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద ఆడపిల్ల పెండ్లి కోసం అందించే మొత్తాన్ని రూ. 75,116 నుండి రూ. 100116కు పెంచుతున్నాం. ప్రభుత్వం తీసుకున్న ఈ మంచి నిర్ణయానికి ఆడపిల్లలు, వారి తల్లిదండ్రుల నుండే కాకుండా సమాజ హితం కోరే వారందరి నుండి హర్షామోదాలు లభిస్తాయని విశ్వసిస్తున్నాం. వారి ఆశీర్వాదమే కొండంత అండగా సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నాం'' అని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు.

ఆరు వారాలు ఆగండి

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి హైకోర్టు సోమవారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. తెలంగాణ న్యాయ,శాసనవ్యవహారాల శాఖ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం చర్యలు తీసుకోరాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తి బి.శివశంకరరావ ఆదేశించారు. శాసనసభ్యత్వాలను స్పీకర్ రద్దు చేసిన నిర్ణయాన్ని కోమటిరెడ్డి, సంపత్‌లు సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన కేసులో వారికి తాత్కాలిక ఊరట లభించింది. ఈ ఘటన జరిగిన12 తేదీ నాటి అసెంబ్లీ సమావేశాల వీడియో ఫుటేజీని సీల్ కవర్‌లో ఈ నెల 22 నాటిలోగా తమముందుంచాలని అసెంబ్లీ సెక్రటరీని న్యాయమూర్తి ఆదేశించారు. ప్రతివాదులందరూ తమ వాదనలతో కౌంటర్ వ్యాజ్యాలు దాఖలు చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ సెక్రటరీ,శాసన, న్యాయ వ్యవహారాల శాఖ సెక్రటరీ, కేంద్ర ఎన్నికల సంఘం సెక్రటరీలు కౌంటర్లు వేయాలని ఆదేశించారు.

మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు గాయం అయిందని చెప్పి వారి శాసనసభ్యత్వాలను రద్దు చేయలేదు. గవర్నర్ సభలో ప్రసంగ సమయంలో వారిద్దరూ సభా గౌరవాన్ని మంటగలిపారు. అందుకే వారిద్దరి సభ్యత్వాలను రద్దు చేయడం జరిగింది. అది కూడా సభ తీర్మానం తర్వాతే నిర్ణయం జరిగింది. అని ప్రభుత్వ, అసెంబ్లీ కార్యదర్శుల తరపున అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి వాదించారు. సభ తీర్మానం ప్రతి ఇంత వరకూ అందలేదని పిటిషనర్లు చెప్పడాన్ని న్యాయమూర్తి గుర్తు చేశారు. వెబ్‌సైట్‌లో ఉందని ఏజీ చెప్పిన జవాబుపై న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషనర్లకు తీర్మానం ప్రతి ఇచ్చారా లేదో చెప్పండి అనగానే ఏజీ కల్పించుకుని ఇప్పుడే ఇస్తామని బదులిచ్చారు. సభ్యులిద్దరినీ సభ నుంచి బహిష్కరిస్తూ చేసిన తీర్మానాన్ని పిటిషనర్లు ప్రశ్నించలేదు కాబట్టి ఈ నిర్ణయంపై స్టే ఇవ్వడానికి వీల్లేదని ఏజీ గట్టిగా వాదించారు. గవర్నర్ ప్రసంగ సమయంలో వీడియో ఫుటేజీని పిటిషనర్లు కోరుతున్నారని, అయితే తమ దగ్గర ఏవీడియో ఫుటేజీ ఉంటే దానినే అందజేస్తామని ఏజీ చెప్పారు. వీడియో ఫుటేజీలనే తాము హైకోర్టుకు సమర్పించాలని కోరుతున్నామని పిటిషనర్ల లాయర్ చెప్పారు. అందుబాటులో ఉన్న వీడియో ఫుటేజీలన్నింటినీ ఇస్తామని ఏజీ బదులిచ్చారు. కోమటిరెడ్డి, సంపత్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లగొండ, ఆలంపూర్ అసెంబ్లీ స్థానాలు ఖాళీ అయినట్లు గెజిట్ నోటిఫికేషన్ గురించి న్యాయమూర్తి ప్రశ్నించారు. గెజిట్ నోటిఫికేషన్ తర్వాత కేంద్ర ఎన్నికల సంఘానిదే పూర్తి బాధ్యత ఉంటుందని, తమకేమీ సంబంధం ఉండదని ఏజీ వివరణ ఇచ్చారు. దీనిపై తమ అభిప్రాయం తెలిపేందుకు కేసు విచారణను వాయిదా వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం లాయర్ అవినాశ్ దేశాయ్ కోరారు. దాంతో సాయంత్రం 4 గంటలకు తిరిగి కేసు విచారణ ప్రారంభమైంది. పది రోజులపాటు ఎన్నికల నోటిఫికేషన్‌పై ఏవిధమైన నిర్ణయాలు తీసుకోరాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. దాంతో ఆరు వారాలపాటు గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఏచర్యలూ తీసుకోరాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. విచారణ 27కి వాయిదా పడింది.

తొలి అడుగు

(మొదటిపేజీ తరువాయి)

మరింత స్పష్టత వస్తుందన్నారు. ఇంకా చాలా మందితో మాట్లాడాల్సిన అవసరం ఉందని, ఏకాభిప్రాయం తర్వాతనే తుది రూపు జరుగుతుందన్నారు. కేవలం తామిద్దరం మాత్రమే ఈ ఫ్రంట్‌ను నిర్ణయించలేమని, తొందరపాటుతో నిర్ణయం తీసుకోవాల్సిన అవసరమూ లేదన్నారు. 2019 సాధారణ ఎన్నికలకల్లా బలమైన ఫ్రంట్ ఏర్పాటవుతుందని, భారీ ఎజెండా రూపొందుతుందని, కేవలం రాజకీయ పార్టీలతో ఏర్పాటయ్యే కూటమిగా ఉండదని, ప్రజల భాగస్వామ్యం కూడా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికలకల్లా ఫ్రంట్ ఏర్పాటు దిశగా చర్చలు జరిగాయని, దేశ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు రావాల్సిన అవసరంఉందని, ఈ మార్పు దిశగా ఇప్పుడు జరిగిన సమావేశం తొలి అడుగు మాత్రమేనన్నారు. చాలా మంది రాజకీయ మిత్రులు తమతో కలిసి వస్తారన్న నమ్మకం ఉందని, భవిష్యత్తులో ఇదే పెద్ద కూటమిగా అవతరిస్తుందన్నారు. గడచిన 71 ఏళ్ళుగా దేశంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్, బిజెపిలు పాలన సాగించినా పెద్దగా మార్పు రాలేదన్నారు. అయితే కాంగ్రెస్ లేదంటే బిజెపి... ఈ రెండు పార్టీలేనా... ఈ రెండు పార్టీలతోనే పాలన జరగాలా... వీటితోనే మార్పు వచ్చేస్తుందా... అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పోతుంది, బిజెపి వస్తుంది... ఏవైనా అద్భుతాలు జరుగుతాయా అని ప్రశ్నించారు. ఇలాంటి అద్భుతాలు సృష్టించడానికే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి రావాల్సి ఉందన్నారు. ఈ రెండు పార్టీల పాలన మాత్రమే మన దేశానికి శరణ్యం అనే ఆలోచన మంచిది కాదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశానికి బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ అవసరం ఉందని, రాజకీయాల్లో గణనీయమైన మార్పు, విప్లవం రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి, ప్రత్యామ్నాయ అభివృద్ధి శక్తి, ప్రత్యామ్నాయ ఎజెండా అవసరమని అన్నారు. ఈ ఫ్రంట్‌కు ఎవరు నాయకత్వం వహిస్తారని పాత్రికేయులు ప్రశ్నించగా, సమిష్టి నాయకత్వం ఉంటుందని, ఫెడరల్ ఫ్రంట్ ఒక ప్రజా ఫ్రంట్‌గా ఉంటుందని బదులిచ్చారు. 'హిల్ స్టేషన్ టైగర్స్', చైనా లాంటి దేశాల తరహాలో మార్పు రావాల్సిన అవసరం ఉందని, మన దేశం కూడా ఆర్థికంగా బాగా వృద్ధి చెందుతూ ఉన్నదన్నారు.

అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్నవారిలో 60% మంది మన దేశానికి చెందిన యువతేనని గుర్తుచేశారు. నిజమైన సహకార సమాఖ్య స్ఫూర్తి కలిగిన ఒక ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ సమావేశంలో మమతా బెనర్జీతో అనేక అంశాలపై చర్చించామని తెలిపారు. కాంగ్రెసేతర, బిజెపియేతర పార్టీలతో కూడిన ఫ్రంట్ గురించి పాత్రికేయులు ప్రశ్నించగా, మూసపద్ధతిలో ఆలోచించడం మంచిది కాదని, త్వరలో తమ ఆలోచనలకు అనుగుణంగా ఏర్పాటయ్యే ఫ్రంట్ ఏ విధంగా ఉంటుందో చూడండని బదులిచ్చారు. కచ్చితంగా రొటీన్ పద్ధతుల్లో ఇప్పటివరకు ఏర్పడిన ఫ్రంట్‌లకు ఇది భిన్నంగా ఉంటుందన్నారు. ఇలాంటి నూతన ఆలోచనలతో కూడిన సరైన ప్రత్యామ్నాయ రాజకీయ ఫ్రంట్‌కు ఇప్పుడు కోల్‌కతాలో బీజం పడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాల కోసం 14 ఏళ్ళ క్రితం కోల్‌కతా నగరానికి వచ్చానని, ఇప్పుడు మళ్ళీ వచ్చాయనని, ఈ మధ్య కాలంలో చాలా అభివృద్ధి కనిపిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయని కెసిఆర్ వ్యాఖ్యానించారు.

సమష్టి నాయకత్వం ఉంటుంది : మమత

రాజకీయ ప్రత్యామ్నాయానికి మొదలైన ఈ ప్రక్రియకు సమయం పడుతుందని, ఇప్పుడు పడింది తొలి అడుగు మాత్రమేనని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి, రైతాంగానికి సంబంధించిన అనేక అంశాలు తమ మధ్యన చర్చకు వచ్చాయని తెలిపారు. భిన్నమైన పద్ధతుల్లో ఈ దేశానికి చేయాల్సిందేమిటనే అంశాలపై చర్చించుకున్నామని, ప్రస్తుతం చర్చల దశలో ఉన్నదని, ఇంకా పలు రాజకీయ పార్టీలతో చర్చలు జరగాల్సిన అవసరం ఉందని, ఇంకా చాలా సమావేశాలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను రూపొందించడంపై చర్చించామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందినవారు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని, నిర్దిష్టంగా ఒక పార్టీ మాత్రమే దేశాన్ని పరిపాలించాలని కోరుకోవడం లేదన్నారు.

ప్రతి రాజకీయ పార్టీకి దానికంటూ ఒక స్వంత గుర్తింపు, ఉనికి ఉందని, ఆ పార్టీలకు వాటికంటూ ప్రాంతీయ బలం కూడా ఉందని అన్నారు. ఏ ఒక్క పార్టీ తన బలాన్ని చూసి పొంగిపోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రాంతీయ పార్టీ లు బలంగా ఉంటే రాష్ట్రాలు బలంగా ఉంటాయని, దేశం బలంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ఒకరినొకరు పరస్పరం గౌరవించుకోవాలని అన్నారు.

ప్రజాస్వామ్యంలో అందరితో కలిసి పనిచేయడం మంచిదని, ఇప్పుడు ఫ్రంట్‌లో కూడా అందరం కలిసి పనిచేస్తే ఇంతకంటే మంచి మరొకటి ఉండదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలనే నిర్ణయాన్ని మార్చుకుంటున్నారా అని ఒక పాత్రికేయుడు ప్రశ్నించగా 'మీ అభిప్రాయాలను నా నోట్లో పెట్టకండి' అని బదులిచ్చారు. రాహుల్‌గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానని, అతని అభిప్రాయాలు ఆయాన చెప్పాడని ఆమె వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'రాహుల్ గాంధీ తన అభిప్రాయాలను ఆదివారం చెప్పారు. అతను నా అభిప్రాయాన్ని అడగలేదు. అవసరం ఏర్పడినప్పుడు మా పార్టీ అభిప్రాయాన్ని చెప్తాను' అని ఆమె వివరించారు. కెసిఆర్ ఆలోచనలకు అనుగుణంగా రూపుదిద్దుకునే ఫ్రంట్ విషయంలో కనీస ఉమ్మడి ప్రణాళిక ఉంటుందా అని ప్రశ్నించగా, ఇప్పుడేగదా ఫ్రంట్‌కు సంబంధించి చర్చలు ప్రారంభమైంది, ఇకపైన వివిధ పార్టీలతో జరిగే చర్చలు, ఆ తర్వాత ప్రక్రియ సందర్భంగా దీనిపై స్పష్టత వస్తుందని సమాధానమిచ్చారు.



చెరువులో పడి నలుగురు విద్యార్థులు దుర్మరణం

మన తెలంగాణ/ టేకులపల్లి: సరదాగా ఈతకు వెళ్లిన నలుగురు విద్యార్థులు చెరువులో పడి దుర్మరణం పాలైన విషాద సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, టేకులపల్లి మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఈ ఘటనలో బానోతు సంతోష్ (14), లావుడ్యా సౌజన్ (13), భూక్యా సిద్ధు (11), బానోతు దిలీప్ కుమార్ (10) మృతి చెందారు. నాలుగు కుటుంబాల్లో తీవ్ర మనోవేదనను, గుండె కోతను మిగిల్చిన ఈ విషాద సంఘటన వివరాలు స్థానికుల కథనం ప్రకారం.... సంతోష్ బొమ్మనపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి, దిలీప్ కుమార్ నాలుగో తరగతి, సౌజన్ అదే గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి, సిద్ధు ఏడో తరగతి చదువుతున్నారు. ఒక పూట బళ్లు కావడంతో సాయంత్రం నలుగురు కలిసి ఊరు బయట ఉన్న సాయమ్మ చెరువు దగ్గరకు వెళ్లి ఈత కోసం చెరువులోకి దిగారు. నలుగురూ కూడా ఒకరి చేతులు మరొకరు పట్టుకుని జట్టుగా నీళ్లలోకి దిగి కొద్ది దూరం వెళ్లాక చెరువులో ఉన్న గోతిలోనిబురదలో ఇరుక్కుపోయి ఊపిరాడని స్థితిలో మరణించారు. మృతుల్లో ఒకరైన సిద్ధు అన్నయ్య వారిని వెతుకుతుండగా దారిలో ఒక మహిళ ఇచ్చినసమాచారం మేరకు వెంటనే ఈ విషయం గ్రామంలో, కుటుంబ సభ్యులకు తెలియడంతో హుటాహుటిన చెరువు దగ్గర వెళ్లి చూడగా వారు అప్పటికే మృతి చెందారు.

వ్యవసాయానికి ప్రభుత్వ చేయూత

- దేశంలోనే వ్యవసాయరంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు
- సర్వే నెంబర్ల వారీగా భూసార పరీక్ష కేంద్రాలు
- ఈ ఏడాదిలో ఐదువేల ప్లాంటేషన్ యంత్రాలు
- రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి : వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు, కేటాయించిన బడ్జెట్ నిధులు దేశానికే మార్గదర్శకంగా నిలుస్తాయని రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్, నల్లగొండ ఎంపి గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. దేశంలోనే అత్యధికంగా వ్యవసాయానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 14వేల కోట్లు ప్లాన్ బడ్జెట్ కేటాయించారన్నారు. రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షులుగా తొలిసారి నల్లగొండకు వచ్చిన సందర్భంగా సోమవారం గుత్తా మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ అభివృద్ధి సంబంధ విషయాలను ఎంపి వెల్లడించారు. బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ. 25వేల కోట్లు, ప్లాన్ నాన్‌ప్లాన్ కలిపి వ్యవసాయ సహకార రంగాలకు మరో 25వేల కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు గాను ఎకరాకు 8వేల పెట్టుబడితో పాటు రైతుకు భీమా ప్రీమియం కోసం రూ. 500కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ. 525 కోట్లు, రాష్ట్ర రైతు సమన్వయ సమితికి సీడ్ మనీగా రూ. 300 కోట్లను కేటాయించిందన్నారు. దీని ద్వారా సర్వే నెంబర్ల వారీగా భూసార పరీక్ష కేంద్రాల ఏర్పాటు, భూసారానికి అనుగుణంగా పంటల సాగు, పంట మార్పిడి పద్ధతులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 5వేల క్లస్టర్ల పరిధిలో రైతు వేదికల నిర్మాణం చేపడుతున్నామని, నల్లగొండ జిల్లాలో 137 మండల క్లస్టర్స్‌కు భూమిని గుర్తించడం జరిగిందన్నారు. విత్తనాలు, ఎరువులు, పండించిన పంటలకు మద్దతు ధర కోసం రైతు సమన్వయ సమితి పనిచేస్తుందన్నారు. ఈ ఏడాది 5వేల ప్లాంటేషన్ యంత్రాలు ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లు గుత్తా చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో ఆగ్రో ఇండస్ట్రీ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఉచిత విద్యుత్‌పై 4500 కోట్ల రూపాయల సబ్సీడీని ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. రైతు తీసుకున్న అప్పుల విషయంలో ఒత్తిడి ఉంటే తన దృష్టికి తేవాలని, ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, తిప్పర్తి ఎంపిపి పాశం రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





కళానగర్‌లో కార్డన్ సెర్చ్

11 మంది పాత నేరస్తుల అరెస్టు

మనతెలంగాణ/ హయత్‌నగర్: రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ ఆదేశాల మేరకు హయత్‌నగర్ పోలీసులు పెద్ద అంబర్‌పేట్ నగర పంచాయతీ పరిధిలోని కళానగర్‌ను చుట్టు ముట్టి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎల్బీనగర్ డిసిపి వెంకటేశ్వర్‌రావు అధ్వర్యంలో వనస్థలిపురం, ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం ఎసిపీలు, 20 మంది ఇన్‌స్పెక్టర్‌లు, 30 మంది ఎసైలు, 250 మంది సిబ్బందితో కళానగర్‌లో సోమవారం ఉదయం 3.30 గంటల నుంచి 6 గంటల వరకూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 11 మంది పాత నేరస్తులు, 5 గురు మహిళ నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు సరైన పత్రాలు లేకపోవడంతో పాటు 28 ద్విచక్ర వాహనాలు , 17 ఆటోలు, 1 కారు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు .అదే విధంగా అక్రమంగా విక్రయిస్తున్న 30 మద్యం బాటిళ్లను , గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఎసీపీ రవీందర్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎసీపీ పృధ్వీర్ రావు, ఇబ్రహీంపట్నం ఎసీపీ మల్లారెడ్డి , హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎసైలు , సిబ్బంది పాల్గొన్నారు.

భార్య చేతిలో భర్త దారుణ హత్య

మనతెలంగాణ/ జగిత్యాలటౌన్ : జిల్లా కేంద్రంలోని బుడగజంగాల కాలనీకి చెందిన సిరిగిరి మల్లయ్య భార్య ఎల్లవ్వ గత కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయింది. ఆమెను బాగు చేయించేందుకు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ఉగాది పండగ సందర్భంగా ఎల్లవ్వను శనివారం హైదరాబాద్ నుంచి జగిత్యాలలోని ఇంటికి తీసుకువచ్చారు. మద్యం తాగే అలవాటు ఉన్న మల్లయ్య దంపతులు ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన భర్తతో ఎల్లవ్వ గొడవ పడగా వారి కుమారులు సముదాయించి గొడవ సద్దుమణిగేలా చేశారు. సోమవారం తెల్లవారు జామున పడుకున్న మల్లయ్య తలపై ఎల్లవ్వ బండరాయితో మోది హత్య చేసి, ఆ తర్వాత కుమారులు ఉండే ఇంటికి వెళ్లి మీ నాన్న రక్తం కక్కుకుని చనిపోయాడని చెప్పడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని చూడగా మల్లయ్య రక్తపు మడుగులో పడిఉన్నాడు. తమ తల్లి మతిస్థిమితం కోల్పోయి తండ్రిని బండరాయితో కొట్టి చంపిందని, హతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వికటించిన అన్నదాన భోజనం

50 మందికి అస్వస్థత

మనతెలంగాణ/ జక్రాన్‌పల్లి (నిజామాబాద్ జిల్లా): మండలం కేంద్రంలోని వివేక్‌నగర్ తండాలో అన్నదాన కార్యక్రమంలో కలుషిత భోజనం తిని తండాకు చెందిన సుమారు 50 మంది అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందుకున్న మండల వైద్య సిబ్బందితో మండల వైద్యాధికారి రఘువీర్‌గౌడ్, తహసీల్దార్ సతీష్‌రెడ్డిలు తండాకు చేరుకొని బాధితులను పరిశీలించారు. అనంతరం డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వివేక్ నగర్‌లో తండాలోని జగదాంబ ఆలయంలో సేవాలాల్ మహారాజ్ మాలధారణ స్వాములు ఆదివారం ఉగాది పండగను పురస్కరించుకొని ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారని, అక్కడ వండిన వంటలు కలుషితం కావడంతో భోజనం చేసిన సుమారు 50 మంది అస్వస్థతకు గురయ్యాయని తెలిపారు. ఈ ఘటనలో అస్వస్థతకు గురైన బాధితులను ఆర్మూర్, నిజామాబాద్ దవాఖానాలకు తరలించి వైద్యం చేయడం జరుగుతుందని, తండాలో కూడా క్యాంప్ ఏర్పాటు చేసి ఇక్కడ కొందరికి వైద్యం అందిస్తున్నామన్నారు.

తండ్రి, కూతురు ఆత్మహత్య

మనతెలంగాణ/ నాగిరెడ్డిపేట (కామారెడ్డి జిల్లా): తాండూరు గ్రామ పంచాయతీ అక్కంపల్లి గ్రామానికి చెందిన ఎరుకల లోకయ్య(32) పెద్ద కూతురు రెండు కాళ్లు పోలియో వల్ల నడవలేని పరిస్థితి. దీంతో మూడు చక్రాల సైకిల్‌పై స్కూల్‌కు వెళ్లేది. తన కూతురు దయనీయస్థితికి మనస్తాపం చెంది కూతురుని గ్రామ శివారులో గల అక్కం చెరువులో పడవేసి లోకయ్య కూడా ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసు అధికారులు తెలిపారు. పోస్టు మార్టం నివేదికల్లో ఏమైనా అనుమానాలు ఉంటే వాటిని బట్టి చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. ఆయనతో పాటు స్థానిక ఎస్‌ఐ శేఖర్ ఉన్నారు.

పోడు భూముల్లో రైతు..

పెనుబల్లి : ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల పరిధిలోని పార్ధసారథి పురం గ్రామానికి చెందిన అంభోజు వెంకన్న(55) ఆదివారం తను సాగుచేసుకుంటున్న పోడు భూమిలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. గత నాలుగు రోజులుగా అటవీశాఖ సి బ్బంది పోడుభూముల్లో తన శాఖకు చెందిన మొక్కలు నాటేందుకు ప్రయత్నిస్తుండగా పోడుసాగుదారులు సిపిఎం పార్టీ అధ్వర్యంలో అడ్డగించినా అటవీశాఖ వారు మొక్కలు నాటుతుండటంతో తన పోలం పోతుందని మనస్థాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని శవపంచనామాకు ప్రత్నించగా అక్కడి వారు అడ్డుకుని ఆందోళన చేయడంతో అధికారులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించకున్నారు.

జైలులో ఖైదీ ఆత్మహత్యాయత్నం

మన తెలంగాణ/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం జైలులో ఖైదీ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని జూబ్లీపురకు చెందిన మాదాసు శ్రీనివాస్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2010లో జరిగిన హత్యా, దోపిడీ కేసులో నిందితుడు, 2012లో శ్రీనివాస్‌కు న్యాయస్థానం జీవిత ఖైదీ విధించింది. శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలో 2015 జూన్ 20న వరంగల్లు జైలు నుంచి ఖమ్మం జైలుకు శ్రీనివాస్‌ను తరలించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న శ్రీనివాస్ 30 రోజుల ఫెరోల్‌పై విడుదలయ్యారు. ఈ నెల 16న ఫెరోల్ ముగిసి ఖమ్మం జైలుకు రావాల్సి ఉంది. కానీ అతను రాకపోవడంతో వన్‌టౌన్ పోలీసుల సహకారంతో అతన్ని జైలుకు తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి జైలులో కేకలు వేస్తుండడంతో శ్రీనివాస్‌ను ప్రత్యేక గదిలోకి తరలించి నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో దోమల జాలికి ఏర్పాటు చేసిన ఇనుప రేకుతో గొంతు కోసుకున్నాడు. ప్రస్తుతం వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపినట్లు జైలు సూపరింటెండెంట్ అశోక్‌రెడ్డి తెలిపారు.

మంత్రిగారి పిఏనంటూ ఘరానా మోసం



మనతెలంగాణ / సిరిసిల్ల : మంత్రి కెటిఆర్ పిఏ నని, ఉద్యోగాలిప్పిస్తానని ఓ కుటుంబం నుండి 4.50 లక్షల రూపాయలు వసూలు చేసిన వ్యక్తిపై సోమవారం దూస సత్తయ్య ఆయన భార్య ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే సిరిసిల్ల వెంకంపేటకు చెందిన దూస సత్తయ్య కుమారుడైన మహేందర్‌కు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో హోంగార్డుగా ఉద్యోగం ఇప్పిస్తానని మంచికట్ల నవీన్ అనే వ్యక్తి తాను కెటిఆర్ పిఏనని చెప్పుకుని 4.50 లక్షల రూపాయలు నగదును తీసుకున్నారు. ఇందుకోసం ప్రామిసరీ నోట్లను, నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్లపైన డబ్బు తీసుకున్నట్లు, ఉద్యోగం రాకపోతే తిరిగి ఆ మొత్తాన్ని చెల్లిస్తానని కాగితాన్ని కూడా రాసి ఇచ్చాడు. అయితే ఎన్ని సార్లు తిరిగినా ఉద్యోగం ఇప్పించకపోవడంతో తమ డబ్బు తమకు ఇవ్వాలని కోరగా ఏం చేసుకుంటారో చేసుకోండని బెదిరిస్తున్నారని ఉద్యోగం ఇప్పించకపోగా తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వడం లేదని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు దూస సత్తయ్య దంపతులు ఫిర్యాదు చేశారు.

కలెక్టరేట్ ముందు రైతు ఆత్మహత్యాయత్నం

మనతెలంగాణ / సిరిసిల్ల : సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌కు చెందిన బొప్పెన తిరుపతి ఆయన భార్య బొప్పెన కవిత, కుమార్తెలతో కలిసి సోమవారం ప్రజావాణికి వచ్చాడు. తనకు చెందిన భూమి మూడెకరాల తొమ్మిదిన్నర గుంటలు పట్టాదారు పాసుపుస్తకాల్లో రికార్డయి ఉండగా అధికారికంగా కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే తన పేరిట రికార్డు చేసి మిగిలిన దానికి హక్కులు లేవని ప్రకటించడాన్ని నిరసిస్తూ క్రిమి సంహారక మందుతో కుటుంబ సభ్యులతో కలిసి ప్రజావాణికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు అతని వద్ద ఉన్న సంచిని సోదా చేసి క్రిమి సంహారక మందును స్వాధీనం చేసుకున్నారు. ఇది గమనించిన కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేసి తిరుపతిని పోలీసులకు స్వయంగా అప్పగించారు. రికార్డుల ప్రకారం అతని పేరిట ఉన్న భూమిని అతనికి రిజిస్ట్రేషన్ చేశామని, రికార్డుల్లో లేని భూమిని ఏమీ చేయలేమని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. అయితే తిరుపతి మాట్లాడుతూ ముందుగా తన భూమిని పాసు పుస్తకంలో నమోదు చేశారని, నా పాసు పుస్తకాన్ని విఆర్‌ఎ చించి వేశాడని తమ భూమిపై బ్యాంకు లోన్ తీసుకున్నామని ఇప్పుడు రికార్డుల్లో లేదంటెలాని వాపోయారు.



ఉద్యోగస్తుల సమస్యలకై కలిసి పోరాడుదాం

- టిజెఎసి జిల్లా చైర్మన్ పరిటాల సుబ్బారావు

మన తెలంగాణ/ ఎన్‌జిఒస్ కాలనీ(వరంగల్ జిల్లా) : సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని టిజెఎసి వరంగల్ జిల్లా చైర్మన్ పరిటాల సుబ్బారావు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సోమవారం హన్మకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో టిఎన్‌జిఒస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పరిటాల సుబ్బారావు మాట్లాడుతూ, తెలంగాణలోని రాష్ట్ర ప్రభుత్వ ఉ ద్యోగులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారని అందులో ఒకటి సిపిఎస్ విధానమన్నారు. గత ప్రభుత్వాలు 2003లో పెంచిన సిపిఎస్ విధానాన్ని 2004 జనవరి 1 నుంచి యుపిఎ ప్రభుత్వం అమలు పరిచి దేశంలోనే 50 లక్షల ప్రభుత్వ ఉద్యోగుల మనోస్థైర్యాన్ని దెబ్బతీశాయని విమర్శించారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కల్పించుకొని సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్ర టిజాక్



చైర్మన్ కె.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఉద్యోగులు ఎదుర్కొంటున్న 142 సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఫిట్‌మెంట్ 43 శాతం తప్ప ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్య క్తం చేశారు. సిపిఎస్ విధానం వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ అనంతరం అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని, ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని, ఉద్యోగ సమయంలో చనిపోతే వారికి ఎలాంటి భద్రత లేకుండా పోయిందని కావున వెంటనే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని అమలు పరచాలన్నారు. అలాగే 11వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించి అమలు పరచాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, టిఎన్‌జిఒస్ జిల్లా అధ్యక్షుడు కోల రాజేష్‌కుమార్, టిజిఒస్ సంఘం నాయకులు జగన్మోహన్‌రావు, ఉపేందర్‌రెడ్డి, రేచన్‌సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎడ్లబండి బీభత్సం

ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు

మన తెలంగాణ/ దోమకొండ (కామారెడ్డి జిల్లా): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని రాం మందిర్ ఆలయం వద్ద ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తుండగా అపశృతి చోటుచేసుకుంది. వివరాలు.. రాంమందిర్ ఆలయం వద్ద ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తుండగా ఒక బండి అదుపు తప్పి జనాలపైకి రావడంతో బోరెడ్డి బాల్‌రెడ్డి(45) పైనుండి బండి చక్రం వెళ్లడంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. నర్రావుల భూపతి, నర్రావుల వనజ, ఉలె పోచయ్యలకు గాయాలయ్యాయి. వీరిని దోమకొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు , కూతురు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరి ఆత్మహత్య

మన తెలంగాణ/ తలమడుగు: పంట దిగుబడి రాక చేసిన అప్పులు తీర్చే దారి లేక ఒకరు, ఆర్థిక ఇబ్బందులు, భర్త ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేక మన స్థాపం చెందిన మరొకరు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తలమడుగు మండలంలో చోటు చేసుకున్నాయి. ఎస్‌ఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన కోల్లేటివార్ విజయ్(65) తనకున్న 3 ఎకరాల పంట చేలో పత్తి పంట వేయగా సరైన దిగుబడి రాక బ్యాంకులో చేసిన లక్ష రూపాయల అప్పులు ప్రైవేటు అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపం చెంది సోమవారం మధ్యాహ్నం తన పశువుల పాకలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు క్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే బరంపూర్ గ్రామానికి చెందిన ఎల్చల్‌వార్ రోజ(30) తన భర్త ఆరోగ్య పరిస్థితి గత కొన్ని సంవత్సరాలుగా భాగా లేక పోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో సోమవారం మధ్యాహ్నం తన ఇంట్లోని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరో ఘటనలో..

మన తెలంగాణ/ హైదరాబాద్/గోషామహల్: రాజస్థాన్‌కు చెందిన జస్వంత్‌సింగ్(21) గత కొంతకాలంగా రజాక్‌పురలోని ఉమేష్ ప్లైవుడ్ హోల్‌సెల్ షాపులో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గత రెండేళ్లుగా అతని ఇంటిలోనే ఒక గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితమే అతనికి ఓ యువతితో నిశ్చితార్థం జరిగింది. ఆదివారం రాత్రి తన ఆత్మహత్యకు ఎవ్వరూ కారకులు కాదని, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియోలో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని గోషామహల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపాడు. కేసునమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మిషన్ భగీరథ పైపుల దగ్ధం



మన తెలంగాణ/ బోథ్ (అదిలాబాద్ జిల్లా) మండల కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో నిలువ చేసిన మిషన్ భగీరథ పైపులు అగ్నికి ఆహుతు అయ్యాయి. దాదాపు 20లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. అనుకోకుండా జరిగిన ఈ దుర్ఘటన మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ పని చేశారా అనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మిషన్ భగీరథ పనులు ఆలస్యం కావడంతో గత ఆరు నెలల నుంచి ఈ పైపులు కార్యాలయానికే పరిమితమయ్యాయని ప్రజలు పేర్కొంటున్నారు.

పుట్టెడు దుఖంతో పరీక్షకు హాజరు



మన తెలంగాణ/ నల్లబెల్లి (వ రంగల్ జిల్లా) : తండ్రి అనంతలోకాలకు పోతే కొడుకు పరీక్షా కేంద్రానికి వెళ్లిన హృదయవిదాకర సంఘటన నల్లబెల్లి మండలం శనిగరం గ్రామంలో పలువురిని కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన నాగపూరి రమేష్(50) అనే రైతు ఆదివారం మధ్యహ్నాం గుం డెపోటుతో మృతి చెందాడు. మృ తుడు రమేష్ 20 రోజుల క్రితమే కూతురు వివాహం జరిపించాడు. ఇంతలోనే రమేష్ మృతి చెందడంతో కుటుంబా సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి రమేష్ కుమారుడు పవన్‌కల్యాణ్ పదో తరగతి పరీక్షలకు వెళ్తుండగా గ్రామస్థులంతా బోరుమన్నారు.

ప్రశ్నాపత్రం లీక్ కాలేదు.. మాల్ ప్రాక్టీస్ జరిగింది

- సంబంధిత అధికారులను సస్పెండ్ చేశాం : పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్
- యథాతథంగా మంగళవారం పరీక్ష

మనతెలంగాణ/ హైదరాబాద్ : పదవ తరగతి ప్రశ్నాపత్రం లీక్ కాలేదని, సోమవారం అదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మాల్ ప్రాక్టీస్ ఘటనలు చోటు చేసుకున్నాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ తెలిపారు. మంగళవారం జరుగనున్న పదవ తరగతి ఇంగ్లీష్ పేపర్2 పరీక్ష యథాతథంగా జరుగుతుందని స్పష్టం చేశారు. అదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని తాడిహడపనూర్ జిల్లా పరిషత్ పాఠశాల పరీక్షా కేంద్రంలో ఒక ఇన్విజిలేర్ స్వయంగా ఇంగ్లీష్ పేపర్–1 ప్రశ్నాపత్రాన్ని ఫొటోలు తీసి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు నిర్థారణ అయ్యిందని, ఈ ఘటనలో ఇన్విజిలేటర్‌తో సహా పరీక్షా కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, అడిషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా మారికల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఒక బయటి వ్యక్తి ప్రహరీ గోడ దూకి, విద్యార్థి పరీక్ష రాస్తున్న కిటికీ వద్దకు వెళ్లి ప్రశ్నాపత్రాన్ని ఫొటోలు తీసినట్లు నిర్థారించామన్నారు. ఈ పరీక్షా కేంద్రానికి సంబంధించిన సిబ్బంది మొత్తాన్ని విధుల నుంచి తప్పించడంతో పాటు సంబంధిత వ్యక్తి పోలీసు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే సూర్యాపేట జిల్లాలో నూతన్‌కల్ జిల్లా పరిషత్ పాఠశాలఎ పరీక్షా కేంద్రంలో ఒక ఇన్విజిలేటర్ సస్పెండ్ చేయడంతోపాటు బి పరీక్షా కేంద్రంలో మరొక ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. జిల్లా విద్యాధికారులు అప్రమత్తంగా ఉంటూ మిగతా పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వకుండా పగడ్బంధీగా పరీక్షలు నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.

తాడిహత్నూర్‌లో.. పరీక్ష ప్రశ్న పత్రం లీక్

ఆదిలాబాద్/ నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పదవ తరగతి ఇంగ్లిష్ మొదటి పేపర్ ప్రశ్నాపత్రం లీక్ అయింది. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం 10.10 గంటలకు లీక్ అయింది. ఈ విషయానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తాడిహత్నూర్ పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, వారికి 6 గదులను కేటాయించి పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇక ఈ కేంద్రంలో ఇప్పటికే మాస్ కాపీయింగ్ జరుగుతుందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఏకంగా ఈ కేంద్రంలోని ఒకటో నెంబర్ రూం నుంచి ఇన్విజిలేటర్ సహకారంతో పరీక్ష పత్రాన్ని సెల్ ఫోన్లో చిత్రీకరించి వాట్సయాప్‌లో పంపించడం కలకలం రేపింది. ఈ విషయం తెలుసుకున్న డిఇఒ, ఆర్‌డిఒ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేసి, ప్రశ్న పత్రం లీక్‌పై ఆరా తీశారు.



వాట్సప్‌లో చక్కర్లు కొట్టిన ప్రశ్నాపత్రం ఫోటోలివే..

దర్శకులకే సూచలిస్తున్న రాధికా ఆప్టే

హిందీ, మరాఠీ, బెంగాలీ చిత్రాలతో పాటు సౌత్ సినిమాల్లోనూ నటించి హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న భామ రాధికా ఆప్టే. అయితే ఆమె ఈమధ్య సౌత్ ఇండస్ట్రీపై కొన్ని విమర్శలు చేసి వార్తల్లోకెక్కింది. దక్షిణాది హీరోల గురించి వివాదస్పద వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు బాలీవుడ్ దర్శకులకు కండీషన్లు పెడుతోందట. మొదట్లో హోమ్లీగా నటించిన రాధిక అవకాశాలు లేకపోవడంతో గ్లామర్ పాత్రలపై దృష్టి పెట్టింది. శృతిమించిన గ్లామర్‌ను ఒలికించేందుకు కూడా వెనుకాడలేదు. వరుసగా అవే పాత్రల్లో నటిస్తూ కెరీర్‌ను నెట్టుకొచ్చింది. ఇటీవల కొన్ని హిట్ సినిమాల్లో నటించడంతో ఈ భామకు మంచి క్రేజ్ వచ్చింది. దీంతో కొత్త ఆఫర్లతో వస్తున్న దర్శకులకు కండీషన్లు పెడుతోందట. గ్లామరస్ హీరోయిన్ కదా అని గ్లామర్ రోల్స్‌తో ఆమె దగ్గరకు వస్తున్న దర్శకులకు నో అని చెప్పేస్తోందట. ఇకపై గ్లామర్ పాత్రల్లో నటించనని, నటనకు ప్రాధాన్యమున్న పాత్రల్లోనైతే చేస్తానని చెబుతోందట. తన రోల్ అలా ఉండాలి, ఇలా ఉండాలి అని సూచనలు చేస్తోందట. దీంతో డైరెక్టర్లు రాధిక అప్పుడే స్టార్ హీరోయిన్ అయిపోయిందా అని వాపోతున్నారట.



పంచెకట్టుతో మురిపించిన మహేశ్



మహేశ్‌బాబు

మహేశ్‌బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో శ్రీమతి డి.పార్వతి సమర్పణలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. కాగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ చిత్రంలో మహేశ్ ట్రెడీషనల్ లుక్‌తో ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు. పంచెకట్టుతో మహేశ్ కనిపించి అభిమానులను అలరించాడు. ఇప్పటికే ఈ సినిమా టీజర్ రికార్డు వ్యూస్ సాధించింది. ఈ సందర్భంగా నిర్మాత డి.వి.వి.దానయ్య మాట్లాడుతూ ''మన తెలుగు సంవత్సరాది పండుగ కళ ఉట్టిపడే పంచెకట్టుతో ఉన్న మహేశ్ పోస్టర్‌ను విడుదల చేశాం. ప్రేక్షకులు, అభిమానులను మహేశ్ కొత్త లుక్ కనువిందు చేస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి ఓ పాటను రాజు సుందరం నేతృత్వంలో చిత్రీకరిస్తున్నాం. భారీ దేవాలయం సెట్‌లో 100 మంది డ్యాన్సర్లు, 1000 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో చాలా పెద్ద ఎత్తున ఈ పాటను తెరకెక్కిస్తున్నాం. ఈనెల 25 నుంచి స్పెయిన్‌లో కొత్త షెడ్యూల్ ఉంటుంది. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా 'భరత్ అనే నేను' చిత్రాన్ని విడుదల చేస్తాం''అని చెప్పారు. మహేశ్, కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్‌లతో పాటు ప్రముఖ తారాగణం నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతంః దేవిశ్రీ ప్రసాద్, పాటలుః రామజోగయ్యశాస్త్రి, సినిమాటోగ్రఫీః రవి కె.చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు, ఎడిటింగ్ః శ్రీకర్‌ప్రసాద్.



'రంగస్థలం' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో చిరంజీవి, రామ్‌చరణ్, సమంత, సుకుమార్, దేవిశ్రీ ప్రసాద్, ఆది పినిశెట్టి, చంద్రబోస్, నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, సివిఎం తదితరులు

నాకు 'ఖైదీ' ఎలాగో... రామ్‌చరణ్‌కు 'రంగస్థలం' అలాగే : చిరంజీవి

రామ్‌చరణ్, సమంత హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'రంగస్థలం'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, సివిఎం (మోహన్) ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ వైజాగ్ ఆర్‌కె బీచ్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి, సురేఖ, రామ్‌చరణ్, ఉపాసన, సమంత, పూజా హెగ్డే, ఆది పినిశెట్టి, సుకుమార్, నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, సివిఎం, రామ్‌లక్ష్మణ్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ '' దేవిప్రసాద్, త్రివిక్రమ్ రావు, అశ్వనీదత్, అల్లు అరవింద్ వంటి స్టార్ నిర్మాతల స్థాయిలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు పేరుతెచ్చుకుంటున్నారు. దర్శకుడు సుకుమార్ అద్భుతమైన పనితనాన్ని చూపించాడు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన సినిమా ఇది. నాకు 'ఖైదీ' సినిమా ఎలాగో... రామ్‌చరణ్‌కి అలాగే స్టార్ స్టేటస్‌ను పెంచే సినిమా అవుతుంది. అతను మంచి నటుడిగా ఎదిగే సినిమా ఇదవుతుంది. చరణ్‌తో సుకుమార్ ఇంత మంచి సినిమా చేసినందుకు నటునిగా ఈర్ష్య పడుతున్నాను... ఓ తండ్రిగా గర్వపడుతున్నాను. సుకుమార్ గ్రామంలో పుట్టి పెరగడం వల్ల ఎమోషన్స్ మిస్ కాకుండా సినిమాను చక్కగా తీశాడు. హీరో క్యారెక్టర్‌ను డీ గ్లామరైజ్ చేయించి చరణ్ కెరీర్‌లో ఓ తలమానికమైన సినిమాను చేసిన సుకుమార్‌కు నా అభినందనలు. దేవిశ్రీ ప్రసాద్ చాలా అద్భుతమైన బాణీలను అందించాడు. చంద్రబోస్ అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. రామకృష్ణ, మోనిక అద్భుతమైన సెట్ వేశారు. ఆ సెట్ రియల్ లొకేషన్‌లా అనిపించింది. నేను గర్వపడేలా చరణ్ ఈ సినిమాలో నటించాడు. సమంత తన పాత్రలో ఒదిగిపోయింది. జగపతిబాబు, ప్రకాశ్‌రాజ్, అనసూయ సహా అన్ని పాత్రలు మెప్పిస్తాయి. ఈ సినిమా ప్రజలను ఆకట్టుకోవడమే కాదు... అన్ని విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుంటుంది. జాతీయ స్థాయిలో ఈ సినిమాకు అవార్డులు వస్తాయి. అవార్డులు రాకుంటే అన్యాయం జరిగినట్టే''అని అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ '' నాన్నగారు నాలుగైదు సార్లు నెల్లూరుకి తీసుకెళ్లారు. 'ఆపద్బాంధవుడు' సినిమా సమయంలో పూడిపల్లి గ్రామానికి తీసుకెళ్లారు. ఆతర్వాత నేను పల్లెటూరుకి వెళ్లలేదు. ఈ సినిమాతో సుకుమార్ నా కోరికను తీర్చాడు. సమంతతో నటించేటప్పుడు ఓ ఎనర్జీ వస్తుంది. దేవిశ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతాన్ని అందించాడు. ఇంత మంచి సినిమా చేయడానికి కారణమైన సుకుమార్‌కి హ్యాట్సాఫ్. నాకే ఓ కొత్త చరణ్‌ని పరిచయం చేశాడు. సుకుమార్ వల్ల నాపై నాకే గౌరవం పెరిగింది''అని తెలిపారు. సుకుమార్ మాట్లాడుతూ ''ఈ సినిమా చూసిన తర్వాత చిరంజీవి ఎంతో ప్రశంసించారు. దేవిశ్రీప్రసాద్ గొప్ప సంగీతాన్ని అందించాడు. చంద్రబోస్ పాటలు రాయలేదు... అలా చెప్పుకుంటూ పోయారు. సమంతతో జీవితాంతం సినిమాలు చేయాలని ఉంది. ఆర్ట్ డైరెక్టర్ రామకృష్ణ వేసిన సెట్ మనకు కనపడదు. ఎందుకంటే సెట్ అంత బాగా వేశాడు. ఆది పినిశెట్టి, జగపతిబాబు, ప్రకాశ్‌రాజ్ ఎంతో బాగా నటించారు. రామ్‌చరణ్ చిట్టిబాబు క్యారెక్టర్‌లో ఒదిగిపోవడానికి ఎక్కువ సమయం తీసుకోలేదు. చరణ్ పర్‌ఫార్మెన్స్ చూసి మేమే కాదు ప్రకాశ్‌రాజ్ వంటి నటుడు కూడా క్లాప్స్ కొట్టాడంటే తను ఎలా ఒదిగిపోయాడో అర్థం చేసుకోవచ్చు''అని చెప్పారు. సమంత మాట్లాడుతూ ''దర్శకుడు సుకుమార్ ఎంతో ప్రేమతో రాసుకున్న నా క్యారెక్టర్‌కు న్యాయం చేయాలని ఛాలెంజ్‌గా తీసుకొని నటించాను. చరణ్ పోషించిన చిట్టిబాబు పాత్ర చాలా కాలం పాటు గుర్తుండిపోతుంది. ఈనెల 30న విడుదలయ్యే సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను''అని అన్నారు. నవీన్ ఎర్నేని మాట్లాడుతూ ''ఈ సినిమాలో రామ్‌చరణ్ నట విశ్వరూపం చూస్తారు. సమంత చాలా చక్కగా నటించారు''అని పేర్కొన్నారు.

నారా రోహిత్‌తో శబ్దం ప్రారంభం



'శబ్దం' ప్రారంభ వేడుకలో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, నారా రోహిత్, కొమ్మలపాటి శ్రీధర్, పి.బి.మంజునాథ్, నారాయణరావు అట్లూరి తదితరులు

యువ కథానాయకుడు నారా రోహిత్ ప్రధాన పాత్రలో పి.బి.మంజునాథ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'శబ్దం'. శ్రీవైష్ణవి క్రియేషన్స్ పతాకంపై నారాయణరావు అట్లూరి నిర్మాణ సారధ్యంలో రూపొందనున్నఈ చిత్రం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఘనంగా ప్రారంభమైంది. 'హిజ్ సైలెన్స్ ఈజ్ హిజ్ వెపన్' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రారంభోత్సవ వేడుకలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. నారా రోహిత్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఆంధ్రప్రదేశ్ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు క్లాప్ కొట్టగా... పెదకూరపాడు ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు పి.బి.మంజునాథ్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ప్రత్తిపాటి పుల్లారావు, కొమ్మలపాటి శ్రీధర్‌లు కలిసి పి.బి.మంజునాథ్‌కు స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా హీరో నారా రోహిత్ మాట్లాడుతూ ''అమరావతిలో నా చిత్ర ప్రారంభోత్సవం జరుగడం చాలా ఆనందంగా ఉంది. అందరినీ ఎంటర్‌టైన్ చేయడం కోసం మా టీం అందరం బాగా కష్టపడతాం. ఈ ప్రాంతంలోనే ఈ సినిమా ఆడియో విడుదల వేడుకను కూడా నిర్వహిస్తాం''అని చెప్పారు. నిర్మాత నారాయణరావు అట్లూరి మాట్లాడుతూ ''నారా రోహిత్‌తో 'శబ్దం' చిత్రాన్ని నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. సినిమా తప్పకుండా అందరినీ అలరించే విధంగా ఉంటుంది''అని అన్నారు. దర్శకుడు పి.బి.మంజునాథ్ మాట్లాడుతూ ''వైష్ణవీ క్రియేషన్స్‌లో వస్తున్న మొదటి చిత్రమిది. కథను నమ్మి సినిమా చేయడానికి అంగీకరించిన నారా రోహిత్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఏప్రిల్ చివరి వారం నుంచి వైజాగ్, కాకినాడ, హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది''అని తెలిపారు. ఈ చిత్రానికి కథ, మాటలుః వంశీ రాజేష్, సంగీతంః వికాస్ కురిమెళ్ల, ఎడిటర్ః నవీన్ నూలి.



నితిన్, మేఘా ఆకాష్

పాటల పల్లకిలో 'ఛల్ మోహన్ రంగ'

నితిన్, మేఘా ఆకాష్ హీరోహీరోయిన్లుగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. శ్రీమతి నిఖితా రెడ్డి సమర్పణలో పవన్‌కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మూవీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఉగాది పండుగ సందర్భంగా ఈ చిత్రం మ్యూజిక్ ఆల్బమ్‌ను విడుదల చేశారు. ఇంతకుముందు విడుదలైన మూడు పాటలలాగానే ఆల్బమ్‌లోని మూడు కొత్త పాటలు కూడా ప్రేక్షకులను అలరిస్తున్నాయి. తమన్ అందించిన మధురమైన సంగీతంతో ఈ పాటలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రేమ నుంచి విరహం వరకు... సంతోషం నుంచి బాధ వరకు అన్నింటినీ ఎంతో బాగా స్వరపరిచి తమన్ మాస్, క్లాస్‌ను ఆకట్టుకునే విధంగా మంచి ఆల్బమ్‌ను అందించారు. యుఎస్, ఊటీ, హైదరాబాద్‌లోని అందమైన ప్రదేశాల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్టు చిత్ర నిర్మాత ఎస్.సుధాకర్ రెడ్డి ప్రకటించారు. డా.కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి తదితరులు ఈ చిత్రంలో ప్రధాన తారాగణం. ఈ చిత్రానికి కెమెరాః ఎన్.నటరాజ సుబ్రమణియన్, ఎడిటింగ్ః ఎస్.ఆర్.శేఖర్, డ్యాన్స్ః శేఖర్ వి.జె, ఫైట్స్ః స్టంట్ సిల్వ, రవివర్మ.

ఐరా క్రియేషన్స్ '@నర్తనశాల' షురూ



'@నర్తనశాల' సినిమా ప్రారంభోత్సవంలో నాగశౌర్య, శంకర్ ప్రసాద్, ఉషా ముల్పూరి, శ్రీనివాస్ చక్రవర్తి, గౌతమ్ తదితరులు

'ఛలో' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టిన యంగ్ హీరో నాగశౌర్య ఐరా క్రియేషన్స్ బ్యానర్‌లో నటించే రెండో చిత్రం '@నర్తనశాల' ప్రారంభమైంది. ఉగాది పర్వదినాన హైదరాబాద్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. వంశీ పైడిపల్లి, నందిని రెడ్డి, శ్రీనివాస్ అవసరాల, అజయ్ ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. వంశీ పైడిపల్లి హీరో నాగశౌర్యపై క్లాప్‌కొట్టారు. శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్న ఈ చిత్రంతో కృష్ణవంశీ దగ్గర సహాయ దర్శకుడిగా పనిచేసిన శ్రీనివాస్ చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ చిత్రంలో నరేష్, జయప్రకాష్ రెడ్డి, అజయ్, పోసాని కృష్ణమురళి, సత్యం రాజేష్, వెన్నెల కిషోర్, గుండు సుదర్శన్, జెమిని సురేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన విలేకరుల సమావేశంలో హీరో నాగశౌర్య మాట్లాడుతూ ''ఈ చిత్రంతో శ్రీనివాస్ చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా తర్వాత ఆయన ఖచ్చితంగా పెద్ద దర్శకుడు అవుతారు. ఇక ఈ చిత్రం డ్యాన్స్ బేస్డ్ చిత్రమనీ... పాత నర్తనశాల చిత్రానికి రీమేక్ అని చాలా మంది అనుకుంటున్నారు. కానే కాదు... ఇది ఫుల్ ఎంటర్‌టైనర్. కడుపుబ్బా నవ్వుకునే చిత్రమిది. హీరోయిన్‌లు ఇంకా ఫైనల్ కాలేదు. 'చూసి చూడంగానే...' పాటతో 'ఛలో' చిత్రానికి సూపర్బ్ సాంగ్ ఇచ్చిన మహతి మరోసారి అంతకంటే అద్భుతమైన పాటలను ఈ సినిమాకు అందిస్తున్నారు''అని అన్నారు. దర్శకుడు శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడుతూ ''దర్శకుడిగా అవకాశమిచ్చిన నాగశౌర్య, నిర్మాతలు శంకర్‌ప్రసాద్, ఉషలకు చాలా థాంక్స్ చెప్పుకుంటున్నాను. ఎందుకంటే ఈ తరహా మంచి కథతో సినిమా చేయడానికి వాళ్లు ఒప్పుకున్నారు. దర్శకుడిగా నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. 'ఛలో'ను మించేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తానని మాటిస్తున్నాను''అని తెలిపారు. ఈ సమావేశంలో ఎడిటర్ చంటి, కెమెరామెన్ సి.కుమార్, ఐరా క్రియేషన్స్ డిజిటల్ హెడ్ ఎం.ఎన్.ఎస్.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ః కిరణ్‌కుమార్, ఫైట్స్ః వెంకట్, స్క్రిప్ట్ కో ఆర్డినేటర్ః కాశీ నడింపల్లి, లైన్ ప్రొడ్యూసర్ః బుజ్జి.



జె.డి.చక్రవర్తి, అక్షిత, అమ్మ రాజశేఖర్, నక్షత్ర రాజశేఖర్ తదితరులు

నవ రసాలతో ఉగ్రం

నక్షత్ర మీడియా పతాకంపై ఖాసిం సమర్పణలో జె.డి.చక్రవర్తి, అక్షిత హీరో హీరోయిన్లుగా అమ్మ రాజశేఖర్ దర్శకత్వంలో 'నక్షత్ర' రాజశేఖర్ నిర్మించిన యాక్షన్‌కామెడీ థ్రిల్లర్ 'ఉగ్రం'. ఈ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకొని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఉగాది పర్వదినాన 'ఉగ్రం' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జె.డి.చక్రవర్తితో పాటు చిత్ర యూనిట్ సభ్యులు సంప్రదాయ పంచెకట్టుతో వచ్చి సందడి చేశారు. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి ఈ చిత్రాన్ని వేసవి కానుకగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా జె.డి.చక్రవర్తి మాట్లాడుతూ ''ఈ సినిమా నాకు మంచి పేరు తెస్తుంది. హీరోయిన్ చాలా బాగా చేసింది''అని అన్నారు. దర్శకుడు అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ ''ఉగాది అంటే షడ్రుచుల సమ్మేళనం. అలాగే మా సినిమాలో కూడా నవ రసాలుంటాయి''అని చెప్పారు.

పాత్ర నచ్చితేనే చేస్తా

వైవిధ్యమైన కథలను ఎంపికచేసుకుంటూ ముందుకెళ్తున్న యంగ్ హీరో శ్రీవిష్ణు. కాన్సెప్ట్ బేస్ట్ కథల్లో తనదైన నటనతో ఆయన ఆకట్టుకుంటున్నారు. శ్రీవిష్ణు నటించిన తాజా చిత్రం 'నీది నాదీ ఒకే కథ' ఈనెల 23న విడుదలకానుంది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు చెప్పిన సినిమా విశేషాలు...



అందుకే ఆలస్యమైంది...

'నీది నాదీ ఒకే కథ' సినిమా మొదలుపెట్టి కొంత షూటింగ్ పూర్తయ్యాక మధ్యలో 'మెంటల్ మదిలో' చేశాను. ఆతర్వాత డి.సురేష్‌బాబు 'మెంటల్ మదిలో' చిత్రాన్ని తీసుకొని విడుదల చేశారు. అందుకే 'నీది నాదీ ఒకే కథ' సినిమా ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

కొత్తదనంతో కూడిన...

డొగ్మో టెక్నిక్‌తో విడుదలవుతున్న మొదటి సినిమా ఇది. మలయాళంలో ఈ టెక్నిక్‌తో ఓ సినిమా చేసినా అది విడుదల కాలేదు. రెగ్యులర్ ఫిల్మ్‌లా ఈ చిత్రం ఉండదు. సినిమా చూసినప్పుడు ప్రేక్షకులు ఇది గుర్తిస్తారు. కొత్తదనంతో కూడిన ఈ చిత్రం అందరినీ అలరిస్తుంది.

ఓ నటుడిలా కలిసిపోయారు...

యూత్‌ను ఎంతగానో ఆకట్టుకునే చిత్రమిది. సినిమా ప్రారంభంకాగానే హీరో రోల్‌తో యువతీయువకులు కనెక్ట్ అయిపోతారు. దేవిశ్రీ ప్రసాద్ ఇందులో తండ్రి పాత్ర పోషించారు. సెట్‌లో ఆయన మాలో ఓ నటుడిలా కలిసిపోయారు. తన పాత్రను చూసి ఆయన థ్రిల్ అయిపోయారు.

అప్పుడే సినిమా చేస్తా...

ఓ ప్రేక్షకుడిగా నేను కథ వింటాను. ఆ కథలో నా పాత్ర నచ్చాలి. ఈ పాత్రలో నటించగలుగుతానని అనిపించినప్పుడే సినిమా చేస్తాను. ప్రతి సినిమాలో నా పాత్ర విభిన్నంగా ఉండాలని కోరుకుంటాను. కొత్తదనం కోసం ఎప్పుడూ ప్రయత్నిస్తాను.

తదుపరి చిత్రాలు...

ప్రస్తుతం 'వీరభోగవసంతరాయలు', 'అసుర' దర్శకుడితో 'తిప్పరా మీసం' సినిమాలు చేస్తున్నాను. ఓ పోలీస్ స్టోరీ మూవీని కూడా అంగీకరించాను.



అల్లరి నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, జె.బి.మురళీకృష్ణ, రవి, జో జో జోస్, శ్రీనివాస్ రెడ్డి.ఎన్ తదితరులు

'జంబలకిడి పంబ' లోగో విడుదల

శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధి ఇద్నాని హీరోహీరోయిన్లుగా శివం సెల్యులాయిడ్స్, మెయిన్ లైన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లపై జె.బి.మురళీకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'జంబలకిడి పంబ'. ఈ చిత్రాన్ని రవి, జో జో జోస్, శ్రీనివాస్ రెడ్డి.ఎన్ కలిసి నిర్మిస్తున్నారు. ఈ సినిమా లోగోను అల్లరి నరేష్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రవి, జె.బి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ ''శ్రీనివాస్ రెడ్డి హీరోగా చేస్తున్న ఈ సినిమా పెద్ద హిట్ కావాలి. గోపిసుందర్ మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుంది'' అని తెలిపారు. దర్శకుడు జె.బి.మురళీ మాట్లాడుతూ ''కథకు సరిపోతుందని 'జంబలకిడి పంబ' టైటిల్ పెట్టాం. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరుగుతోంది''అని అన్నారు.



తొలి రోజు నెమ్మదిగా ఆరంభించిన సంధార్ ఐపిఒ

న్యూఢిల్లీ: ఢిల్లీకి చెందిన వాహన విడిభాగాల సరఫరాదారు సంధార్ టెక్నాలజీస్ ఐపిఒ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్)కు తొలి రోజు మందకొడిగా స్పందన వచ్చింది. రూ.512 కోట్లు సమీకరణ లక్ష్యంగా వచ్చిన ఈ సంస్థ ఐపిఒను సోమవారం ప్రారంభించింది. 1.08 కోట్ల షేర్లకు గాను తొలి రోజు రూ.5.33 లక్షల షేర్ల బిడ్‌ను అందుకుంది. ధరల శ్రేణిని ఒక్కో షేరుకు రూ.327– 332గా కంపెనీ నిర్ణయించింది. ఇష్యూ కోసం కనీసం 45 షేర్ల(ఒక లాట్)కు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఐపిఒకు లీడ్ మేనేజర్లుగా ఐసిఐసిఐ సెక్యూరిటీస్ లిమిటెడ్, యాక్సిస్ క్యాపిటల్ లిమిటెడ్‌లు వ్యవహరిస్తున్నాయి. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను రుణాల చెల్లింపునకు, ఇతర సాధారణ కార్యాకలాపాలకు వినియోగించనున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ.300 కోట్ల విలువైన తాజా షేర్లతో పాటు, వాటాదారైన జిటిఐ కేపిటల్ బీటాకు చెందిన 64 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్) విధానంలో కంపెనీ విక్రయిస్తోంది. ఢిల్లీ కేంద్రంగా 1987లో ఈ కంపెనీ ప్రారంభమైంది. లాకింగ్ సిస్టమ్, విజన్ సిస్టమ్స్, డోర్ హ్యాండిల్స్ పలు పరికరాలను తయారు చేస్తోంది. గత ఐదేళ్ళుగా సంధార్ టెక్నాలజీస్ మెరుగైన, స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది.

ఓపికతో ఉంటే మంచి లాభాలు

ఈక్విటీ మార్కెట్లపై ఆర్థిక నిపుణులు




న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్లు ప్రస్తుతం బేరిష్ ట్రెండ్‌లో ఉన్నాయని.. ఇది స్వల్పకాలమే ఉంటుందని.. పెట్టుబడులు పెట్టి కొంత ఓపిక వహిస్తే భవిష్యత్ మంచి లాభాలు ఇస్తాయని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లు పతనావస్థలో ఉన్నా దీర్ఘకాలికంగా మాత్రం లాభాలను అందిస్తాయని యుటిఐ ఎంఎఫ్ ఫండ్ మేనేజర్ లలిత్ నంబియార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. నాణ్యమైన ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టి.. ఐదు, ఆరేళ్లు ఆగితే రెట్టింపు రాబడి వస్తుందని అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో దిద్దుబాటు కొనసాగుతోందని, అంతర్జాతీయంగా మార్కెట్ల ప్రభావం దేశీయ సూచీలపై ఉందని అన్నారు. అమెరికా ఫెడ్ కొత్త చీఫ్ వ్యాఖ్యలు, చమురు, కమోడిటీల ధరలు పెరుగుతాయన్న అంచనాలు మార్కెట్లను దెబ్బతీశాయని చెప్పారు. ఐదు నుంచి ఏడేళ్ల వ్యవధిలో ఈక్విటీలు వార్షికంగా 10 నుంచి 12 శాతం రాబడినిస్తాయని అంచనా వేశారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి భారత్ చాలాబాగా తప్పించుకోగలిగిందని అన్నారు. ప్రాజెక్టులపై అధిక అంచనాలు, కంపెనీల రుణాల ఎగవేతలు కారణంగా స్టీల్, కోల్ తదితర రంగాల షేర్లు భారీగా దెబ్బతిన్నాయన్నారు. ఎన్‌సిఎల్‌టితో ఎగవేతదారులపై చర్యలు ఉంటాయని అన్నారు. త్వరలో దిద్దుబాటు పరిస్థితులు సమసిపోయి మార్కెట్లు దూసుకుపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	32923.12	–252.88	–0.76%
నిఫ్టీ	10094.25	–100.90	–0.99%

CLOSING SENSEX REPORT



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	28860	30866.31	0.31%
ముంబై	29790	31860.96	0%
ఢిల్లీ	29550	31604.28	0%
కోల్‌కతా	29830	31903.74	0%
కేరళ	28050	30000.00	0%
బెంగళూరు	28400	30374.33	0%
హైదరాబాద్	28860	30866.31	0.31%
గల్ఫ్	1393.62	1490.50	0.63%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	41100.00	41300.00	–0.48
ముంబై	41100.00	41300.00	–0.48
ఢిల్లీ	41100.00	41300.00	–0.48
కోల్‌కతా	41100.00	41300.00	–0.48
హైదరాబాద్	41100.00	41300.00	–0.48

కోడిగుడ్లు (100కు) నెక్ రేటు



హైదరాబాద్	330	విశాఖపట్నం	325
వరంగల్	332	చిత్తూరు	363
విజయవాడ	317	చెన్నై	370
గోదావరి	317	బెంగళూరు	365

క్యాడ్ గుబులు

- 2017–18లో 1.7 శాతానికి చేరనుంది
- బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లింఛ్ నివేదిక





న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017–18)లో జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)లో దేశీయ కరెంట్ ఖాతా లోటు(క్యాడ్) 1.7 శాతానికి చేరనుందని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లింఛ్(బిఒఎ ఎంఎల్) అంచనా వేస్తోంది. డిసెంబర్ త్రైమాసికంలో కరెంట్ ఖాతా లోటు 2 శాతంతో పెరిగిందని ఇటీవల ఆర్‌బిఐ నివేదిక వెల్లడించిన నేపథ్యంలో ఈ అంచనాలు ఆందోళన కల్గిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017–18), వచ్చే సంవత్సరానికి(2018–19) క్యాడ్ పెరగవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా వేసింది. అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం ప్రకారం.. 2017–18లో జిడిపిలో కరెంట్ ఖాతా లోటు 10 బేసిస్ పాయింట్లు పెరిగి 1.7 శాతం నమోదవనుందని, అలాగే 2018–19కు ఇది 20 బేసిస్ పాయింట్లు పెరిగి 1.9 శాతానికి చేరనుందని బిఒఎ ఎంఎల్ పేర్కొంది. శుక్రవారం ఆర్‌బిఐ ప్రకటించిన అంచనా ప్రకారం, డిసెంబర్ ముగింపు త్రైమాసికంలో జిడిపిలో కరెంట్ ఖాతా లోటు 13.5 బిలియన్ డాలర్లతో 2 శాతానికి పెరిగింది. ఏడాది క్రితం ఇది 8 బిలియన్ డాలర్లతో 1.4 శాతం మాత్రమే ఉంది. అత్యధిక వాణిజ్య లోటు కారణంగా ఈసారి ప్రభావం ఏర్పడిందని ప్రభుత్వం వెల్లడించింది. అత్యధికంగా చమురు దిగుమతులు కారణంగా ఈ ఏడాది ప్రారంభం నుంచి దేశీయ అక్టోబర్–డిసెంబర్ కరెంట్ ఖాతా లోటు పెరిగిందని ఆర్‌బిఐ తెలిపింది. దిగుమతులు మరింతగా పెరడంతో అత్యధిక వాణిజ్య లోటు వచ్చిందని ఆర్‌బిఐ పేర్కొంది. భారత్ వాణిజ్య లోటు కూడా 44.1 బిలియన్ డాలర్లకు పెరగ్గా.. ఏడాది క్రితం ఇది 33.3 బిలియన్ డాలర్లుగా ఉంది. అదే సమయంలో అక్టోబర్–డిసెంబర్ కాలంలో పేమెంట్ల బ్యాలెన్స్ మిగులు 9.4 బిలియన్ డాలర్లుగా ఉండగా.. సంవత్సరం క్రితం ఇది 1.2 బిలియన్ డాలర్లుగా ఉంది. డిసెంబర్ ముగింపునాటి త్రైమాసికంలో మూలధనం, ఆర్థిక ఖాతా మిగులు 12.6 బిలియన్ డాలర్లకు పెరగ్గా.. క్రితం ఏడాది ఇదే సమయంలో 7.3 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్రభుత్వరంగ బ్యాంకుల ఎన్‌పిఎలు పెరుగుతున్న నేపథ్యంలో కరెంట్ ఖాతా లోటు ప్రభుత్వానికి మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

బినాని సిమెంట్‌లో 98 శాతం వాటా సేల్

- రూ.7,266 కోట్లకు కొనుగోలు చేసేందుకు అల్ట్రాటెక్ సిమెంట్ సిద్ధం
- ఎన్‌సిఎల్‌టి నిర్ణయం కోసం ఎదురుచూపు



న్యూఢిల్లీ: బినానీ ఇండస్ట్రీస్‌లో ప్రమోటర్ల నుంచి 98 శాతం వాటాను కొనుగోలు విషయమై ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిద్ధంగా ఉంది. అయితే ఎన్‌సిఎల్‌టి(నేషనల్ కార్పొరేట్ లా ట్రిబ్యునల్) నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించాల్సి ఉంది. బినాని సిమెంట్ రుణదాతలకు దాదాపు రూ.7,266 కోట్లు చెల్లిస్తానని అల్ట్రాటెక్ చెప్పింది. దివాలా ప్రక్రియం సమయంలో అల్ట్రాటెక్ సంస్థ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌కు ఈ నిధులను చెల్లిస్తామని ఆఫర్ చేసినప్పటికీ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ ఈ బిడ్‌ను వ్యతిరేకించారు. అత్యధిక బిడ్డర్ దాల్మియా సిమెంట్, ఇతర రుణదాతలు సిఫారసులను అంగీకరించారు. అయితే దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై తుది నిర్ణయం కోల్‌కతా ఎన్‌సిఎల్‌టి వద్ద వాయిదా పడింది. బిడ్డింగ్ ప్రక్రియపై ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు ట్రిబ్యునల్ ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలని.. మార్చి 13న ఎన్‌సిఎల్‌టి బినాని సిమెంట్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ విజయ్‌కుమార్ అయ్యర్‌కు ఆదేశాలు జారీ చేసింది. బినాని సిమెంట్ వేలాన్ని తిరస్కరించినందుకు రిసొల్యూషన్ ప్రొఫెషనల్, డెలాయిట్‌పై ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ పిటిషన్ దాఖలు చేసింది. బిడ్డింగ్ ప్రక్రియలో రిసొల్యూషన్ ప్రొఫెషనల్ పారదర్శక విధానాన్ని అనుసరించడం లేదని, బిడ్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించడం లేదని, అనుమతించడం లేదని ఈ పిటిషన్‌లో అల్ట్రాటెక్ ఆరోపించింది. గత వారం.. అల్ట్రాటెక్ బిడ్‌ను రూ.700 కోట్లు పెంచి మొత్తం రూ.6,900 కోట్లు చేసినప్పటికీ.. రిసొల్యూషన్ ప్రొఫెషనల్(ఆర్‌పి) నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఆర్‌పి పారదర్శకంగా వ్యవహరించడం లేదని, బిడ్డింగ్ పారదర్శక విధానంలో జరగడం లేదనే ఆరోపణలపై.. వ్యక్తిగతంగా హాజరు కావాలని ట్రిబ్యునల్ ఆదేశించిందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే ఆసక్తికరంగా బినానీ ఇండస్ట్రీస్ కూడా ఆర్‌పికి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేసి.. వ్యక్తిగత ప్రయోజనాల కోసం బినానీ సిమెంట్ విలువను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని ట్రిబ్యునల్‌కు వివరించింది. బినానీ ఇండస్ట్రీస్ ప్రకారం, బినానీ సిమెంట్ విలువ రూ.17,300 కోట్లుగా ఉంది.

ఆఖరి రోజు బంధన్ బ్యాంక్ ఐపిఒకు

14 రెట్లు స్పందన



న్యూఢిల్లీ: ప్రైవేటురంగ బంధన్ బ్యాంక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఆఖరి రోజు బ్యాంక్ ఐపిఒకు 14 రెట్లు డిమాండ్ వచ్చింది. రూ.31 బిలియన్ల విలువచేసే షేర్లకు గాను రూ.245 బిలియన్ల స్పందన వచ్చింది. 8.35 కోట్ల షేర్లకు గాను 121.81 కోట్ల ఈక్విటీ షేర్లకు బిడ్ వచ్చిందని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వెల్లడించింది. కోల్‌కతాకు చెందిన బంధన్ బ్యాంక్ రూ.4,473 కోట్ల ఐపిఒ(ఇనిషియల్ పబ్లి క్ ఆఫర్) మార్చి 15 ప్రారంభమైంది. ఈ ఐపిఒ 19వ తేదీన ముగిసింది. ఈ ఐపిఒకు ధరల శ్రేణిని రూ.370–375గా నిర్ణయించారు. ఐపిఒ విలువ రూ.4,473 కోట్లు.. ఇటీవల ఐపిఒలకు వచ్చిన స్థానిక బ్యాంకుల్లో బంధన్ బ్యాంక్‌దే అత్యధికం కావడం విశేషం. కోటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ క్యాపిటల్, గోల్డ్‌న్ సాచస్, జేఎం ఫైనాన్షియల్స్, జేపీ మోర్గాన్‌లు ఐపిఒ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. 2015లో వ్యాపారాన్ని ప్రారంభించిన బంధన్ బ్యాంక్.. చిన్నమొత్తాలను రైతులకు రుణాలుగా అందజేస్తుంది. తొలి రోజు ఈ ఐపిఒ మొత్తం 8,34,96,347 షేర్లకు గాను 3,50,05,200 షేర్ల బిడ్‌ను అందుకుందని ఎన్ఎస్ఇ వెల్లడించింది.

పిఎస్‌బిలపై పూర్తి నియంత్రణ

ఒత్తిడి తీసుకొస్తున్న ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో నీరవ్ మోడీ రూ.13 వేల కోట్ల కుంభకోణం నేపథ్యంలో ఆర్‌బిఐ మరింత అప్రమత్తమైంది. అక్రమ పద్ధతిలో ఎల్‌ఒయు(లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్) ద్వారా భారీ మొత్తంలో రుణాలను పొంది.. పిఎన్‌బిని వేల కోట్లలో మోసం చేసిన నీరవ్ ఉదంతంతో ఆర్‌బిఐ కఠిన చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) పెరగడంతో ఆందోళన వ్యక్తమవుతుండడంతో ఆర్‌బిఐ పిఎస్‌యు బ్యాంకులపై పూర్తిస్థాయిలో పట్టుబిగించేందుకు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వరంగ బ్యాంకుల(పిఎస్‌బి)కు ఎల్‌ఒయులను రద్దు చేసింది. ఇటీవల పిఎన్‌బి మోసంపై మౌనం వీడిన ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ తన డిమాండ్లను చెప్పారు. ప్రభుత్వబ్యాంకులపై పరిమిత అధికారాలే ఉన్నాయని, ప్రభుత్వానిదే పెత్తనం అని చెప్పకనే చెప్పారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మోసం కేసులో రెగ్యులేటరీ, యాజమాన్యాల వైఫల్యం ఉందని అంతకుముందు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చేసిన వ్యాఖ్యలపై ఈవిధంగా స్పందించారు. ఆర్‌బిఐకి పరిమితంగానే అధికారాలు ఉన్నాయని, ప్రభుత్వరంగ బ్యాంకులపై పూర్తి పట్టులేదని, ప్రైవేటు బ్యాంకులపైనే తమ పెత్తనమని ఉర్జిత్ అన్నారు. పిఎన్‌బిలో రూ.13 వేల కోట్ల కుంభకోణంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్ముకు రిజర్వ్ బ్యాంక్ ఉంటుందని, ఈ మోసాల పరంపరకు అడ్డుకట్ట వేస్తామని అన్నారు. దేశీయ బ్యాంకింగ్ రంగంలో చోటుచేసుకుంటున్న మోసాలు, ఆర్థిక అవకతవకలు రిజర్వు బ్యాంక్‌కు కూడా కోపం, బాధ కల్గించాయని ఈనెల 14న గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ వద్ద కార్యక్రమంలో ఉర్జిత్ వ్యాఖ్యానించారు. జరుగుతున్న పరిణామాల గురించి సులభంగా చెప్పాలంటే.. 'కొందరు రుణదాతలతో కుమ్మక్కై వ్యాపార రంగానికి చెందిన కొందరు మోసం చేశారు. మన దేశ భవిష్యత్‌ను లూటీ చేశారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న అధికారాలతో ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని, అయితే ఏ బ్యాంకింగ్ రెగ్యులేటరీ కూడా వీటిని ఆపలేదని వాపోయారు. ప్రస్తుతం ద్వంద్వ నియంత్రణ వ్యవస్థలు ఉన్నాయని అన్నారు. ఒకటి ఆర్థికమంత్రిత్వ శాఖ, రెండు ఆర్‌బిఐ అని.. దీంతో నియంత్రణలో బీటలు వారి, ఈ భారీ కుంభకోణం సంభవించిందని అన్నారు. ఆర్‌బిఐ తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తోందని, అవసరమైతే విషాన్ని మింగుతుందని అన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులపై చాలా పరిమితంగా అధికారాలు ఉన్నాయని రిజర్వు బ్యాంక్ గవర్నర్ ఉర్జిత్ అన్నారు.

33,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్

నిఫ్టీ 101 పాయింట్లు పతనం



ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్లు మరోసారి పతనమయ్యాయి. సోమవారం కీలక బిఎస్ఇ సెన్సెక్స్ 33 వేల పాయింట్ల దిగువకు పడిపోగా, మరోవైపు నిఫ్టీ 10,100 పాయింట్ల దిగువకు చేరింది. గతేడాది డిసెంబర్ తర్వాత ఇంత కనిష్టస్థాయి వద్ద సూచీలు పతనం కావడం ఇదే తొలి సారి.. దేశీయ కరెంట్ ఖాతా లోటు(క్యాడ్) పెరగడం, అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, మార్చి 20, 21న ఫెడరల్ రిజర్వు సమీక్ష వంటి అంశాలు మార్కెట్‌ను కృంగదీశాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో చివరివరకూ అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ఫెడ్ ఈ ఏడాది నాలుగు దఫాలు వడ్డీ రేట్లు పెంచవచ్చునే అంచనాలు ఇప్పటికే వున్నాయి. మార్చి 21నాటి సమీక్షలో ఫెడ్ రేట్ల పెంపుపై ప్రకటన చేయనున్నందున ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించారు. ఓ వైపు పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై దర్యాప్తు జరుగుతుండగా,. మరోవైపు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కొత్త మోసాలు వెలుగు చూస్తున్నాయి. వ్యాపార, వాణిజ్యవేత్తలకు ఎల్‌ఒయులను బ్యాంకులు జారీచేయడాన్ని నిషేధించడం, ఉప ఎన్నికల్లో అధికార ఎన్‌డిఎ పరాజయం పాలవడం వంటి ప్రతికూల అంశాలు గత కొద్దిరోజులుగా మార్కెట్‌ను దెబ్బతీశాయి. సోమవారంనాటి ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, మెటల్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. కాగా అంతర్జాతీయంగా ఇనుప ఖనిజం ధరలు తగ్గడంతో ఎన్‌ఎండిసి, సెయిల్‌లు భారీగా క్షీణించాయి. నిఫ్టీలో భాగస్వామ్య కంపెనీలైన టాటా స్టీల్, హిందాల్కో, వేదాంతలు 1.53 శాతం మేరకు పడిపోయాయి. ఇక పిఎస్‌యు బ్యాంకింగ్ షేర్లు రోజంతా అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. పిఎస్‌యు బ్యాంకింగ్ దిగ్గజం 2 శాతం క్షీణించి రూ. 248 వద్ద ముగిసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లు 6, 4 శాతం చొప్పున తగ్గాయి. ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లయిన యస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్‌లు 23 శాతం మేర క్షీణించాయి. కీలకమైన బ్యాంక్ నిఫ్టీ 1 శాతం తగ్గి 24,245 పాయింట్ల వద్ద ముగిసింది. ప్రధాన షేర్లలో ఎన్‌టిపిసి, పవర్‌గ్రిడ్, మారుతి సుజుకి ఇండియాలు 12 శాతం మధ్య పెరిగాయి. హెచ్‌సిఎల్ టెక్, భారతి ఎయిర్‌టెల్‌లు 4 శాతం పైగా తగ్గుముఖం పట్టాయి.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
ఎన్‌టిపిసి	167.90	163.65	167.00	164.85	2.15	1.30
మారుతి సుజుకి	8,800.00	8,703.55	8,773.50	8,676.55	96.95	1.12
పవర్ గ్రిడ్ కార్ప్	195.10	192.50	194.20	192.25	1.95	1.01
లార్సెన్	1,292.00	1,265.85	1,279.55	1,269.30	10.25	0.81
హెచ్‌యుఎల్	1,318.20	1,303.25	1,309.40	1,299.15	10.25	0.79
లుపిన్	772.60	759.30	766.60	761.85	4.75	0.62
ఎంఅండ్ఎం	749.00	739.00	742.70	740.75	1.95	0.26
గెయిల్	448.00	437.40	442.05	441.00	1.05	0.24
టిసిఎస్	2,848.00	2,820.00	2,831.00	2,825.70	5.30	0.19
అరబిందో ఫార్మా	578.65	568.60	572.90	572.55	0.35	0.06

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
హెచ్‌సిఎల్ టెక్	963.60	921.00	926.50	967.60	41.10	4.25
టాటాస్టీల్	601.90	572.85	574.95	600.20	25.25	4.21
భారతి ఎయిర్‌టెల్	421.60	396.70	399.65	416.75	17.10	4.10
టెక్ మహీంద్ర	637.40	608.00	609.90	634.70	24.80	3.91
బిపిసిఎల్	446.00	429.00	430.75	447.55	16.80	3.75
ఐఒసి	184.70	176.00	177.90	184.75	6.85	3.71
హెచ్‌పిసిఎల్	366.85	350.90	352.35	364.75	12.40	3.40
బజాజ్ ఫైనాన్స్	1,698.90	1,627.00	1,631.85	1,687.90	56.05	3.32
హిందాల్కో	223.90	212.00	214.55	221.70	7.15	3.23
భారతి ఇన్‌ఫ్రాటెల్	337.15	320.05	325.35	334.45	9.10	2.72

కశ్మీర్‌లో శాంతి నెలకొనేదెప్పుడు?



శ్రీనగర్ : జమ్మూకశ్మీర్‌లో శాంతి నెలకొనేలా చూడాలని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కేంద్రాన్ని కోరారు. ఇరువైపులా కాల్పులకు స్వస్తి చెప్పేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, పాకిస్థాన్‌కు విజ్ఞప్తి చేశారు. భారత సరిహద్దు వెంట పాక్ జరిపిన కాల్పుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. ఇద్దరు మల్లయోధుల మధ్య తాము నలిగిపోతున్నామని వాపోయారు. విభజన, శత్రుత్వంవంటివాటితో జమ్మూకశ్మీర్ ప్రజలకు ఎలాంటి సంబంధం లేనప్పటికీ ఇరువైపులా మూల్యం చెల్లిస్తున్నది తమ ప్రజలేనని అన్నారు. పాక్‌తో చర్చల విషయంలో భారత్ పెద్దన్నయ్య పాత్ర పోషించాలని, రాష్ట్రంలో శాంతి నెలకొనేలా చూడాలని ముఫ్తీ కోరారు. శాంతి పరిరక్షణకు అటల్ బిహారీ వాజ్‌పేయి తరహాలో చర్యలు తీసుకువాలని సూచించారు. 2003లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచినప్పుడు వాజ్‌పేయి తీసుకున్న చొరవను ఆమె ప్రస్తావించారు. ప్రధాని మోదీ కూడా పాకిస్థాన్ వెళ్లారని, అయినప్పటికీ పఠాన్‌కోట్ ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని మెహబూబా ముఫ్తీ అన్నారు.

కచ్ఛేదిన్‌పై నోబెల్ చెప్పిన నిజాలు

కాంగ్రెస్ నేత రాహుల్



న్యూఢిల్లీ : ప్రధాని మోడీతో దేశానికి అచ్ఛేదిన్ కాదు కచ్ఛేదిన్ పరిస్థితి దాపురించిందని నిర్ధారణ అయినట్లు కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ తెలిపారు. భారతదేశపు ప్రగతిపథం కుంటుపడుతుందని, భారీ స్థాయి నిరుద్యోగంతో భారత్ గడ్డుస్థితిని ఎదుర్కొంటుందని నోబెల్ విజేత ఆర్థికవేత్త అయిన పాల్ క్రుగ్మన్ విశ్లేషించిన విషయాన్ని రాహుల్ ప్రస్తావించారు. ప్రధాని మోడీ తరచూ దేశానికి మంచి రోజులు వచ్చాయని చెపుతున్నారని, అయితే ఇది నిజం కాదని తాము చెపుతున్న అంశం ఈ ఆర్థికవేత్త మాటలతో నిర్ధారణ అయిందని రాహుల్ చెప్పారు. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలతో నిరుద్యోగం తీవ్రతరం అవుతుందని, అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలు పోతాయని రెండేళ్లుగా తాము చెపుతున్నామని అయితే ప్రధాని దీనిని తోసిపుచ్చుతున్నారని రాహుల్ విమర్శించారు. అచ్ఛేదిన్ ప్రగాల్భాలు పనిచేయకుండాపోతున్న నిజాలను ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ హామీ ఇచ్చారని, కానీ అందుకు విరుద్ధంగా జరుగుతోందని, భారీ స్థాయిలో నిరుద్యోగ సమస్య ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దనోట్ల రద్దుతో అనేక విధాలుగా నష్టం జరిగిందని ప్రత్యేకించి పలువురి ఉపాధి, ఉద్యోగాలు పోయాయని రాహుల్ వివరించారు. ఇక తరువాత తీసుకువచ్చిన జిఎస్‌టి అమలులో అవకతవకలతో పూడ్చలేని నష్టం వాటిల్లిందని అన్నారు.

శ్రీదేవికి ఎందుకు ఆ అంతిమ మర్యాద



ముంబై : నటి శ్రీదేవి దేశానికి ఏం మేలు చేశారని, ఆమెకు ఎందుకు అధికారిక అంత్యక్రియలు జరిపారని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధినేత రాజ్‌థాకరే ప్రశ్నించారు. ఫిబ్రవరిలో దుబాయ్‌లో శ్రీదేవి ఒక హోటల్‌లో బాత్‌టబ్‌లో పడి మృతి చెందారు. ఈ మృతి పలు విధాలుగా వివాదాలకు దారితీసింది. అయితే ఆమెకు ఎందుకు అధికారిక అంత్యక్రియలు నిర్వహించారని, శ్రీదేవి భౌతికకాయంపై త్రివర్ణ పతాకం ఎందుకు కప్పారని రాజ్ ప్రశ్నించారు. ఆయన ఇక్కడ ఒక ర్యాలీలో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. అత్యంత గౌరవప్రదమైన పతాకాన్ని భౌతికకాయంపై కప్పడం ద్వారా దేశ ప్రజలను అవమానించారని ప్రశ్నించారు. అంత్యక్రియల సమయంలో, అంతకు ముందు మీడియా శ్రీదేవి అంశానికి భారీ ప్రచారం కల్పించారని మీడియా అతి తగదని రాజ్ వ్యాఖ్యానించారు. నీరవ్ మోడీ కుంభకోణాన్ని ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. అక్షయ్‌కుమార్ నటించిన టాయ్‌లెట్ ఏక్‌ప్రేమ్ కథా, ప్యాడ్‌మాన్ చిత్రాలను ప్రస్తావిస్తూ వీటికి ఇంత ప్రచారం అవసరం లేదని, ఈ రెండు సినిమాలను ప్రభుత్వ పథకాల ప్రచారం కోసమే తీసినట్లుగా ఉందని తెలిపారు. అక్షయ్ కుమార్ కెనడాలో జన్మించారని ఈ సందర్భంగా రాజ్ నటుడి జాతీయతనుప్రశ్నించారు.

మోడీ ముక్తకు ఏకం కావాలి: మోడీముక్త భారత్ కోసం ప్రతిపక్షాలు ఏకం కావాల్సి ఉందని ఎంఎన్ఎస్ అధినేత రాజ్‌థాకరే పిలుపునిచ్చారు. 2019 నాటికి మోడీ అధికారం లేని భారతదేశం సిద్ధిస్తేనే దేశానికి మేలు జరుగుతుందని తెలిపారు. ఆయన ఇక్కడ ఒక ర్యాలీలో ప్రసంగించారు. బిజెపి నాయకత్వపు ఎన్‌డిఎపై రాజ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

శశికళ భర్త నటరాజన్ పరిస్థితి విషమం



చెన్నై: చిన్నమ్మ వికె శశికళ భర్త ఎం.నటరాజన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు ఈనెల 16న గుండెనొప్పి రావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. గుండె సంబంధింత ఇన్‌ఫెక్షన్ రావడంతో గ్లెనగ్లస్ గ్లోబల్ ఆసుపత్రిలో చేర్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నటరాజన్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. నటరాజన్‌కు ఐసియులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆయనకు వెంటిలేటర్ సదుపాయంతో శ్వాస అందిస్తున్నట్లు హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి షణ్ముగ ప్రియన్ వెల్లడించారు. గతేడాది అక్టోబర్‌లో కిడ్నీ ఆపరేషన్ కోసం ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం బాగానే ఉందని పూర్తిగా కోలుకున్నట్లు బంధువులు తెలిపారు. భర్తను చూసుకునేందుకు పెరోల్ ఇవ్వాల్సిందిగా శశికళ కోరినట్లు సమాచారం. గతంలో కూడా ఆమె భర్త అస్వస్థతకు గురైన సమయంలో పెరోల్‌మీద బయటకు వచ్చారు.

హెరాల్డ్ కేసులో పది కోట్లు చెల్లించండి

న్యూఢిల్లీ : యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ రూ పదికోట్లను డిపాజిట్ చేయాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి న్యాయస్థానం ఈ రూలింగ్ ఇచ్చింది. యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్, ఆయన తల్లి సోనియా గాంధీలు ప్రధాన వాటాదారులుగా ఉన్నారు. ఈ సంస్థపై రూ.249.15 కోట్ల మేర ఆదాయపు పన్ను కేసు విచారణ సాగుతోంది. నేషనల్ హెరాల్డ్ ఆస్తుల దుర్వినియోగంపై దాఖలు అయిన కేసులో ట్రయల్ కోర్టు గతంలో సోనియా, రాహుల్‌లను నిందితులుగా పేర్కొంటూ వారిని విచారణకు సమన్లు వెలువరించింది. మొత్తం పన్నులో సగం ఈ నెల 31లోగా మిగిలినది వచ్చే నెల 15లోగా చెల్లించాలని ట్రయల్‌కోర్టు ఆదేశించింది. అయితే ఇప్పుడు రూ పది కోట్లు చెల్లించాలని హైకోర్టు స్పష్టం చేసింది. కంపెనీకి విధించిన ఐటి చెల్లింపుల గురించి ఒత్తిడి తేరాదని కూడా ఇప్పుడు హైకోర్టు స్పష్టం చేసింది. ఐటి డిమాండ్‌పై కంపెనీ వారి పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలపై తగు సమాధానం ఇచ్చుకోవాలని ఇందుకు ఎప్రిల్ 24 వరకూ సమయం ఇస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. తమ సంస్థపై విచారణను నిలిపివేయాలని కోరుతూ సంస్థవారు ఈ నెల14న హైకోర్టును ఆశ్రయించారు.

బాలల న్యాయస్థానాలపై స్పందించండి

న్యూఢిల్లీ: దేశంలో బాల న్యాయస్థానాల ఏర్పాటుపై వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. బాలలకు ప్రత్యేక న్యాయస్థానాలు అవసరమా? లేదా అనే అంశంపై రాష్ట్రాల హైకోర్టులు తమ అభిప్రాయాలను తెలియచేయాలని సూచించింది. బాలలపై కేసుల సత్వర విచారణకు బాల న్యాయస్థానాల ఏర్పాటు అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలిస్తోంది. బాలల హక్కుల అణచివేత, వారిపై వచ్చే అభియోగాల విచారణ, బాలల తరఫున వాదించేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ఏర్పాటు వంటి అంశాలపై స్పందించాలని కోరారు. బాల నేరస్థుల చట్టం పరిధిలోని 25, 26 అధికరణల పరిధిలో అన్ని హైకోర్టులూ తమ నివేదికను అందించాల్సి ఉంటుంది. ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు గురించి అభిప్రాయాలను తెలియచేయాల్సి ఉంటుంది. ఈ మేరకు రాష్ట్రాల హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్‌కు ఆదేశాలు వెలువరించారు. ఈ ఆదేశాలు అందిన రెండు వారాలలోగా నివేదికలను అందించాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

మా ఎజెండా మాది.. మా పోరాటం మాది

లోక్‌సభ లోపల, బయట టిఆర్ఎస్ ఎంపిల ఆందోళన



మన తెలంగాణ/న్యూఢిల్లీ: మా ఎజెండా మాది, మా పోరాటం మాది ఇంకొకరిని ఫాలో అవ్వాల్సిన అవసరం లేదని టిఆర్ఎస్ ఎంపిలు స్పష్టం చేశారు. సోమవారం మరోసారి రిజర్వేషన్లను రాష్ట్రాలకు వదిలి పెట్టాలని డిమాండ్ చేస్తూ లోక్ సభలోపల, బయట ధర్నా నిర్వహించారు. రాష్ట్రాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలన్నదే మా ఉద్దేశం అని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. అనంతరం టిఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత జితేందర్ రెడ్డి మాట్లాడుతూ మేం కేంద్రంలో రిజర్వేషన్లు అడగడం లేదు మా రాష్ట్రం వరకు రిజర్వేషన్లు కల్పిస్తామని అంటున్నాము, అయితే ఈ విషయంలో కేంద్రప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ మేరకు బిల్లు పాస్ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశాము, కాని కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఆరోపించారు. నాలుగేళ్లుగా విభజన అంశాల అమలు కోసం ఎదురు చూశాం కానీ కేంద్రం ఇప్పటి వరకు ఏ ఒక్కటీ అమలు చేయనందుకు ఆందోళన చేస్తున్నామని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల విషయంపై మాకు కచ్చితమైన హామీ వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు. టిడిపి, వైసిపి పార్టీలకు అవిశ్వాసం పెట్టాలన్న ఆలోచన ఇవాళ వచ్చింది కాని మేం మొదటి రోజు నుంచి రిజర్వేషన్ల పెంపుకోసం పోరాడుతున్నామని అన్నారు. అవిశ్వాస తీర్మానం సమయంలో మేం ఎలా ఉండాలనే విషయం మీరు కాదు డిసైడ్ చేసేది కాంటూ మీడియా పై జితేందర్ రెడ్డి నిప్పులు చెరిగారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ వచ్చినప్పుడు చూద్దాం అంటూ... టిడిపి, వైసిపి పార్టీలకు మద్దతు ఇచ్చే విషయంపై ఆలోచిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మరో ఎంపి వినోద్ కుమార్ మాట్లాడుతూ మా రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందుపర్చాలని మొదటి రోజు నుంచి డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. విభజన చట్టంలో పొందుపర్చిన అంశాలపై మేం కూడా చర్చలో పాల్గొంటాం మాట్లాడతాం అని స్పష్టం చేశారు. టిడిపి మంత్రులు రాజీనామా చేసిన సందర్భంగా మాట్లాడుతూ విభజన అశాస్త్రీయం, తొందరపాటు అని అంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తప్పుబడుతున్న రీతిలో వారి స్పందన ఉందన్నారు. విభజన జరిగిన తీరుపై కాకుండా, వారి హక్కుల కోసం మాట్లాడితే మేం పూర్తిగా మద్దతిస్తామని స్పష్టం చేశారు. టీడీపి, వైసిపి పార్టీల మాటల్లో విభజనను వ్యతిరేకించే స్వరం వినిపిస్తోంది, కాబట్ట దీనిపై మా వ్యతిరేకతను ఖచ్చితంగా తెలియజేస్తామన్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చకొస్తే మేం పాల్గొంటాం. మా అభిప్రాయాలు చెబుతాం అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం రాకుండా టిఆర్ఎస్ అడ్డుపడుతుందని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించడంపై వినోద్ కుమార్ మండిపడుతూ కాంగ్రెస్ గురించి మాట్లాడడం వేస్ట్, యూపీలో రెండు చోట్ల డిపాజిట్లు పోగొట్టుకున్న పార్టీ అంటూ విమర్శించారు. ఎవరో గెలిస్తే సంబరాలు చేసుకుంటున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఎద్దేవా వేశారు. రానున్న రోజులలో కూడా లోక్ సభలో వెల్‌లోకి వెళ్లి నిరసన కొనసాగిస్తామని తెలిపారు. ఎంపి సీతారం నాయక్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలన్నది మా డిమాండ్ అని స్పష్టం చేశారు. మంచి విషయాల్లో మేం కేంద్రానికి సహకరించాం కాని మాకు కావాల్సినవాటిపై ఒంటికాలిపై నిలిచి పోరాడామని తెలిపారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టడం అసాధ్యమైన విషయం అన్నారు. ప్రభుత్వం వద్ద తగినంత సంఖ్యాబలం ఉన్నందున, అసాధ్యమైన విషయం కోసం సాహసం చేయడం దేనికి? గిచ్చి కయ్యం పెట్టుకోవడం ఎందుకు? అని సీతారాం నాయక్ అన్నారు. ధర్నా అనంతరం టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్ రెడ్డి, వినోద్‌లకు కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ తారసపడడంతో వారు ఆమెతో తాము ధర్నా చేస్తున్న విషయం, దాన్ని కేంద్ర ప్రభుత్వం అంగీకరించాల్సిన విషయం పై చర్చించారు.

చర్చకు రాని అవిశ్వాస తీర్మానాలు

మన తెలంగాణ/న్యూఢిల్లీ: టిడిపి, వైఎస్సార్‌సిపిలు రెండో రోజయిన సోమవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను లోక్ సభ స్పీకర్ చర్చకు తీసుకోలేదు. టిఎస్సార్, అన్నాడిఎంకె సభ్యుల నినాదాల నడుమ లోక్‌సభ మంగళవారానికి వాయిదాపడింది. దీంతో కేంద్ర సర్కారుపై అవిశ్వాస తీర్మానికి సంబంధించి టిడిపి, వైఎస్సార్‌సిపి మంగళవారం మరోమారు నోటీసులు ఇవ్వనున్నాయి. సోమవారం సభ ప్రారంభమైన మరుక్షణమే టిఆర్ఎస్, ఎఐఎడిఎంకేలు తమ తమ డిమాండ్లతో హోరెత్తించాయి. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ గంటపాటు సభను వాయిదా వేశారు. తిరిగి 12 గంటలకు సమావేశాలు పునఃప్రారంభమైనా.. నినాదాల జోరు తగ్గలేదు. స్పీకర్ పలుమార్లు అభ్యర్థించినా సభ్యులు శాంతించలేదు. నినాదాల మధ్యలోనే స్పీకర్ సుమిత్రా మహాజన్ వైఎస్సార్‌సిపి, టిడిపిలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం గురించి మాట్లాడారు. "వైఎస్సార్‌సిపి ఎంపి వైవీ సుబ్బారెడ్డి, టిడిపి ఎంపి తోట నర్సింహం ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను సభ ముందుకు తెవాల్సిఉంది. కానీ అంతకంటే ముందు మీరు మీమీ స్థానాల్లోకి వెళ్లి కూర్చోవాలి. లేకుంటే బిజినెస్ జరగదు..' అని చెప్పారు. సభ్యులు ఎంతకీ వెనక్కి వెళ్లకపోవడంతో స్పీకర్ నిస్సహాయత వ్యక్తం చేశారు. 'సభ ఆర్డర్‌లో లేనందున అవిశ్వాస తీర్మానాలపై చర్చను ప్రారంభించలేకపోతున్నాం..' అని సుమిత్రా ప్రకటించారు. ఆ వెంటనే సభను మంగళవారానికి వాయిదావేశారు. అంతకముందు కేంద్ర హోం మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఒక ప్రకటన చేస్తూ..... సభలో అన్ని పార్టీల ఎంపిలు సంయమనంతో ఉంటే కేంద్ర ప్రభుత్వం పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చిద్దామని, అన్ని అంశాలు చర్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందంటూ ప్రకటన చేశారు. కాని ఎవ్వరూ కూడా రాజ్ నాథ్ చేసిన ప్రకటనను ఒప్పుకోలేదు. సభ ఆర్డర్ లేనప్పుడు తాను అవిశ్వాస తీర్మానానికి ఎంతమంది మద్దతు ఇస్తున్నారనే విషయాన్ని లెక్కించ లేనని, పోడియం దగ్గర ఆందోళన చేస్తున్నవారు శాంతించి వారివారి సభాస్థానాలలోకి వెళ్లి కూర్చోవాలని కోరారు. కాంగ్రెస్ సభ్యుడు జోతిరాధిత్య సింధియా, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పీకర్ తన సభాస్థానంలో నిలుచొని ఎంతమంది మద్దతు ఇస్తున్నారని లెక్కిచాలని కోరగా దానికి స్పీకర్ అంగీకరించలేదు. సభ మంగళవారానికి వాయిదా పడిన అనంతరం టిడిపి, వైఎస్సార్ పార్టీ ఎంపిలు మీడియా తో మాట్లాడుతూ.... కేంద్రం ప్రభుత్వం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనడానికి సిద్ధంగా లేదని అందుకే, తాము ఇచ్చిన నోటీలపై చర్చ చేపట్టడం లేదని ఆరోపించారు. కేంద్రం ప్రభుత్వం తమ నోటీసులు చర్చకు రాకుండా చేయడానికే టిఆర్ఎస్, అన్నాడిఎంకె సభ్యుల ద్వారా ఆందోళన చేయిస్తూ... సభను వాయిదా వేస్తుందని విమర్శించారు. కేంద్రంపై ఒత్తిడి తేవడానికి లోక్ సభ ఎన్ని రోజులు జరిగితే, అన్ని రోజులు తాము అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇస్తామని తెలిపారు.

ఉత్పాదక సంక్షోభం భారత్‌కు శాపం

నోబెల్ ఆర్థికవేత్త పాల్ హెచ్చరిక



వాషింగ్టన్ : భారతదేశంలో తీవ్ర స్థాయి నిరుద్యోగ సమస్య నెలకొంటుందని అమెరికన్ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత పాల్ క్రుగ్మన్ హెచ్చరించారు. ఉత్పాదక రంగం అభివృద్ధి చెందకపోతే, భారత్‌లో ఉద్యోగాల కల్పనకు విఘాతం ఏర్పడుతుందని, దీనితో భారతదేశ ఆర్థిక ప్రగతి కథ ముగుస్తుందని వ్యాఖ్యానించారు. ఇటీవల ఆయన న్యూస్ 18 నిర్వహించిన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. ఉత్పాదన రంగంతో పాటు సేవా రంగంలో కూడా భారత్‌కు ప్రతికూలతలు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. అత్యధిక జనాభా ఉన్న భారత్‌కు నిర్ధిష్టమైన ఆర్థిక సమస్యలు ఉంటాయని, ఎప్పటికప్పుడు ప్రగతి క్రమాన్ని అన్ని కోణాలలో జనాభా నేపథ్యంలో బేరీజు వేసుకోవల్సి ఉంటుందని అన్నారు. ఉత్పాదక రంగంలో సరైన విధంగా పురోగతి లేకుంటే విపరీత పరిణామాలు రావచ్చునని హెచ్చరించారు. బలీయమైన ఆర్థికశక్తిగా రూపొందాలంటే అది కేవలం ఉత్పాదక రంగంలో అభివృద్ధితోనే సాధ్యం అవుతుందన్నారు. ఓ వైపు భారత్ నుంచి విశేష రీతిలో సేవలు ఇతర దేశాలకు బదలాయింపు జరుగుతోందని, సేవల కోణంలో అసాధారణ రీతిలో వృద్ధి ఉందని అయితే ఇది విపరీత స్థాయిలో ఉంటోందని వ్యాఖ్యానించారు. ఉత్పత్తి విషయానికి వస్తే పరిస్థితి దారుణంగా ఉందని, దీని వల్ల నిర్ధిష్ట స్థాయిలో ఉద్యోగ కల్పనల లక్ష్యాలను చేరుకోవడం కష్టం అవుతుందని అన్నారు. సేవల దిగుమతి భారత్ విషయంలో చివరికి కృత్రిమ మేధో వలసగా మారిందని, ఈ సేవల ప్రామాణికతలు కూడా ప్రశ్నార్థకం అవుతాయని తెలిపారు.అనుకున్న రీతిలో ప్రగతి సాధించుకోవాలంటే ఉద్యోగ కల్పన కీలకం అన్నారు. దీనికి ఉత్పాదక రంగం పటిష్టం అవసరం అన్నా రు. ఈ సందర్భంగా ఈ ఆర్థికవేత్త జపాన్ చైనాల గురించి ప్రస్తావించారు. జపాన్ ఇప్పుడు సూపర్‌పవర్‌గా నిలబడలేకపోయిందని, అక్కడ పనిచేసే వయస్కుల సంఖ్య తగ్గిందని, ఇక చైనా విషయంలో కూడా ఇదే సమస్య తలత్తుతోందని , ఆసియాలో ఇండియా ఒక్కటే ఈ శ్రామిక శక్తి సమస్యలేకుండా ఉందని అయితే దీనిని పరిగణనలోకి తీసుకుని ఉత్పాదక రంగాన్ని మరింత పరిపుష్టం చేసుకోవడం వల్లనే దేశ అత్యధిక జనాభా నిష్పత్తితో పోలిస్తే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దక్కుతుందని, లేకపోతే నిరుద్యోగం పెరిగి భారతదేశపు ఆశావహ ప్రగతి కథ ముగుస్తుందని హెచ్చరించారు.



రద్దయిన నోట్లను చించేశాం : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : రద్దు చేసిన రూ.500, రూ.వెయ్యి నోట్లను లెక్కించి,అవి అసలైనవేనని నిర్ధరించుకొని, చించేసినట్లు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) తెలిపింది. ఆ ముక్కలను కట్టలుగా కట్టినట్లు వివరించింది. టెండర్ ప్రక్రియ ద్వారా వాటిని విక్రయిస్తున్నట్లు పేర్కొంది. గత ఏడాది జూన్ 30నాటికి అందిన నోట్ల విలువరూ. 15.28 లక్షల కోట్లుగా ఆర్‌బీఐ లోగడ అంచనావేసింది. వీటిని అధునాతన కరెన్సీ వెరిఫికేషన్, ప్రాసెసింగ్ వ్యవస్థ ద్వారా లెక్కించి,పరిశీలన సాగించారు. ఆ తర్వాత వీటిని తమ కార్యాలయా ల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థ ద్వారా చిం చే సి,కట్టలుగా కట్టామని ఆర్‌బిఐ పేర్కొంది. వీటి ని తాము రీసైకిల్ చేయబోమని తెలిపింది.రూ. 500, రూ.వెయ్యి నోట్లను కేంద్రప్రభుత్వం 2016 నవంబర్ 8న రద్దు చేసిన సంగతి తెలిసిందే.

ఉన్న ఆయుధాలతోనే పోరాడతాం

ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్



న్యూఢిల్లీ : అందుబాటులో ఉన్న ఆయుధాలతో పోరాడేందుకు సేనలు సిద్ధంగా ఉన్నాయని భారత ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ అన్నారు. ఆయుధ సామాగ్రి సమకరణ కొనసాగుతోందని చెప్పారు.సైన్యం నిధుల కొరతతో సేనల ఆధునీకరణ, నూతన ఆయుధాల కొనుగోళ్లు మందగించాయని పార్లమెంటరీ కమిటీ నివేదిక నేపథ్యంలో రావత్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించు కున్నాయి.నిధుల కొరతతో దళాల ప్రతిఘటన సామర్థ్యం మెరుగుదల సమస్యలు ఎదుర్కొంటోందని రక్షణ రంగంపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ నివేదిక వెల్లడించింది. కొన్ని ఆయుధాలకు కాలగ్రహణం పట్టిందన్న వాదనపై ఆర్మీ చీఫ్ స్పందిస్తూ గతంలోనూ ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఏ ఆయుధాలు అందుబాటులో ఉన్నా వాటితో పోరాడేందుకు ఆర్మీ జవాన్లు సిద్ధంగా ఉన్నారని జనరల్ బిపిన్ రావత్ అన్నారు. సైన్యానికి వెచ్చిస్తున్న ఖర్చులన్నీ నిర్వహణకే సరిపోతున్నాయన్న ప్రచారంఅవాస్తవమని ఇటీవల ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు.రక్షణ రంగ బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో దాదాపు 35శాతం జాతి నిర్మాణానికే వెచ్చిస్తారని, సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక వసతల మెరుగుదలకు వెచ్చిస్తామమని స్పష్టం చేశారు.వాస్తవాధీన రేఖ వెం బడి పాక్ కవ్వింపు చర్యలు విరమించుకోకుంటేతదుపరి చర్యలపై ముందడుగు వేయాల్సిఉంటుందని హెచ్చరించారు.


వాట్సాప్‌తో జాగ్రత్త సుమా -సైనికులకు భారత ఆర్మీ వార్నింగ్ : యాప్ వాట్సాప్ విషయంలో చాలా జాగ్రత్త వహించాలని సైనికులకు భారత ఆర్మీ వార్నింగ్ ఇస్తోంది. వాట్సాప్‌ను వాడుతూ చైనీస్, భారత సిస్టమ్స్‌ను హ్యాక్ చేస్తున్నట్టు దేశీయ ఆర్మీ ఓ వార్నింగ్ వీడియోను పోస్టు చేసింది. నిమిషం నిడివి గల ఈ వీడియోను సమాచార, ప్రసారాల శాఖ మంత్రి స్మృతీ ఇరానీ రీపోస్టు చేశారు. 'మన డిజిటల్ ప్రపంచాన్ని కొల్లగొట్టడానికి చైనీస్ అన్ని రకాల ప్లాట్‌ఫామ్‌లను వాడుతున్నారు. మన సిస్టమ్‌లను హ్యాక్ చేయడానికి చైనీస్ వాడుతున్న కొత్త మాధ్యమం వాట్సాప్ గ్రూప్‌లు. +86 ప్రారంభమయ్యే చైనీస్ నెంబర్లు మీ గ్రూప్‌లోకి ప్రవేశించి, మీ డేటాను సంగ్రహించడం ప్రారంభించాయి' అని తెలుపుతూ ఆర్మీ అధికారులు ఈ వీడియో ట్వీట్ చేశారు. సైనికులు తమ కాంటాక్ట్ నెంబర్లను పేర్లతో సేవ్ చేసుకోవాలని, అన్ని వాట్సాప్ గ్రూప్‌లను ఎప్పడికప్పుడు చెక్ చేసుకోవాలని, తెలియని నెంబర్లను పదేపదే క్రాస్‌చెక్ చేసుకోవాలని భారత ఆర్మీ సూచించింది. ఒకవేళ మీరు మొబైల్ నెంబర్ మారిస్తే, గ్రూప్ అడ్మిన్‌కు తెలియజేయాలని తెలిపింది. ఒకవేళ సిమ్ కార్డును మారిస్తే, దాన్ని పూర్తిగా నాశనం చేయాలని సూచించింది. ఆర్మీ అడిషినల్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ పబ్లిక్ ఇంటర్‌ఫేస్ ఈ వీడియోను రూపొందించింది. 'బీ అలర్ట్, బీ సేఫ్' అనే ట్వీట్‌తో ఈ వీడియోను విడుదల చేసింది. గతేడాది చైనా సరిహద్దులో ఉన్న సైనికులను తమ స్మార్ట్‌ఫోన్లను ఫార్మాట్ చేసుకోవాలని ఆర్మీ ఆదేశించిన సంగతి తెలిసిందే.

చైనీస్ హ్యాకర్ల నుంచి ప్రమాదం పొంచి ఉన్న 40కి పైగా యాప్‌లను అన్‌ఇన్‌స్టాల్ చేయమని కూడా ఆదేశాలు జారీచేసింది. చైనీస్ సంస్థలు అభివృద్ధి చేసిన ఆ యాప్స్ అనుమానితమైనవిగా ఆర్మీ పేర్కొంది. ఇరు దేశాల మధ్య డోక్లాం వివాదం ముగిసిన రెండు నెలల తర్వాత ఆర్మీ ఈ హెచ్చరికలు జారీచేయడం పలు ఆందోళనలకు దారితీస్తోంది.

జమ్ములో కాల్పులు : ఐదుగురు పౌరులు మృతి



శ్రీనగర్: పాక్ బలగాలు మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయి. జమ్ము కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో పాక్ బలగాలు కాల్పులకు తెగబడ్డాయి.ఈ కాల్పుల్లో ఐదుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిస్పందనగా భారత బలగాలు దీటుగా బదులిచ్చాయి. కాల్పుల్లో చనిపోయిన వారిలో ఓ మహిళ, ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆదివారం ఉదయం 7.45 ప్రాంతంలో ఈ కాల్పులు చోటుచేసుకున్నట్లు ఆర్మీ ప్రతినిధి ఒకరు తెలిపారు. పాక్ బలగాలు జనావాస ప్రాంతాలపైనే దృష్టిసారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరిలో పూంచ్, రజౌరీ జిల్లాల్లో పాక్ కాల్పులకు పాల్పడటంతో 22 ఏళ్ల ఆర్మీ కెప్టెన్‌తో పాటు మరో నలుగురు జవాన్లు వీరమరణం పొందిన సంగతి తెలిసిందే.



హురియత్ నేత గిలానీ రాజీనామా

శ్రీనగర్ : తెహ్రీక్ ఇ హురియత్ చైర్మన్ పదవికి కశ్మీరీ వేర్పాటువాద నేత సైయద్ అలీ షాగిలానీ సోమవారం రాజీనామా చేశారు. పార్టీ కొత్త చైర్మన్‌గా హురియత్ సీనియర్ నేత ముహమ్మద్ అష్రాఫ్ సెహ్రాయ్ ఎన్నికయ్యారు. గిలానీ సారథ్యంలోని తెహ్రీక్ ఇ హురియత్ నేతలు శ్రీనగర్‌లోని కార్యాలయంలో సమావేశమై అష్రాఫ్‌ను పార్టీ చైర్మన్‌గా ఎన్నుకున్నట్టు ఆ పార్టీ ప్రతినిధి తెలిపారు. కశ్మీర్ లోయలో కీలక వేర్పాటువాద నేతగా పేరున్న గిలానీ బహిరంగంగానే వేర్పాటువాద ప్రకటనలు చేసేవారు. కశ్మీర్‌లో రక్తపాతం, తీవ్రవాదం పెరగడానికి గిలానీయే కారణమని మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పలుమార్లు ఆరోపించేవారు. కశ్మీర్ ప్రజలు మరింత కష్టాల్లో కూరుకుపోకుండా కాపాడే మార్గాన్ని ఎంచుకోవాలంటూ ఒమర్ తండ్రి, కేంద్ర మాజీ మంత్రి ఫరూక్ అబ్దుల్లా సైతం గిలానీని కోరిన సందర్భాలున్నాయి. గిలానీ జమ్ముకశ్మీర్‌లోని సోపోర్ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ విజయం



మాస్కో : వ్లాదిమిర్ పుతిన్ రష్యా అధ్యక్షుడిగా నాలుగోసారి ఎన్నిక య్యారు. ఆయనకు 73.9 శాతం ఓట్లు పడినట్లు ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడ యింది. అధ్యక్ష ఎన్నికల్లో ఓటేసేందుకు ఆదివారం ప్రజలు పోటెత్తారు. దేశవ్యాప్తంగా మొత్తం 10.7 కోట్ల మంది ఓటర్లు ఉండగా..మధ్యాహ్నం 2 గంటలకే దాదాపు 52 శాతం ఓటింగ్ నమోదైంది. పలు కేంద్రాల్లో ఓటర్లు ఇంకా బారులు తీరి కనిపించారు. ఈ ఎన్నికల్లో పుతిన్‌తోపాటు మరో ఏడుగురు అభ్యర్థులు బరిలో దిగారు. న్యాయ పర మైన కారణాలతో పుతిన్ ప్రధాన ప్రత్యర్థి అలెక్సీ నావల్నీని తాజాగా ఎన్నికల బరి నుంచి తప్పించారు. పుతిన్ మరోసారి ఎన్నికవ్వడం లాంఛనమేననే తేలిపోయింది. దాదాపు 19 ఏళ్ల క్రితం ఆయన తొలిసారిగా దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి అధికారంలో కొనసాగుతున్నారు. పుతిన్ పాలనలోనే పుట్టి.. పూర్తిగా ఆయన పాలనలోనే జీవిస్తున్న యువత (ఇటీవలే 18 ఏళ్లు నిండినవారు) తొలిసారిగా ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

8 రాష్ట్రాల సిఫారసులకు 'పద్మ' జాబితాలో దక్కని చోటు!

న్యూఢిల్లీ : 'పద్మ' అవార్డుల కోసం ఎనిమిది రాష్ట్రప్రభుత్వాలు, ఏడుగురు గవర్నర్లు, 14 మంది కేంద్ర మంత్రుల సిఫారసులను ఎంపిక సంఘం తిరస్కరించింది. 2018 సంవత్సరానికి పద్మ అవార్డుల కోసం సుమారు 35,595 సిఫారసులు/ నామినేషన్లు అందాయి. వీటినుంచి 84 ప్రముఖులను మాత్రమే ఎంపిక చేసుకున్నట్లు కేంద్ర హోంశాఖ వర్గాలు పేర్కొన్నాయి.పదిమంది సభ్యుల ఎంపిక సంఘం రూపొందించిన పేర్లే ఈ తుది జాబితాలో ఉన్నాయి. 'మట్టిలో మాణిక్యాలు'(అన్ సంగ్ హీరోస్) పేరుతో విడుదల చేసిన ఈ జాబితాలోని వారంతా నిరుపేదల కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారే. కొందరైతే అత్యంత సామాన్యమైన నేపథ్యం నుంచి వచ్చి తామెంచుకున్న రంగాల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన వారేనని హోంశాఖ అధికారి ఒకరు వెల్లడించారు.తమిళనాడు, హరియాణా, జమ్ముకశ్మీర్, కర్ణాటక, ఉత్తరాఖండ్, బీహార్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల ప్రభుత్వాలు అందచేసిన సిఫారసులను ఎంపిక సంఘం తిరస్కరించినట్లు పేర్కొన్నారు. కాగా, 'పద్మ' అవార్డులను మార్చి 20 (మంగళవారం), ఏప్రిల్ రెండో తేదీల్లో రెండు దఫాలుగా రాష్ట్రపతి భవన్‌లో ప్రదానం చేస్తారు.

దౌత్యవేత్తలపై వేధింపులకు నిరసనగా పాక్‌కు భారత్ లేఖ

న్యూఢిల్లీ : తమ దౌత్యవేత్తలపై వేధింపులకు నిరసనగా పాకిస్థాన్‌కు భారత్ మరో లేఖ పంపింది. ఇలాంటి లేఖ (నోట్ వెర్బల్)ను పంపడం గత మూడు నెలల్లో ఇది 13వసారి. పాక్ విదేశాంగ శాఖకు భారత హైకమిషన్ దీన్ని అందించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. వేధింపులకు సంబంధించి మూడు ఘటనలను దీనిలో ఉదహరించినట్లు పేర్కొన్నాయి. వీటిలో ఓ ఉన్నతాధికారిని గుర్తుతెలియని వ్యక్తులు కారులో వెంబడించిన ఘటన కూడా ఉంది. దీనికి సంబంధించి మొబైల్‌లో చిత్రీకరించిన వీడియోను సమర్పించినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు నలుగురు హైకమిషన్ అధికారులు ఆబ్‌పారా మార్కెట్‌కు వెళ్లినప్పుడు ఇద్దరు ద్విచక్రవాహనాలపై వెంబడించిన ఘటన గురించీ లేఖలో ప్రస్తావించారన్నారు. భారత హైకమిషన్ వెబ్‌సైట్‌ను బ్లాక్‌చేస్తూ అసౌకర్యం కలిగిస్తున్న ఘటన గురించీ ప్రస్తావించినట్లు చెప్పారు. ఈ అంశాలపై లోతుగా విచారణ చేపట్టాలని కోరినట్లు వెల్లడించారు.

సిలిండర్ పేలి ముగ్గురు దుర్మరణం

ఈరోడ్ : తమిళనాడులోని ఈరోడ్ జిల్లా తాయిర్పాలయంలో ప్రమాదావశాత్తు వంట గదిలోని ఎల్‌పిజి సిలిండర్ పేలడంతో తల్లి, ఇద్దరు కుమార్తెలు అక్కడికక్కడే కాలిపోయి మృతి చెందారు. పేలుడు సంభవించిన అనంతరం స్థానికులు సమాచారం అందించడంతో అక్కడి చేరుకున్న పోలీసులు ఆ ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా పూర్తిగా కాలిపోయిన మూడు మృతదేహాలను కనుగొన్నారు. వారిలో 45 ఏళ్ల మహిళ (జయమణి), 18, 13 ఏళ్ల యువతులున్నారని, వారంతా తల్లికూతుళ్లని పోలీసులు తెలిపారు. గ్యాస్ లీక్ కావడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన జరిగిన సమయంలో జయమణి భర్త ఇంట్లో లేడని తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్కరీకి సారీ చెప్పిన కేజ్రీవాల్



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ తాజాగా కేంద్రమంత్రి, బీజేపీ నేత నితిన్ గడ్కరీకి సారీ చెప్పారు. దేశంలో అతి పెద్ద అవినీతిపరుడు నితిన్ గడ్కరీయేనంటూ గతంలో కేజ్రీవాల్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ధ్రువీకృతం కానీ, ఆధారాలు లేని ఆరోపణలు ఆయనపై చేసినందుకు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్టు కేజ్రీవాల్ ఒక లేఖలో తెలిపారు. 'వ్యక్తిగతంగా మీపై నాకు ఎలాంటి కక్ష లేదు. ఆరోపణలు చేసినందుకు విచారం వ్యక్తం చేస్తున్నాను. గతంలో జరిగిన దానిని మరిచిపోయి.. కోర్టు కేసును ముగించేద్దాం'అని ఆయన గడ్కరీకి రాసిన లేఖలో సూచించారు. సోమవారం గడ్కరీ, కేజ్రీవాల్ ఢిల్లీ పటియాల కోర్టులో నడుస్తున్న పరువునష్టం దావా కేసును ముగించాలంటూ అభ్యర్థనలు దాఖలు చేశారు. తనపై ఆరోపణలు చేసినందుకు గడ్కరీ ఈ దావాను కేజ్రీవాల్‌పై వేశారు. కేజ్రీవాల్‌పై దాదాపు 33 పరువునష్టం దావాలు కోర్టులో దాఖ లు అయ్యాయి. వాటిని కూడా ఇదేవిధంగా కోర్టుబయట పరిష్కరించుకోవాలని కేజ్రీవాల్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అకాలీ నేత మజిథియా కు కేజ్రీవాల్ క్షమాపణ చెప్పడం పంజాబ్ ఆప్‌లో చిచ్చురేపింది. ఆయన తీరుకు నిరసనగా పార్టీ పంజాబ్ అధ్యక్షుడు భగవంత్ మాన్, ఉపాధ్యక్షుడు అమన్ అరోరా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

కేజ్రీవాల్‌కు కొంచెం ఊరట : రెండు వేర్వేరు పరువు నష్టం దావాలలో ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట దక్కింది. ఆయన ఈ కేసులలో నిర్దోషి అని ఢిల్లీ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సోమవారం రూలింగ్ ఇచ్చారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, న్యాయవాది అమిత్ సిబల్‌లు వేర్వేరుగా పరువు నష్టం కేసులు పెట్టారు. అయితే వారికి కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పడంతో కేజ్రీవాల్ నిర్దోషిగా విముక్తి అయ్యారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కూడా క్షమాపణలు చెప్పడంతో ఆయనను కూడా నిర్దోషిగా ప్రకటించారు. ఫిర్యాదీదారులు ఈ క్షమాపణలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనితో కేసుల ఉపసంహరణకు వీలేర్పడింది. అయితే అమిత్ సిబల్ దాఖలు చేసిన పరువు నష్టం దావాలో లాయర్ ప్రశాంత్ భూషణ్, బిజెపి నేత షజియా ఇల్మీలపై కోర్టు విచారణ సాగుతుంది. తాను తగు నిర్ధారణలు లేకుండా వ్యాఖ్యలకు దిగానని, తరువాత ఇవి నిరాధారమైన ఆరోపణలు అని వెల్లడైందని, తాను క్షమాపణ చెపుతున్నట్లు కేజ్రీవాల్ కోర్టు ద్వారా విన్నవించుకున్నారు. వోడాఫోన్ పన్నుల సమీక్ష కేసులో తనపైనా తండ్రి కపిల్ సిబల్ పైనా తప్పుడు ఆరోపణలు చేశారని న్యాయవాది అమిత్ సిబల్ 2013లో కేసు వేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోల విధ్వంసం

● రోడ్డు పనుల వాహనాలు దహనం ● కాంట్రాక్టర్ కుమారుని హత్య





మన తెలంగాణ/భద్రాచలం : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరో సారి విధ్వంసానికి పాల్పడ్డారు. ఉనికి చాటుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న వారు హల్‌చల్ చేస్తున్నారు. తాజాగా ఆ రాష్ట్రంలోని తూన్‌నార్, కోయిల్‌పల్లి మార్గంలో రోడ్డు నిర్మాణ పనుల్లో ఉన్న ఆరు వాహనాలను తగులబెట్టారు. అంతే కాకుండా ఆ ప్రాంతంలో పనులు చేస్తున్న గుత్తేదారు కుమారుడు విశాల్ కుమార్‌ను హత్య చేసి నడి రోడ్డుపై పడేశారు. దీంతో మరోసారి ఛత్తీస్‌గఢ్ ఉత్కంఠ వాతావరణం నెలకొంది. కాగా గత నెల రోజుల క్రితం రోడ్డు పనుల ఆపాలని మావో యిస్టులు హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే గత నెల్లో బస్తర్ జిల్లా మార్‌దూమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన మంత్రి సడక్ నిర్మాణ యోజన పనుల్లో ఉన్న 10ట్రాక్టర్లను, మరికొన్ని ఇతర వాహనాలను సైతం తగులబెట్టి హెచ్చరికలు జారీచేశారు. ఈ ఘటనలో అప్పట్లో 100 మంది కిపైగా మావోయిస్టులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.అంతే కాకుండా గత నెల నుండి మొదలు పెట్టి నేటి వరకు సుమారు 30కి పైగా వాహనాలను మావోయిస్టులు ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. మరో ప్రక్క సుకుమా జిల్లా ఎర్రబోరు పరిధిలో జాతీయరహదారి 30 వద్ద రోడ్డు నిర్మాణంలో ఉన్న టిప్పర్‌ను తీసుకెళ్లి తగులబెట్టినట్లు సమాచారం. ఇంత పెద్ద ఎత్తున రోడ్డు పనులను ఆపాలని హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ ఖాతరు చేయక పోవడంతోనే మావోయిస్టులు పెద్ద ఎత్తున హింసకు దిగుతున్నట్లు తెలుస్తోంది.

గుత్తేదారులపై గురి : రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న గుత్తేదారులపై మావోయిస్టులు పెద్ద ఎత్తున గురిపెట్టినట్లుగా తెలుస్తోంది. తాజాగా కాంట్రాక్టర్ కుమారుడు విశాల్‌ను హత్య చేసిన మావోయిస్టులు రోడ్డు మీద రక్తపు మడుగులో పడేశారు. గత వారం రోజుల క్రితం ఇదే రాష్ట్రంలోని బెజ్జీ సమీపంలో కాంట్రాక్ట్ సంస్థ మేనేజర్ అనీల్‌ను సైతం మావోయిస్టులు హత్య చేశారు.దీంతో మావోయిస్టులు గుత్తేదారులు, వారి పనివాళ్లు,కుటుంబ సభ్యులపైనే గురిపెట్టినట్లు తెలుస్తోంది. అటవీ గ్రామాల్లో సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు ఆపాలని చెబుతున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో పెద్ద ఎత్తున గురిపెడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. రోడ్డు నిర్మాణ పనులు జరిగే ప్రదేశంలో గస్తీ కాస్తున్న పోలీస్ బలగాలను పెద్ద ఎత్తున మట్టుపెట్టిన పోలీసులు, ఇప్పుడు రూటు మార్చి కాంట్రాక్టర్లవైపు దృష్టి సారించారు.అసలు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకుంటే ఇబ్బంది ఉండదనే ఆలో చనకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు విఘాతం ఏర్పడే అవకాశాలున్నాయి.

లాలూకు మరో ఎదురు దెబ్బ

రాంచీ: బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలు ప్రసాద్‌యాదవ్‌కు మరో ఎదురు దెబ్బ తగిలింది. పశువుల దాణ కేసులో దమ్‌కా ట్రెజరీ నుంచి 1990 సంవత్సరంలో అక్రమంగా రూ.3.13 కోట్లు తీసుకున్నట్లు నిర్ధారణకు వచ్చిన సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం ఈ కేసులోనూ లాలూను దోషిగా పేర్కొంది. ఇదే కేసులో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాను జడ్జి శివపాల్‌సింగ్ నిర్దోషిగా ప్రకటించారు. కాగా లాలుకు శిక్షను ఇంకా ఖరారు చేయలేదని సిబిఐ న్యాయస్థానం తెలియజేసింది. ఇప్పటికీ ఆర్‌జెడి చీఫ్‌ను నాలుగు కేసులోన్లూ దోషిగా నిర్ధారించారు.



ఛత్తీస్‌గఢ్‌లో పది మంది నక్సల్స్ లొంగుబాటు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్‌కు ఎదురు దెబ్బ తగిలింది. కొండగాన్ జిల్లాలో సోమవారం ఓ మహిళ సహా పది మంది నక్సల్స్ లొంగి పోయారు. కింది స్థాయి కేడర్స్‌కు చెందిన వీరు స్వయంగా కొండగాన్ ఎస్‌పి అభిషేక్ పల్లావ్ ఎదుట సరెండర్ అయినట్లు పోలీసులు పేర్కొ న్నారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస విధానం తమను ప్రభా వితం చేసిందని నక్సల్స్ పోలీసులకు వివరించినట్లు కొండ గాన్ అదనపు ఎస్‌పి మహేశ్వర్ నాగ్ చెప్పారు.లొంగిపోయిన పది మంది నక్సల్స్‌లో పోలీస్ బృందంపై కాల్పులు, పేలుళ్ల ఘటనలో సంబంధాలున్న జాన్ మిలిటియా కమాండర్ వికాస్ సలాం (40)ఉన్నాడు.ఇతర జాన్ మిలిటియాలో స భ్యులు కాగా, వీరంతా22 నుంచి 40 ఏళ్ల వయసు గల వారని ఆయన తెలి పారు. ఈ పరిణామం పోలీసులు సాధించిన గొప్ప విజయమని నాగ్ పేర్కొన్నారు.

ఆస్టిన్‌లో పేలుడు ఇద్దరికి గాయాలు

ఆస్టిన్ : అమెరికాలోని ఆస్టిన్‌లో ఆదివారం రాత్రి పేలుడు సంభవించింది. ఆస్టిన్ శివార్లలోని నివాసిత ప్రాంతంలో జరిగిన పేలుడు ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. టెక్సాస్ రాజధానిలో ఈ నెల మొదట్లో మూడు వరుస బాంబుల పేలుళ్లకు ఇప్పటి పేలుడుకు సారూప్యత ఉందని పోలీసులు తెలిపారు. కొన్ని శక్తులు కావాలనే నగరంలో భయాందోళనలు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నట్లు భావిస్తున్నామని పోలీసు వర్గాలు సోమ వారం తెలిపాయి. కొందరు రోడ్డు పక్కన వెళ్లు తుండగా పేలుడు జరిగింది. ట్రిప్‌వైర్లతో పేలుడు జరిగిందని దీనితో దుండగులు అత్యంత అధునాతన రీతిలో చర్యలకు దిగుతున్నట్లు వెల్లడైందని ఆస్టిన్ పోలీసు అధికారి బ్రైయిన్ మాన్లే తెలిపారు.

రోహింగ్యాల విషయమై కేంద్రానికి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ :మయన్మార్ (బర్మా) దేశంలో మత పరమైన దాడులు ఎదుర్కొని, ఆ దేశ సైన్యం చేత తరిమివేయబడ్డ అమాయక ప్రజలు రోహింగ్యాలు. మన దేశానికి వలస వచ్చి వారు ఆశ్రయం పొందుతున్న ప్రాం తాలను సందర్శించి వారి పై ఒక నివేదిక తయారు చేయాల్సిందిగా సుప్రీం కోర్టు కేంద్రాన్ని, మరో మూడు రాష్ట్రాలను ఆదేశించింది. గతంలో రోహింగ్యాలు దేశంలోకి అక్రమంగా ప్రవేశించారని వారిని వెనక్కి పంపిస్తామని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. కానీ శరణార్థులుగా వచ్చిన వారి విషయంలో అలా వ్యవహరించడం సరికాదంటూ కేంద్రానికి మొట్టికాయ వేసిన సుప్రీం కోర్టు ముందు వారిని అక్కున చేర్చుకుని తర్వాత ఒక నిర్ణయం తీసుకోవాల్సిందిగా సూచించింది. అయితే మయన్మార్‌లో ఇంకా అక్కడి మైనారిటీలపై దాడులు జరుగుతునే ఉన్నాయి. భారతదేశానికి వేల సంఖ్యలో రోహింగ్యాలు వలస వచ్చారు. శరణార్థి శిబిరాలలో తలదాచుకుని కొంతమంది. చిన్న చిన్న గూడారాలు వేసుకుని కూలి పనులు చేసుకుని బతుకు సాగిస్తున్నారు. వారి జీవన స్థితిగతులు, ఉపాధి అవకాశాలను అంచనా వేసి వారిని తిరిగి వారి దేశానికి పంపాల లేదా అనే అంశాన్ని తేల్చనుంది ప్రభుత్వం.

లింగాయత్‌లకు ప్రత్యేక మత హోదా

● సిద్ధరామయ్య సంచలన నిర్ణయం



బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో నిర్ణయాత్మక శక్తిగా ఉన్న లింగాయత్, వీరశైవ లింగాయత్ వర్గీయులకు ప్రత్యేక మతం హోదాను కల్పించాలన్న నాగమోహన్ దాస్ కమిటీ సిఫార్సుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. సిద్ధరామయ్య నేతృత్వంలో సోమవారం సమావేశమైన కేబినెట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కమిటీ సిఫార్సు మేరకు లింగాయత్‌లకు ప్రత్యేక మత హోదా కల్పించాలని, మైనారిటీ మతస్థులుగా గుర్తించాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర కేబినెట్ ఆమోదాన్ని కేంద్రానికి పంపించాలని కూడా నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేబినెట్ సమావేశానంతరం రాష్ట్ర న్యాయశాఖ మంత్రి టిబి జయచంద్ర మీడియాకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ లింగాయత్‌లకు మతం హోదాతో పాటు మైనారిటీలుగా గుర్తించాలని సిఫారసు చేసిందని, దానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని జయచంద్ర చెప్పారు. లోతైన సంప్రదింపులు, చర్చల అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. నిపుణుల కమిటీ సిఫారసు ప్రకారం, లింగాయత్‌లు, వీరశైవులు 12వ శతాబ్దానికి చెందిన సంఘ సంస్కర్త బసవేశ్వర సిద్ధాంతాలను విశ్వసిస్తారని మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రస్తుతం ఉన్న మైనారిటీల హక్కులు, ప్రయోజనాలు ఎలాంటి భంగం వాటిల్లదని అన్నారు. కాగా, సిద్ధరామయ్య ప్రభుత్వ నిర్ణయంపై బిజెపి మండిపడింది. అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించింది. సమాజంలో విభజన రేఖలు సృష్టించేందుకు జరుగుతున్న ప్రయత్నంగా దీనిని అభివర్ణించింది. సిద్ధరామయ్య సర్కార్ నాలుగేళ్లకు పైగా ఊరుకుని ఇప్పుడే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఏమిటని ప్రశ్నించింది. లింగాయత్ కులస్థుల్లో చీలికలు తెచ్చేందుకు జరుగుతున్న కుట్ర ఇదని బిజెపి సిఎం అభ్యర్థిగా బరిలోకి దిగనున్న యడ్యూరప్ప ఆరోపించారు.

నితీశ్‌పై అనర్హత పిటిషన్ కొట్టివేసిన సుప్రీం

న్యూఢిల్లీ : బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తనపై హత్య కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని నితీష్ దాచిపెట్టారని, తక్షణమే ఎంఎల్‌సి సభ్యత్వానికి ఆయనను అనర్హుడుగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని 2012లో ఎన్నికల సంఘానికి నితీష్ తెలియజేశారని ఆయన తరుపు న్యాయవాది తమకు తెలియజేయడంతో చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా అధ్యక్షతన గల బెంచ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోలేమని పేర్కొంటూ కొట్టివేసింది. ఈ బెంచ్ లో జస్టిస్‌లు ఎఎం ఖాన్విల్కర్, డివై. చంద్ర చూడ్‌లు ఉన్నారు. 1991లో బీహార్‌లోని బర్హ్ లోక్‌సభ ఉప ఎన్నికలకు ముందు జరిగిన స్థానిక కాంగ్రెస్ నేత సీతారాం సింగ్ హత్య, మరో నలు గురు గాయపడ్డ కేసులో జెడి(యు) నేతపై క్రిమిన ల్ కేసు నమోదైందని, నితీశ్ ఈ కేసులో నిందితుడుగా ఉన్నట్లు తాను దాఖలు చేసిన పిటిషన్‌లో అడ్వకేట్ ఎంఎల్ శర్మ ఆరోపించారు. అభ్యర్థులు నామినేషన్ పేపర్లు దాఖలు చేసేటప్పుడు తమపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని అఫిడవిట్ తప్పనిసరిగా సమర్పించాలని ఎన్నికల కమిషన్ 2002లో ఒక ఉత్తర్వు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో నితీశ్ ఎంఎల్‌సి సభ్యత్వాన్ని రద్దు చేయాలని శర్మ తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. అయితే నితీష్ 2012లో మినహా 2004 నుంచి తనపై ఉన్న పెండింగ్ కేసు గురించి ఎలాంటి అఫిడవిట్లు దాఖలు చేయలేదని ఆ పిల్‌లో న్యాయవాది శర్మ పేర్కొన్నారు.

ఎన్‌డిఏతో ఉన్నారా? లేదా?

టిఆర్‌ఎస్‌ను ప్రశ్నించిన కుంతియా

మన తెలంగాణ/న్యూఢిల్లీ: ఎన్‌డిఏతో ఉన్నారా? లేదా? అనేది టిఆర్‌ఎస్ పార్టీ స్పష్టం చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కుంతియా ప్రశ్నించారు. పార్టీ ప్లీనరీలో పాల్గొనడానికి ఢిల్లీకి వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వి.హనుమంత రావు, పొన్నం ప్రభాకర్, సంపత్ కుమార్, మల్లు రవి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణలు మీడియా సమావేశం నిర్వహించారు. జైలులో ఉండగా కొంతమంది కలసి హతమార్చాలని చూస్తోందని మందకృష్ణ తన వద్దకు వచ్చి ఆవేదన వ్యక్తం చేశారని కుంతియా తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ మద్దతు ఉంటుందన్నారు. తనను హత్య చేస్తారేమో అని మందకృష్ణ భయపడుతున్నారని, కేంద్రం రక్షణ కల్పించాలని కుంతియా అన్నారు. అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత దళితులను సిఎం చేస్తానన్న కేసీఆర్ దళితులపై దాడులు చేస్తున్నారన్నారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకే 3శాతం కమిషన్ పుచ్చుకుంటున్నట్లు ఒకామె బహిరంగంగా చెప్పిందని, కెటిఆర్ పదవిలో కొనసాగే నైతిక హక్కు లేదని ఉత్తమ్ అన్నారు. సంపత్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు విషయంపై హైకోర్టు స్టే ఇవ్వడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ మీద గౌరవం ఉందని, సభ్యత్వం రద్దు విషయంపై హైకోర్టు స్టే ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ మీద గౌరవం ఉందని, కోర్టును తప్పుదోవ పట్టించాలని తెలంగాణ సర్కారు యోచిస్తోందని అన్నారు. తెలంగాణ సమస్యలపై పోరాటం కొనసాగుతుందని, వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని సంపత్ తెలిపారు. అనంతరం మందకృష్ణ మాట్లాడుతూ తనపై హత్యకు కుట్ర చేశారనడానికి తన వద్ద ఆధారాలు ఉన్నాయని సిబిఐ విచారణ వేస్తే ఆధారాలు బయటపెడతానని మందకృష్ణ అన్నారు. శాంతియుత పోరాటాలు చేశానని, తనమీద హత్యానేరం, నాన్ బెయిలబుల్ కేసులు లేవన్నారు. అలాంటి కేసులున్న వారికేం కాలేదు, కాని బెయిలబుల్ కేసు అయినా తనను జైలులో పెట్టారని, ఇదేం న్యాయం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మందకృష్ణ చేస్తున్నలాంటి ఉద్యమాలను అణచివేస్తామని సిఎం కేసీఆర్ శాసనసభలో బహిరంగంగా ప్రకటించారని గుర్తుచేశారు. వర్గీకరణ విషయంలో బిజెపి అన్యాయం చేసిందన్నారు. సిబిఐ విచారణలో తాను చెప్పింది అబద్ధమని తేలితే తెలంగాణ వీడి ఏదో ఒక రాష్ట్రంలో కూలిపని చేసుకుంటానని తెలిపారు. వర్గీకరణకు మద్దతు ఇచ్చి పార్లమెంటులో పోరాటం చేయాలని కాంగ్రెస్ నేత కుంతియాకు విజ్ఞప్తి చేశానని మందకృష్ణ తెలిపారు.

చైనా ప్రధానిగా లీకెకియాంగ్ రెండోసారి ఎన్నిక

బీజింగ్ : చైనా ప్రధానమంత్రిగా లీ కెకియాంగ్ రెం డోసారి ఎన్నికయ్యారు. అధికార కమ్యూనిస్టు పార్టీ లో రెండో స్థానంలో ఉన్న లీ.(62) మరో ఐదేళ్లు ఈ పదవిలో కొనసాగనున్నారు. చైనా అధ్యక్షుడిగా రెండోసారి షీ జిన్‌పింగ్‌ను శనివారం ఎన్నుకున్న ఆ దేశ పార్లమెంటు..ఆదివారం ప్రధానిగా లీ కెకియాంగ్‌ను ఎన్నుకుంది. గత ఐదేళ్లుగా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కలిసి పనిచేస్తున్న లీ.. నిరాడంబర వ్యక్తిగా గుర్తింపుపొందారు. ప్రధాని హోదాలో దేశ ఆర్థిక వ్యవహారాల్ని పర్యవేక్షిస్తున్నారు. కాగా, చైనా నూత న అవినీతి నిరోధక వ్యవస్థ (జాతీయ పర్యవేక్షణ కమిషన్)కు అధిపతిగా ఆ దేశ పార్లమెంటు ఆదివారం యాంగ్షియోదును ఎన్నుకుంది.పర్యవేక్షణ మంత్రిగా కొనసాగుతున్న యాంగ్ అధికార పార్టీ నేతృత్వంలోని అవినీతి నిరోధక వ్యవస్థ (సిసిడిఐ)కు ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జిన్‌పింగ్ అధ్యక్షుడయ్యాక దేశంలో అవినీతి నిరోధానికి కఠిన చర్యలు చేపట్టారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసి వారికి చట్టబద్ధమైన సదుపాయాలను కల్పించాలని ఎఐటియుసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, క్యాజువల్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద సోమవారం ధర్నా జరిగింది. ధర్నాను ఉద్దేశించి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు,ఉప ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రా జ్, ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని, కార్యదర్శులు ఎండి. యూసుఫ్, బి.చంద్రయ్య, ఎన్.కరుణకుమారి, బి.వెంకటేశం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి అజీజ్, ఎంఇఎస్ నాయకులు రాంబాబు, ఎఐటియుసి హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.నర్సింహ్మ ప్రసంగించారు.డిఆర్‌డిఓ లాబ్స్, మిలటరీ ఆస్పత్రి, ఎయిర్ ఫోర్స్, ఎంఇఎస్, సిక్యుఎ, ఎన్‌ఐఎంహెచ్,కంటోన్మెంట్‌తదితర కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ధర్నా లో పాల్గొన్నారు. ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ సుప్రీమ్ కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, 240 రోజులు పని చేసిన కార్మికులను పర్మినెంట్ చేయాలని, పెంచిన బోనస్, సెలవులు, పిఎఫ్, ఇయస్‌ఐ కార్మికుల వృద్ధాప్య పెన్షన్ నెలకు 3 వేలు చెల్లించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదన్నారు.



డేవిస్ కప్‌లో ఆడనున్న రాఫెల్ నాదల్: టోని



మాడ్రిడ్: స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ మళ్లీ టెన్నిస్ కోర్టులోకి రానున్నారు. జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తుంటికి గాయమై ప్రస్తుతం ఆయన ఆటకు దూరమయ్యారు. గతనెల అకపుల్కోలో జరిగిన మెక్సికన్ ఓపెన్‌లో రాఫెల్ ఆడలేకపోయారు. ఏప్రిల్ మొదటి భాగంలో డేవిస్ కప్‌లో స్పెయిన్, జర్మనీతో తలపడనున్నది. రాఫెల్ మామ చెప్పిన ప్రకారం ఆ ఆటకు కొన్ని రోజుల ముందుగానే రాఫెల్ టెన్నిస్ కోర్టుకు వచ్చేయనున్నాడు. 'నేను రాఫెల్‌తో మాట్లాడాను. దానిని ఆడాలన్నదే అతడి లక్ష్యం' అని టోనీ టెన్నిస్ వెబ్‌సైట్‌కు చెప్పారు. ' మేమే అతడు ఆడాలనుకుంటున్నాం. ఒకవేళ అతడు కోలుకుంటే అప్పుడు తప్పకుండా అతడు ఆడతాడు' అని చెప్పారు. పదేపదే గాయాల కారణంగా రాఫెల్ నాదల్ కెరీర్‌కు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దశాబ్ద కాలంగా తన మేనల్లుడు సమస్యలను ఎదుర్కొంటున్నాడని టోని చెప్పారు. తాను పూర్తిగా కోలుకుంటున్నానని అభిమానులకు తెలిపేలా రాఫెల్ నాదల్ ఈత కొడుతున్న ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టాడు.



కామెంటరీ బాక్స్‌లో గవాస్కర్ నాగిన్ నృత్యం!

కొలంబో: శ్రీలంకలో జరిగిన నిదాస్ ట్రోఫీ ముక్కోణపు టోర్నీ ఫైనల్‌లో భారత జట్టు, బంగ్లా జట్టుపై అనూహ్య విజయం సాధించింది. ఆటగాళ్లయితే పట్టరాని ఆనందంతో మైదానంలోకి దూసుకొచ్చి నాగిన్ నృత్యం చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇదే సమయంలో కామెంటరీ బాక్సులో భారత మాజీ క్రికెట్ స్టార్ సునీల్ గవాస్కర్ కూడా లేచి నాగిని నృత్యాన్ని అనుకరించి చూపారు. ఇప్పుడా విడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ మ్యాచ్‌కు మాజీ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, బ్రెట్‌లీ, చారు శర్మ టివి వ్యాఖ్యతలుగా బాధ్యతలు నిర్వహించారు. సునీల్ గవాస్కర్ నాగిన్ నృత్యాన్ని చూసిన అభిమానులు 'చాలా బాగా చేశావు' అంటూ కామెంట్లు పెట్టారు. కానీ బంగ్లాదేశ్ అభిమానులు మాత్రం అందుకు భిన్నంగా గవాస్కర్ నృత్యాన్ని అవహేళన చేస్తూ కామెంట్లు పెట్టారు.

దినేశ్ కార్తీక్‌ను ప్రశంసించిన కోహ్లి

కొలంబో: ప్రేమదాస్ స్టేడియంలో ఆదివారం రాత్రి జరిగిన నిదాహస్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో చివరి బంతిలో గెలుపుకు ఐదుపరుగులు చేయాల్సిన పరిస్థితి టీమిండియాది. అలాంటి స్థితిలో సౌమ్యా సర్కార్ వేసి బంతిని ఎక్స్‌ట్రా కవర్ మీదుగా సిక్సర్ బాదేశాడు దినేశ్ కార్తీక్. దీంతో భారత జట్టు నాలుగు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై చారిత్రక విజయం సాధించి ట్రోఫీని దక్కించుకుంది. 8 బంతుల్లో 29 పరుగులు చేసి తన ప్రత్యేక ఇన్నింగ్‌ను చాటుకున్న దినేశ్ కార్తీక్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎన్నికయ్యాడు. ఇప్పటి వరకు లక్ష్య ఛేదనలో భారత్ తరఫున అంతర్జాతీయ టి20 క్రికెట్లో చివరి బంతిని సిక్స్ కొట్టి జట్టును గెలిపించిన ఆటగాడే లేదు. ఈ ప్రత్యేకతను దినేశ్ కార్తీక్ సాధించాడు. టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి జట్టు క్రీడాకారులను ప్రశంసించాడు. ప్రత్యేకమైన సిక్సర్ కొట్టిన దినేశ్‌ను అభినందించాడే. తమ ట్విట్టర్ల ద్వారా సచిన్ టెండూల్కర్, జస్ప్రీత్ బుమ్రా, యూసుఫ్ పఠాన్, అశ్విన్ రవిచంద్రన్, యువరాజ్ సింగ్, వివిఎస్. లక్ష్మణ్, వృద్ధిమాన్ షా, హర్భజన్ తదితరులు కూడా ప్రశంసల జల్లు కురిపించారు. 2010లో టి20 ప్రపంచకప్‌లో శ్రీలంకకు చెందిన చమర కపుగెదర భారత్‌పై, 2012లో ఇంగ్లాండ్ ఆటగాడు ఇయాన్ మోర్గాన్ భారత్‌పై, 2013లో పాకిస్థాన్ ఆటగాడు జుల్ఫికర్‌బాబర్ వెస్టిండీస్‌పై, 2014లో టి20 ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్‌పై జింబాబ్వే ఆటగాడు ఊసిసిబాండ మాత్రమే ఇప్పటి వరకు చివరి బంతిని సిక్స్ కొట్టి జట్టు విజయంలో తోడ్పడ్డారు.



నన్ను క్షమించండి

అభిమానులకు బంగ్లాదేశ్ పేసర్ రూబెల్ హొస్సేన్ వినతి

కొలంబో: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఆదివారం జరిగిన నిదాస్ ట్రోఫీ ఫైనల్‌లో జట్టు ఓటమికి కారణమైనందుకు బంగ్లాదేశ్ పేసర్ రూబెల్ హొస్సేన్ పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు. తాను ధారళంగా పరుగులు ఇచ్చిన కారణంగానే జట్టు ఓటమి పాలైందని, ఇందుకు అభిమానులు తనని క్షమించాలని విజ్ఞప్తి చేశాడు. ఓటమికి తానే కారణమవుతానని ఊహించలేదని ఈ బంగ్లా బౌలర్ ఆవేదన వ్యక్తం చేశాడు. 167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 18 ఓవర్లు ముగిసే సరికి 5 వికెట్లు కోల్పోయి కేవలం 133 పరుగులు చేసింది. ఆ సమయంలో క్రీజులో పాతుకుపోయిన బ్యాట్స్‌మెన్‌లు కూడా లేరు. ఓ వైపు జిడ్డు బ్యాటింగ్‌తో భారత్ ఓటమి అంచుకు చేర్చిన విజయ్ శంకర్ ఉండగా, అప్పుడే క్రీజులోకి దినేశ్ కార్తీక్ వచ్చాడు. ఇంకా భారత్ విజయానికి 12 బంతుల్లో 34 పరుగులు అవసరం. 19వ ఓవర్ వేసేందుకు రూబెల్ హొస్సేన్ సిద్ధమయ్యాడు. ఇక బంగ్లా విజయం కాయమని అందరూ భావించారు. ఎందుకంటే అప్పటికే రూబెల్ 3 ఓవర్లు వేసి కేవలం 13 పరుగులిచ్చి రెండు వికెట్లు తీసాడు. ఈ కారణంగానే బంగ్లా జట్టు కెప్టెన్ షకీబ్ అల్ హసన్ ముందుగానే రూబెల్‌కు బంతి ఇచ్చాడు. కానీ కార్తీక్ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ వరుస బంతుల్లో 6, 4, 6, 0, 2, 4 లతో 22 పరుగులు చేశాడు. దీంతో చివరి ఓవర్లో భారత్ లక్ష్యం 12 పరుగులకు చేరడం కార్తీక్ విన్నింగ్ షాట్‌తో భారత్‌ను గట్టెక్కించడం చకచకా జరిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే ఓటమి తనవల్లేనని భావించిన రూబెల్ అభిమానులను క్షమించమని కోరాడు.



క్లీన్ స్వీప్ సాధించిన ఆసీస్ మహిళా జట్టు

స్మృతి,జెమీమా దీటుగా ఆడగా.. మిగతావారు విఫలం



వడోదర: ఇక్కడి రిలయన్స్ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన తుది అంతర్జాతీయ వన్డేలో భారత మహిళా జట్టుపై ఆస్ట్రేలియా మహిళా జట్టు 97 పరుగుల తేడాతో విజయం సాధించింది. 3–0తో సిరీస్‌లో క్లీన్ స్వీప్‌ను కూడా సాధించింది. అలిస్సా హీలి తన శతకంతో భారత మహిళా జట్టును విస్మయపరిచింది. ఆస్ట్రేలియా మాజీ వికెట్‌కీపర్ ఇయాన్ హీలి మేనకోడలైన అలిస్సా 115 బంతులు ఎదుర్కొని 133 పరుగులు చేసింది. అందులో 17 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. టాస్ గెలిచాక ఆస్ట్రేలియా జట్టు 7 వికెట్ల నష్టానికి 332 పరుగుల లక్ష్యాన్ని పెట్టింది. ఓపెనర్ నికోలె బోల్టన్‌ను ఏక్తా బిస్త్ క్యాచౌట్ చేశాక కూడా ఆసీస్ జట్టు ఇంత మొత్తాన్ని చేసింది. భారత్ తరఫున స్మృతి మంధన, జెమీమా రోడ్రిగ్స్ దీటుగా ఆడారు. 13 ఓవర్లలో వారు 101 పరుగులు జత చేశారు. 97 పరుగుల తేడాతో మ్యాచ్‌లో. 3–0 తేడాతో సిరీస్‌లో ఆస్ట్రేలియా మహిళా జట్టు విజయం. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్: అలిస్సా హీలి. ప్లేయర్ ఆఫ్ ద సిరీస్: నికోలె బోల్టన్.

క్లుప్తంగా స్కోర్లు: ఆస్ట్రేలియా: 332/7(50 ఓవర్లు), భారత్: 235/9(44.4 ఓవర్లు).

పోంజి సంస్థపై ద్రవిడ్ ఫిర్యాదు

ఇంకా రూ. 4 కోట్లు రావాల్సి ఉంది



బెంగళూరు: బెంగళూరుకు చెందిన ఓ ప్రైవేట్ పోంజి సంస్థ, పలువురు సెలబ్రిటీలను కోట్లలో మోసం చేసిన సంగతి తెలిసిందే. ఈ పోంజి సంస్థ మోసం చేసిన బాధితుల్లో భారత మాజీ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్, బ్యాడ్మింటన్ దిగ్గజం ప్రకాశ్ పదుకొణె, బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్, మాజీ కర్ణాటక క్రికెటర్ అవినాష్ వైద్య తదితరులు ఉన్నారు. తాజాగా ఈ పోంజి సంస్థకు వ్యతిరేకంగా భారత క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ పోలీసు ఫిర్యాదు దాఖలు చేశాడు. తన ఫిర్యాదులో 'విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్ 'అనే కంపెనీలో ఎక్కువ ఆదాయం వస్తుందనే ఆశతో రూ.20 కోట్లను పెట్టుబడిగా పెట్టినట్టు తెలిపారు. అయితే అసలు కన్నా తక్కువగా కేవలం రూ.16 కోట్ల మాత్రమే వెనక్కి వచ్చినట్టు పేర్కొన్నారు. తాను పెట్టిన పెట్టుబడుల మేరకు ఇంకా కంపెనీ తనకు రూ.4 కోట్లు బాకీ ఉందని చెప్పారు. ఇందిరానగర్ పోలీసు స్టేషన్‌లో క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ తన ఫిర్యాదును దాఖలు చేశాడు. ఈ ఘరానా మోసం కేసును విచారిస్తున్న బనశంకరీ పోలీసులకు అతడి ఫిర్యాదును బదిలీ చేశారు. ఈ పోంజి సంస్థ కుంభకోణం రూ.500 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. 'విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్' కంపెనీ యజమాని రాఘవేంద్ర శ్రీనాథ్‌ని, అతని ఏజెంట్లు సుత్రం సురేశ్, నరసింహమూర్తి, కె.జి. నాగరాజు, ప్రహ్లాద్‌ను బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే సురేశ్ అనే నిందితుడు బెంగళూరులో ప్రముఖ స్పోర్ట్స్ జర్నలిస్టు. తనకు పరిచయం ఉన్న క్రీడాకారులను ఈ మోసపూరిత కంపెనీలో పెట్టుబడి పెట్టేలా నమ్మించడంలో కీలకపాత్ర పోషించాడని పోలీసులు తెలిపారు. నిందితులను 14 రోజుల పోలీసు కస్టడీకి పంపించారు. వీరి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నట్టు ఓ పోలీసు ఆఫీసర్ చెప్పారు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు, ఈ పోంజి స్కాంలో పెట్టుబడులు పెట్టిన పెట్టుబడిదారుల పేర్లను వెల్లడించారు. అంతేకాక వారి బ్యాంకు ఖాతాలను కూడా అధికారులు తనిఖీ చేస్తున్నారు.

నోరు విప్పిన పాక్ అమ్మాయి

షమీ మ్యాచ్ ఫిక్సింగ్ వివాదం



ముంబయి: భారత క్రికెటర్ మహ్మద్ షమీ సోమవారం మరింత చిక్కులో పడ్డారు. దుబాయ్‌లో స్పీడ్ బౌలర్ షమీతో సమావేశమయ్యానని పాకిస్థాన్ అమ్మాయి అలీష్బా ధ్రువీకరించింది. ఇప్పటికే ఇంగ్లాండ్ వ్యక్తి మహ్మద్ భాయ్ ద్వారా అతడికి ఆమె డబ్బు అందజేసిందన్న ఆరోపణ ఉంది. ఆ ఆరోపణను చేసింది కూడా షమీ భార్య హసీన్ జహాన్ అని అంటున్నారు. ఇప్పటికే షమీ వ్యవహారంపై వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని అవినీతి సంస్థ అధిపతి నీరజ్ కుమార్‌ను నిర్వాహకుల కమిటీ(సిఓఎ) చీఫ్ వినోద్ రాయ్ ఆదేశించారు. ఇన్నాళ్లు మీడియాలో ఊహాగానాలు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో తాజాగా పాకిస్థాన్ అమ్మాయి అలీష్బా తెరపైకి వచ్చి తన వాదనను వినిపించింది. గత ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ చేతిలో భారత్ అనూహ్యంగా ఓడిపోయినప్పటి నుంచే షమీతో తనకు పరిచయం ఉందని ఆమె పేర్కొంది. నాడు భారత్ జట్టు 180 పరుగుల తేడాతో పాకిస్థాన్ జట్టు చేతిలో ఓడిపోయింది గమనార్హం. 'అవును.. నేనతడిని కలిసాను' అని ఆమె ఎబిపి న్యూస్‌కు చెప్పింది. షార్జాలో నివసించే నా సోదరిని చూడ్డానికి నేను తరచూ దుబాయ్‌కు విమాన ప్రయాణం చేస్తుంటాను. అందరు అభిమానుల్లాగే నేను కూడా అతడిని కలిసాను' అని అలీష్బా తెలిపింది. 'దక్షిణాఫ్రికా నుంచి దుబాయ్ గుండా షమీ విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు నేను కూడా యాదృచ్ఛికంగా ప్రయాణించాను' అని ఆమె తెలిపింది. ఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోయినప్పుడు అభిమానితో తీవ్ర వాగ్వివాదానికి దిగిన ఈ షమీ ఎవరో తెలుసుకోవాలన్న కుతూహలంతోనే నేను అతడిని చూడాలనుకున్నాను అని తెలిపింది. షమీకున్నా లక్షలాది అభిమానుల్లో నేనూ ఒకదాన్నని స్పష్టం చేసింది. మహ్మద్ భాయ్ ఎవరో తనకు తెలియదని ఆమె చెప్పింది. తాను నేరుగా తన సోదరి ఇంటికి వెళ్లానని, అయితే మారునాడు ఉదయం 9.00గంటలకు హోటల్‌కు వెళ్లి షమీతో బ్రేక్ ఫాస్ట్ చేశానని, మా మధ్య డబ్బు లావాదేవీలు ఏమీ జరగలేదని, ఎవరితో అబద్ధం కూడా చెప్పని వ్యక్తి దేశానికి ఎలా ద్రోహం చేయగలడని అలీష్బా అన్నది.

ఏప్రిల్ 3న క్రికెట్ డిజిటల్ హక్కుల ఇ-వేలం

- **మూడు ప్యాకేజిలకు కనీస ధర రూ. 33 కోట్లు, రూ. 7 కోట్లు, రూ. 40 కోట్లు**



ముంబయి: ఏప్రిల్ 2018 నుంచి 2023 వరకు దేశంలో ఆడే అంతర్జాతీయ మ్యాచ్‌లు , దేశవాళి మ్యాచ్‌ల గ్లోబల్ టెలివిజన్ రైట్స్, రెస్టాఫ్ ద వరల్డ్ డిజిటల్ రైట్స్ ప్యాకేజి(జిటివిఆర్‌డి) మ్యాచ్ ఒక్కింటికి విలువ(పిఎంవి)ని రూ. 33 కోట్లు, భారతీయ ఉపఖండానికి డిజిటల్ రైట్స్ ప్యాకేజి(ఐడి)ని రూ.7 కోట్లు, గ్లోబల్ కన్సాలిడేటెడ్ రైట్స్ ప్యాకేజి(జిసిఆర్)ని రూ. 40కోట్లుగా బిసిసిఐ నిర్ధారించింది. ఇందుకు టెండర్ ఆహ్వానాలు(ఐటిటి) కూడా బిసిసిఐ పిలిచింది. ఐదేళ్లకు ఒక్కోదానికి అర్హత ఉన్న పార్టీలు బిడ్ చేయవచ్చు. 2018–19లో 21 గేములు, 2019–20లో 23 గేములు, 2020–21లో 14 గేములు, 2021–22లో 23 గేములు, 2022–23లో 21 గేములు...వీటికి తోడు 102 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఉండనున్నాయి. ఇ–కామర్స్ కంపెనీ ఎంజంక్షన్ రూపొందించిన 'ఆక్షన్ ఇంజిన్' వెబ్‌సైట్‌లో ఇ–వేలం జరుగుతుంది. వేలంలో పాల్గొనదలచిన కొందరు డిజిటల్ హక్కులపై ప్రశ్నలు వేసినందున మార్చి 27 నుంచి ఏప్రిల్ 3 వరకు జరగాల్సిన ట్రయల్‌బ్లేజింగ్ ఇ–వేలాన్ని ఆపేశారు. సందేహాలున్న వారికి మరి కొంత సమయం ఇవ్వాలని బిసిసిఐ నిర్ణయించింది. ఆన్‌లైన్ వేలంకు సంబంధించిన వర్క్‌షాప్‌ను మార్చి 7న నిర్వహించారు. భారత్‌లో జరిగే ప్రతి టెస్ట్ మ్యాచ్, వన్డే, టి20లకు రూ. 43 కోట్లు ఇవ్వాలన్న దానిపై స్టార్ ఇండియా అనేక సందేహాలు వ్యక్తం చేసింది. ఆరేళ్ల క్రితం ఎవరు కూడా డిజిటల్ హక్కులకు బిడ్ చేయలేదు. కానీ ఏప్రిల్ 3న వాటిని వేలానికి వేయనున్నారు. ఐపిఎల్ హక్కులకు స్టార్ ఇండియా, సోని పిక్చర్స్ నెట్‌వర్క్(ఎస్‌పిఎన్) ఇండియా, భారత ఉపఖండం డిజిటల్ హక్కులకు ఫేస్‌బుక్, రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, స్టార్ అండ్ టైమ్స్ ఇంటర్నెట్ పోటీపడనున్నాయి. ఫేస్‌బుక్ రూ. 3900, ఎయిర్‌టెల్ రూ. 3280, జియో రూ. 3075 కోట్లు బిడ్ చేశాయి. ఏది ఏ మైనప్పటికీ ఏప్రిల్ 3న ఫలితాలు తెలియగలవు. ఐదేళ్ల కాలానికి మీడియా హక్కుల ద్వారా బిసిసిఐ రూ. 4000 కోట్లకు మించి ఆదాయం పొందనున్నదని తెలుస్తోంది.

మాకిదే చివరి వరల్డ్ కప్: లియోనల్ మెస్సీ

బ్యూనస్ ఎయిర్స్: నాలుగేళ్ల కిత్రం ప్రపంచ కప్‌లో ఓడిపోయిన తమ తరం జట్టుకిదే చివరి అవకాశం అని అర్జెంటీనా స్టార్ స్ట్రయికర్ లియోనల్ మెస్సీ చెప్పారు. అర్జెంటీనా జట్టులోని మెస్సీ, సెర్గియో అగుయెరో, గొంజాలో హిగ్వ్యుయిన్, ఏంజెల్ డి మరియా, నికోలస్ ఓటమేండి, జేవియర్ మస్చరనో రష్యాలో జరగనున్న ప్రపంచ కప్ నాటికి 30 ఏళ్లు దాటనున్నారు. మెస్సీ జూన్‌లో 31వ సంవత్సరంలోకి ప్రవేశించనున్నాడు. మెస్సీ ఆదివారం అర్జెంటీనా టివి 'లా కోర్నిస'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫలితాలు తమకు అనుకూలంగా రావాలని, లేదేనీ తాను, తన సహచరులు చరిత్రపుటలో తమ పేర్లు నమోదుచేసుకోకుండానే నిష్క్రమించాల్సి ఉంటుందన్నారు. 'ఫైనల్‌లో మేము ఉంటామనుకుంటున్నా(మాస్కోలో జులై 15న). ట్రోఫీని కూడా సాధిస్తామనుకుంటున్నా' అని మె స్సీ చెప్పాడు. 2014లో బ్రెజిల్‌లో జరిగిన ప్రపంచ కప్‌లో తమ జట్టు ఎక్స్‌ట్రా టైమ్‌లో జర్మనీ జట్టు చేతిలో పరాజయం చవిచూసిందని ఆయన పేర్కొన్నారు. 'నేను చాలాసార్లు ఏడ్చాను. ఫైనల్స్‌లో ఇలా గెలవకపోవడం ఏమిటని...దేశ కలలు సాకారాం చేయలేకపోవడమేమిటని శోకించాను' అని మెస్సీ చెప్పుకొచ్చాడు. 'ప్రపంచ కప్ మ్యాచ్ దగ్గరపడుతోంది. నా ఆలోచన అంతా దానిమీదే. కానీ ఇక్కడ బార్సిలోనాలో కూడా నేను చేయాల్సిన ముఖ్యమైన పనులున్నాయి' అని అన్నాడు. 'నా కుటుంబం, నా భార్య, పిల్లలతో ఉండడం నా బాధలన్నింటినీ మరిపించేస్తుంది. విశ్రాంతి అన్నది తర్వాతి విషయం. నా పెద్ద కొడుకు జననం నన్ను ఫుట్‌బాల్‌కు దూరం కాకుండా ఆశలు నింపింది. నేను ఓడిపోవాలనుకోను...కానీ అన్ని సందర్భాల్లో గెలవడం కూడా మనకు కుదరదు కదా' అని మెస్సీ చెప్పాడు. అర్జెంటీనా ఉన్న గ్రూపులో ఐస్‌ల్యాండ్, క్రొయేషియా, నైజీరియా ఉన్నాయి.



ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ విజేత తైజు



బర్మింగ్‌హామ్: ప్రపంచ బ్యాడ్మింటన్ మహిళల నంబర్‌వన్ తైజు యింగ్ ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్‌లో తనకు తిరుగులేదని చాటుకుంది. ఈ చైనీస్ తైపీ షట్లర్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో సింగిల్స్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. సెమీస్‌లో భారత స్టార్ పి.వి. సింధుపై అద్భుత విజయం సాధించిన జపాన్‌కు చెందిన ప్రపంచ రెండో ర్యాంకర్ అకానె యమగుచి ఫైనల్లో టాప్‌సీడ్ తైజు ధాటికి నిలవలేకపోయింది. 45 నిమిషాలపాటు సాగిన ఏకపక్ష పోరులో తైజు 22–20, 21–13తో యమగుచిని ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ఏడోసారి ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ నెగ్గాలనుకున్న చైనా స్టార్ లిన్ డాన్ ఆశలు ఫలించలేదు. ఫైనల్లో చైనాకే చెందిన షియుకి 21–19, 16–21, 21–9తో డాన్‌ను చిత్తుచేసి విజేతగా నిలిచాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.